

రిమ్స్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల ఆందోళన బాట

● జిల్లావ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసనలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మరోసారి రోడ్డెక్కారు. ప్రభుత్వం దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లిన పట్టించుకోకపోవడంతో రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేఏసీ ఛైర్మన్ కూచిపూడి శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ఎక్కడికక్కడ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 27వతేదీ వరకు దశల వారీగా ఆందోళనలకు జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తమ తమ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్స్, ఎస్‌ఈఎల్, పీఆర్సీ అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, 12వ పీఆర్సీని ప్రకటించాలని, ఐఆర్‌ను విడుదల చేయాలని, ఉద్యోగులపై వత్తిడిని తగ్గించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు, ధర్నాలు, 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, 20న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటి కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తోందని జేఏసీ జిల్లా ఛైర్మన్ శరత్‌బాబు హెచ్చరించారు.



ఆందోళన కారులతో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

మంత్రి నాగార్జున ఇంటిముట్టడి

● దగా కాదు మెగా డీఎస్సీ కావాలి

● యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 14: దగా కాదు మెగా డీఎస్సీ కావాలంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ఇంటిని నిరుద్యోగులు బుధవారం ముట్టడించారు. స్థానిక పాత బైపాస్ రోడ్డులోని బులెట్ షోరూం సమీపంలో గల మంత్రి ఇంటిని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బీఆర్‌గౌస్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతోపాటు, నిరుద్యోగులు కొంతమంది కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడే బైఠాయించి నినాదాలు చేయడంతో మంత్రి నాగార్జున ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. యువత సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాట్లాడారు. అంతేకాకుండా ఈ విషయం సీఎం స్థాయిలో ఉందని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని తెలిపారు. అయితే మెగా డీఎస్సీపై మంత్రి సమాధానం చెప్పాలని అందరూ డిమాండ్ చేయడంతో సమాధానం చెప్పకుండా వెనుదిరిగారు. ఇదే సమయంలో ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని అందరినీ పంపించి వేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, నాయకులు బండి కిషోర్, కోప్పుల సాయి, రాయిపాటి గిడియాన్, దండ్రుప్రోలు ప్రసాద్, గుత్తి రాజు పాల్గొన్నారు.

పొమ్మనకుండా పొగబెట్టారు

వైసీపీ తీరుతో ఎంపీ తీవ్ర అసంతృప్తి



పరోక్షంగా టికెట్ లేదని వైసీపీ అధిష్ఠానం సంకేతాలిచ్చినా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చివరికంటా వేచి ఉన్నారు. చివరిగా ఢిల్లీ వెళ్లిన సీఎం జగన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఎదురేగినా పట్టించుకోలేదు.) జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు కూడా కలిసేందుకు జంకుతున్నారు. దీంతో ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి రంగంలో నిలిచేందుకు మాగుంట వ్యూహాత్మకంగా అడుగులేస్తున్నారు. ఆ మేరకు టీడీపీ నుంచి ఆయనకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు ఈసారి ఎన్నికల సమరంలోకి ఆయన కుమారుడు రాఘవరెడ్డిని దింపేందుకు మాగుంట కుటుంబం కూడా సిద్ధమైనట్లు సమాచారం. తదనుగుణంగా బుధవారం ఒంగోలు వచ్చిన మాగుంట తన సన్నిహితులకు సంకేతం కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది.

త్వరలో టీడీపీలోకి మాగుంట?


బుధవారం అనుచరులతో మంతనాలు

ఒంగోలు లోక్‌సభ వదిలేది లేదంటూ స్పష్టం

పోటీకి సిద్ధమైన కుమారుడు రాఘవరెడ్డి

కుటుంబ సభ్యులదీ అదే నిర్ణయం

మర్యాదగా కూడా కలవని చెవిరెడ్డి



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి గత ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలుపొందిన మాగుంట రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించకపోయినా గట్టిగా నిలబడ్డారు. వ్యాపారపరంగా, రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వైసీపీలోనే ఉంటూ ముందుకు సాగారు. ఏ సందర్భంలోను అసంతృప్తిని కానీ జగన్‌పై అయిష్టతను కానీ వ్యక్తం చేయలేదు. అయితే గత ఆరునెలల నుంచి వైసీపీ అధిష్ఠానం ముఖ్యంగా జగన్మోహనరెడ్డి మాగుంటను దగ్గరకు రానివ్వటం లేదు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆయన చిక్కుకున్నా మర్యాదపూర్వకంగా కూడా ఏం జరిగిందని తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అయినా అభ్యర్థుల ఎంపిక సందర్భంగా తిరిగి వైసీపీ నుంచి పోటీ చేసేందుకు తనవంతు ప్రయత్నం చేశారు. టికెట్ కావాలంటే చెప్పినట్లు చేయాలని మాగుంట మనస్తత్వానికి విరుద్ధమైన షరతులను సీఎం విధించారు. వాటిని అమలు చేయలేదనే సాకుతో దూరంగా ఉంచారు. ఆయన తరఫున మాట్లాడేందుకు ప్రయత్నించిన విజయసాయిరెడ్డి, బాలినేనిలను సీఎం ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా తన షరతులు అమలుచేయని వ్యక్తి తన ఇంటి గడప కూడా తొక్కటానికి వీల్లేదంటూ సాయిరెడ్డి ద్వారా సంకేతం పంపారు. పైగా ఒంగోలు లోక్‌సభకు ప్రత్యామ్నాయ అభ్యర్థిని రంగంలోకి తెచ్చే ప్రయత్నాలకు శ్రీకారం పలికారు.

ఒంగోలు వచ్చినా కలవలేదు

మరోవైపు వైసీపీ అధినేత ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేరును ఖరారు చేశారు. అంతేగాక ఆయనను వ్యతిరేకిస్తున్న బాలినేనికి సర్దిచెప్పుకున్నారు. ఇదే సమయంలో ఒంగోలు వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు కూడా వైసీపీ నాయకులు ప్రయత్నించటం లేదు. పైగా ఆయన్ను కలిస్తే ఏమవుతుందో అన్న చందంగా నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు కొందరు వ్యవహరించారు. బుధవారం ఒంగోలు వచ్చిన చెవిరెడ్డి రెండు రోజుల క్రితం జగన్‌తో అన్ని విషయాలు మాట్లాడుకుని ఒంగోలులో పోటీచేసేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే బాలినేని కూడా ఆయన్ను కలవలేదు. పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా తొలిసారి ఒంగోలు వచ్చిన చెవిరెడ్డి ఒంగోలులోనే ఉండి తనకు సుపరిచితుడైన సొంత పార్టీ ఎంపీ మాగుంటను కలవకపోగా ఆయన ఒంగోలు వస్తున్న సమాచారాన్ని కూడా ఇవ్వలేదు. తద్వారా వైసీపీ అధిష్ఠానం ఎత్తుగడ తేటతెల్లమైంది.

అవమానాలతో విసిగిపోయి..

సహనానికి, అందరినీ గౌరవించాలనే మనస్తత్వానికి మారుపేరైన మాగుంట చివరి ప్రయత్నంగా జగన్‌ను కలిసేందుకు విఫలయత్నం చేశారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన జగన్‌కు పార్లమెంట్‌లో నేరుగా ఎదురేగి రెండు చేతులు జోడించి నమస్కరించారు. మర్యాద కోసమైనా మాగుంటను ఆయన పలకరించకపోగా తలతిప్పుకుని వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో మాగుంట అభిమానులు కుటుంబీకుల నుంచి మాగుంటపై ఇంకా ఎదురుచూపులు అనవసరమన్న అభిప్రాయాన్ని తెలియజేసినట్లు తెలిసింది. మరోవైపు గతంలో ఉన్న సంబంధాలతో మాగుంటను చేరదీసుకునేందుకు టీడీపీ నుంచి సంకేతాలు ఆయనకు అందాయి. అంతేగాక మాగుంట వ్యాపారపరంగా రాష్ట్రప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదురైనప్పుడు అలాగే కేసులతో ఇబ్బందిపడుతున్నప్పుడు తెలుగుదేశం పార్టీ చెందిన ముఖ్య నేతల నుంచి పలకరింపు లభించినట్లు తెలిసింది. పార్టీ ముఖ్యనేతతో పాటు కిందిస్థాయిలోని టీడీపీ శ్రేణులు కూడా గతంలో ఉన్న పరిచయంతో ఆయన సమాచారం తెలుసుకుని ఓదార్చేందుకు ప్రయత్నించారు. సొంత పార్టీ నుంచి కనీస పలకరింపులు కూడా లేకపోయినా విపక్ష టీడీపీ నేతలు, శ్రేణుల నుంచి లభించిన ఆదరణ ఆయన కుటుంబసభ్యులలో వారిపట్ల అభిమానానికి కారణమైంది.

ఒంగోలులోనే ఉండాలి, రాజకీయాల్లో కొనసాగాలి

ఈ మొత్తం క్రమంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసిన మాగుంట కుటుంబీకులు ఇటీవల సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించుకున్నట్లు తెలిసింది. గత 35 ఏళ్లుగా రాజకీయంలో ఉన్న తమ కుటుంబం ముందు కూడా రాజకీయంలోనే కొనసాగాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒంగోలు లోక్‌సభను వీడకూడదని, అక్కడి నుంచే పోటీచేయాలని, యువకుడైన శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని రంగంలోకి దింపాలని కుటుంబసభ్యులంతా అభిప్రాయపడినట్లు తెలిసింది. అంతేగాక కాదు పొమ్మంటున్న జగన్ దయాదాక్షిణ్యాల కోసం ప్రాధేయపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకోవాలని శ్రీనివాసరెడ్డికి కుటుంబసభ్యులు కూడా సూచించినట్లు సమాచారం. ఇదే సమయంలో గతంలో ఉన్న పరిచయాలు తనకిచ్చిన ఆహ్వానపు సంకేతాలను దృష్టిలో ఉంచుకుని మాగుంట టీడీపీ అధినేతకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. తన సన్నిహితుడైన నెల్లూరుకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి ఆయన టీడీపీ నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. తొలుత ఒంగోలు లేదా నెల్లూరు అవసరమైతే రెండుచోట్లా తండ్రీ కొడుకులకు అవకాశం ఇస్తామని చెప్పిన టీడీపీ నేతలు వేమిరెడ్డి రానుండటంతో ఆయనకు నెల్లూరు లోక్‌సభ స్థానాన్ని కేటాయించి ఒంగోలు లోక్‌సభకు పోటీచేయమని మాగుంటకు సూచించినట్లు సమాచారం. అయితే ముందునుంచి అనుకుంటున్నట్లు ఆయన కుమారుడు రాఘవరెడ్డిని ఒంగోలు లోక్‌సభ నుంచి బరిలో నిలపాలని మాగుంట భావిస్తున్నట్లు తెలిసింది.

అభిమానులు, సన్నిహితులతో చర్చలు

బుధవారం ఒంగోలు వచ్చిన మాగుంటను ఆయన అభిమానులు, సన్నిహితులు, అనుచరులు కలిశారు. రాజకీయాలకు దూరంగా ఉండే ఆయా వర్గాల ప్రముఖులతో పాటు అధికారులు కూడా కలిశారు. మాగుంట కూడా వివిధ కార్యక్రమాల పేరుతో వైసీపీలోను అలాగే రాజకీయంగా తటస్థంగా ఉండే కొందరు ఇళ్లకెళ్లి వాళ్లను పలకరించి వచ్చారు. ఆ సందర్భంగా వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంలో ఆయన తాము ఒంగోలు లోక్‌సభ నుంచి బయటకు పోవటం లేదని, తన కుమారుడు పోటీ చేస్తారని స్పష్టంగా చెప్పినట్లు కూడా సమాచారం. ఇప్పటికే ఆయన టీడీపీలో చేరతారన్న వార్తలను ఖండించలేదు. పైగా కేంద్రంలో బీజేపీ పెద్దలతో కూడా టచ్‌లో ఉన్నారు. దీంతో ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఎన్నికల అవగాహన కుదిరినట్లు వార్తలొస్తున్నాయి. దీంతో మాగుంట కుమారుడు రాఘవరెడ్డి ఒంగోలు లోక్‌సభకు ఆ కూటమి అభ్యర్థిగా రంగంలోకి రావటం ఖాయమన్న భావన ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. ఈ అభిప్రాయం వ్యక్తంచేసిన సన్నిహితులకు మాగుంట నుంచి నవ్వే ఎదురైంది తప్ప కాదు కూడదన్న సమాధానం రాకపోవటం విశేషం.



ఒంగోలులో వైసీపీ నేత గొర్రెపాటి ఇంటికి వెళ్లిన ఎంపీ మాగుంట

జగనన్న ఇళ్ల స్థలాలపై హైడ్రామా

హైకోర్టులో వైసీపీ నేత పిల్

శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం

కలెక్టర్, ఎమ్మెల్యేతోపాటు మరికొన్న విభాగాలను ప్రతివాదులుగా దాఖలు

అర్హులకు ఇవ్వడం లేదంటూ ఆరోపణ



భూములను చదును చేస్తున్న ట్రాక్టర్ (ఫైల్)

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 14 : వైసీపీ ప్రభుత్వం పథకాల్లో భాగమైన నవరత్నాలలో ఒకటైన పేదలకు జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ వ్యవహారంపై హైడ్రామా నడుస్తోంది. ఆ స్థలాలు అర్హులకు ఇవ్వడం లేదంటూ అధికారపార్టీకి చెందిన నాయకుడే హైకోర్టులో పిల్ వేశారు. దీని వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ కీలక నేతలే కావాలని ఇదంతా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు నగర పరిధిలో 25వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ కోసం ప్రభుత్వం ఒంగోలు సమీప మల్లేశ్వరపురం, ఎన్.అగ్రహారం, వెంగముక్కలపాలెం, యరజర్ల గ్రామాల్లో సుమారు 435 ఎకరాలను 270 మంది రైతుల నుంచి కొనుగోలు చేసింది. అంతేకాకుండా ఈ నెలలోనే పేదలకు పట్టాలను పంపిణీ చేయాలని వైసీపీ నేతలు నిర్ణయించారు. పనుల్లో జాప్యం జరిగితే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందన్న భావనలో రైతుల ఖాతాలోకి డబ్బులు జమచేయడంతోపాటు, ఆయా స్థలాల్లో లేఅవుట్ పనులు వేగవంతం చేశారు. జంగిల్ క్లియరెన్స్, క్వారీ రబ్బీష్ రోడ్లు, అలాగే హద్దురాళ్లు తదితరాలు కలిపి మొత్తంగా 12 రకాల పనులు చేపట్టారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే బాలినేని ఆయా స్థలాలను పరిశీలించడమే కాకుండా ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీలోపు సీఎం చేతులమీదుగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, పట్టాల పంపిణీకి గుర్తించిన వారిలో అర్హులకు అన్యాయం జరిగిందంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, అందరికీ కుల, దామాషా ప్రకారం పట్టాలు అందించాలని వైసీపీ నాయకుడు శింగరాజు మంగళవారం డబ్ల్యూపీ/6146/2024, డబ్ల్యూపీ (పిల్) 6085/2024 నెంబరుతో హైకోర్టులో పిల్ వేశారు. దీంతో వైసీపీ నేతల పిటీషన్ స్వీకరించిన కోర్టు ఈనెల 16న శుక్రవారం దీనిపై విచారణ చేయనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు పట్టాల పంపిణీలో అడ్డంకులు ఎదురైతే అది టీడీపీ వారిదే బాధ్యత అని వైసీపీ నేతలు మొదటి నుంచి ఆరోపిస్తుండగా, ఈ పట్టాల వ్యవహారంలో అధికారపార్టీ నేతే పిల్ వేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

కలెక్టర్, ఎమ్మెల్యే ప్రతివాదులుగా..

ఇళ్ల పట్టాల పంపిణీలో పేదలకు న్యాయం చేయాలని శింగరాజు రాంబాబు 50పేజీలతో హైకోర్టుకు సమర్పించిన పిల్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి కలెక్టర్, ఎమ్మెల్యే, ఒంగోలు ఆర్డీఓ, ఒంగోలు తహసీల్దారు, నగర కమిషనర్‌తోపాటు రాష్ట్రప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, భూసేకరణ చీఫ్ కమిషనర్, ఏపీ (ఎఫ్ఎంయు-రెవెన్యూ) ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అయితే పిటిషనరు తరఫున ఎన్.రవిప్రసాద్ (6069) కోర్టులో పిల్ దాఖలు చేశారు.

రేపు విచారణ

ఇప్పటివరకు ఇళ్ల పట్టాల పంపిణీకి ఎలాంటి అడ్డంకులు లేవని, అలాగే మరో వారం పదిరోజుల్లో పేదలకు పట్టాలు చేతికందుతాయని భావించిన క్రమంలో హైకోర్టులో కేసు వేయడంపై ఇపుడు అధికారపార్టీలో చర్చ మొదలైంది. అయితే రెండు రోజుల గడువుతో పిల్‌పై తగిన వివరాలు వెల్లడించాలని హైకోర్టు ఆదేశించగా, ఈనెల 16న శుక్రవారం దీనిపై విచారణ జరగనుంది.

అర్హులైన పేదలకు న్యాయం కోసమే

నేను అధికారపార్టీ నేత అయినప్పటికీ, ప్రజాప్రయోజనం కోసమే కోర్టును ఆశ్రయించా. నగరంలో 25వేలమందికి పట్టాల పంపిణీ మంచి అంశమైనప్పటికీ అర్హులకు మాత్రం అన్యాయం జరుగుతుంది. నగరపరిధిలో 1.60లక్షల మంది ఓటర్లు ఉండగా, 67వేల డోరు నంబర్లు ఉన్నాయి. 3 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. అయితే వీరిలో అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు. పేదలకు సొంతిల్లు లేక నేటికీ అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాల పంపిణీలో వైసీపీకి చెందిన వారు, వారి కుటుంబసభ్యులే అధికంగా ఉన్నారు. అందుకే పేదలకు న్యాయం జరిగేలా ప్రజా ప్రయోజనం కింద కోర్టును ఆశ్రయించా.

- శింగరాజు రాంబాబు, వైసీపీ నేత

తాజా పరిణామాలలో అందరి దృష్టి ఆవైపే

రా.. అన్న పిలుపుతో కదులుతున్న జనం

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ నాయకులు

ఏలూరి క్యాంపు ఆఫీసులో నేతల సమావేశం



ఇసుకదర్శి క్యాంప్ కార్యాలయంలో మంతనాలు జరుపుతున్న జనార్దన్, ఏలూరి, ఉగ్ర, రవికుమార్

కీలకంగా బాబు సభ

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో శనివారం పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరగనున్న తెలుగుదేశం పార్టీ బహిరంగ సభపై అందరూ దృష్టిసారించారు. టీడీపీ శ్రేణులకు తోడు రాజకీయ వర్గాలు ప్రత్యేకించి వైసీపీ నాయకత్వం ఆ వైపు ప్రత్యేక దృష్టిసారించటం విశేషం. అందుకు ప్రత్యేక కారణం కూడా లేకపోలేదు. పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి పోటీ చేసేందుకు ఆ పార్టీ ఆశించిన సామర్థ్యం కల అభ్యర్థులు ముందుకురావడం లేదు. జగన్ ఏరికోరి ఇన్‌చార్జిగా నియమించిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి అందినకాడికి దండుకుని చివర్లో పలాయనం చిత్తగించారు. చివరికి కాపు సామాజికవర్గం నుంచి అనేక మంది నాయకులను జగన్ పిలిపించుకుని మాట్లాడినా పర్చూరులో ఎవరూ పోటీకి సిద్ధం కావడం లేదు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో పార్టీ నుంచి కాదు పొమ్మని బయటకు నెట్టిన చీరాలకు చెందిన యడం బాలాజీ వైపు జగన్ దృష్టిసారించారు. అమెరికాలో ఉన్న బాలాజీని పర్చూరు నుంచి రంగంలోకి దింపే ఉద్దేశంతో జగన్ పిలిపించుకుంటున్నారు. బుధవారం హడావుడిగా సీఎంకు వెళ్లిన ఆమంచితో కూడా అధిష్ఠానం ఈ విషయమై చర్చించినట్లు తెలిసింది. అమెరికా నుంచి వచ్చే బాలాజీ గతంలో కాదు పొమ్మని బయటకు పంపిన జగన్‌తో మళ్లీ జత కడతాడా లేదా? అనేది ఇంకా స్పష్టంకాలేదు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆయా లోక్‌సభ నియోజకవర్గాల వారీ నిర్వహిస్తున్న ఎన్నికల సన్నాహక బహిరంగ సభలను పర్చూరు నియోజకవర్గంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత చీరాలలో జరపాలనుకున్న ఈ సభను మార్పుచేసి ఇంకొల్లులో జరపాలని నిర్ణయించారు. దీంతో ఈ సభ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టీడీపీకి ప్రత్యేకించి ఏలూరి సాంబశివరావుకు మంచి పట్టుందని భావిస్తున్న నియోజకవర్గంలో ప్రజాస్పందనను గమనించేందుకు శనివారం జరిగే చంద్రబాబు సభ దర్పణం పడుతుందని భావిస్తున్నారు. దీనికితోడు టీడీపీ నేతలు కూడా సభను జయప్రదం చేయటం కోసం ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. బుధవారం ఇంకొల్లులో సభా వేదిక నిర్మాణానికి ఏలూరి భూమిపూజ చేశారు.

కదులుతున్న కేడర్

ఇప్పటికే బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో శనివారం ఇంకొల్లులో జరిగే రా.. కదలిరా సభకు తరలిరావాలని టీడీపీ నేతలు ప్రచారాన్ని ప్రారంభించారు. పర్చూరు నియోజకవర్గంలో అయితే గ్రామగ్రామాన ప్రజలందరికీ సమాచారాన్ని చేరవేశారు. బుధవారం ఉదయం మార్టూరులోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయా నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు సమావేశమయ్యారు. ఏలూరితో పాటు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రి ఆనంద్‌బాబు, బాపట్ల, ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జిలు వర్మ, బీఎన్.విజయ్‌కుమార్, చీరాల ఇన్‌చార్జి కొండయ్య తనయుడు ఆ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ తీరుతెన్ను, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి, కనిగిరి ఇన్‌చార్జి ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు సమావేశమై ఆయా ప్రాంతాల వారీ పార్టీశ్రేణులు, సామాన్య ప్రజల సమీకరణపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. అన్ని ప్రాంతాల్లోని ముఖ్య నాయకులతో మాట్లాడి సభకు ఎలా తరలిరావాలో వివరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సభా కార్యక్రమం ప్రారంభమవుతుంది. అక్కడే ఎమ్మెల్యే ఏలూరి సభకు వచ్చే వారందరికోసం భోజన ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు మధ్యాహ్నం 2 గంటలకల్లా అక్కడికి చేరతారు. వెంటనే ఆయన వేదికపైకి వచ్చి ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం మూడున్నరకల్లా సభ పూర్తవుతుంది. సభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. తాజా రాజకీయ పరిణామాల్లో టీడీపీ పట్ల ప్రజలకు ఉన్న ఆదరణ, ఎమ్మెల్యే ఏలూరి పట్ల ఉన్న అభిమానాన్ని చాటాలన్న ఉద్దేశంతో అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు కదులుతున్న తీరు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి అంచనా వేస్తే ఒక్క పర్చూరు నియోజకవర్గం నుంచే 50 వేలమంది సభకు తరలివస్తారని విశ్లేషకుల అంచనా.

సినీ నిర్మాత బండ్ల గణేష్‌కు జైలు

• చెక్కు బౌన్స్ కేసులో న్యాయాధికారి తీర్పు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 14 : ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్‌కు ఏడాది జైలు, పది వేలు జరిమానా విధిస్తూ ఒంగోలు రెండవ అదనపు న్యాయాధికారి పి.భానుశ్రీ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన జెట్టి జానకిరామయ్య బండ్ల గణేష్‌కు చెందిన పరమేశ్వరి పౌల్ట్రీ ఫామ్స్‌కు 2018లో రూ.95 లక్షలు నగదు బదిలీ చేశారు. అయితే కొద్దిరోజుల తర్వాత జానకిరామయ్య మృతిచెందారు. ఈ మేరకు జానకిరామయ్య తండ్రి వెంకటేశ్వర్లు, బండ్ల గణేష్ వద్దకు వెళ్లి తన కుమారుని వద్ద తీసుకున్న నగదు తిరిగి ఇవ్వాలని కోరారు. దీంతో రూ.95లక్షలకు గణేష్ బ్యాంక్ చెక్కు ఇచ్చారు. ఆ చెక్కు బ్యాంక్‌లో వేయగా అందుకు సరిపడా నగదు ఖాతాలో లేకపోవడంతో బౌన్స్ అయ్యింది. 2019లో చెక్కు బౌన్స్ అయ్యిందని వెంకటేశ్వర్లు న్యాయవాది శ్రీకాంత్ ద్వారా కోర్టులో కేసు వేశారు. అంతేకాకుండా కేసు వేగవంతంగా విచారణ చేయాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చారు. ఈ మేరకు న్యాయాధికారి పి.భానుశ్రీ విచారించి జానకీరామయ్య వద్ద తీసకున్న నగదు రూ.95లక్షలు తిరిగి ఇవ్వాలని గణేష్‌ను ఆదేశిస్తూ నేరం చేసినందుకు ఏడాది పాటు జైలు, రూ.10వేలు జరిమానా విధించారు. అదేసమయంలో ఉన్నత న్యాయస్థానంలో 30 రోజుల్లోపు అప్పీలు చేసుకునే అవకాశం గణేష్‌కు ఇచ్చారు.

శాంతి భద్రతలకు విఘాతం

కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి14: శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఈమేరకు పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెడు నడత కలిగిన వ్యక్తులు, నేరప్రవృత్తి విడనాడి సత్‌ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. దౌర్జన్యాలు, నేరాలకు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే సహిచేది లేదన్నారు. ఈ మేరకు రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లకు పోలీసులు వెళ్లి వారిని విచారించి వారి స్థితిగతులపై ఆరా తీశారు. అదేవిధంగా వారిలో పరివర్తన కలిగే విధంగా కౌన్సిలింగ్ నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ : కలెక్టర్ దినేషకుమార్‌ను బుధవారం ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలపై ఇరువురు చర్చించారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు ఉన్నారు.

'నారాయణ' విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 14 : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఒంగోలులోని నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించారు. అత్యధిక పర్సంటైల్ సాధించి జిల్లా స్థాయిలో ప్రథములుగా నిలిచారు. ఈ సందర్భంగా స్థానిక మంగమూరురోడ్డులోని నారాయణ ఐఐటి క్యాంపస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు ఫలితాల వివరాలను వెల్లడించారు. స్థానిక ఐఐటీ క్యాంపస్ విద్యార్థి పి.శైలేష్‌సాయి 98.54 పర్సంటైల్ సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ఎం.జోషితాలక్ష్మి 98.15, ఎం.గోపిసిద్దార్థ 96, ఎస్.పవన్‌కార్తీక్ 95.82, షేక్ సదీమ్ 93 పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీన్ ఎస్.పిచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు. తమపై నమ్మకంతో పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు డీన్ కృతజ్ఞతలు తెలిపారు.

16న సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న పలు సంఘాల ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరపిస్తూ ఈనెల 16న జరగనున్న పారిశ్రామికసమ్మె, గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఒంగోలులో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదికల ఆధ్వర్యంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జి.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈనెల 16వతేదీన కర్నూలు రోడ్డు ప్లై ఓవర్ వద్ద నుంచి అద్దంకి బస్టాండు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, హనుమారెడ్డి కంకణాల ఆంజనేయులు, జీవీ.కొండారెడ్డి, కొత్తకోట వెంకటేశ్వర్లు, కె.వీరారెడ్డి, ఎంఎస్.సాయి, చావలి సుధాకర్, దాసరి సుందరం, టి.మహేష్, జి.రమేష్, తంబి శ్రీనివాసులు, పీవీఆర్.చౌదరి, అత్తంటి శ్రీనివాసులు, బాలకోటయ్య, జగదీష్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జిలతో టీచర్ల నిరసన



దేవరపాలెంలో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న టీచర్లు

చీమకుర్తి, ఫిబ్రవరి14 : తమ సమస్యల పరిష్కారానికి ఏపీ జేఏసీ ఇచ్చిన కార్యాచరణ మేరకు బుధవారం టీచర్లు, ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరై తమ నిరసన వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిర్ణయాలు వెలువడక పోవటంతో జేఏసీ పోరాట కార్యాచరణాన్ని ప్రకటించింది. దీనిలో భాగంగా మండలపరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో, కార్యాలయాల్లో ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి విధులకు హాజరై తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. దేవరపాలెం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌టీయూ జిల్లా ట్రెజరర్ డి.నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



అక్షరాభ్యాసం చేయిస్తున్న సురేష్

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 14: ఒంగోలులోని ట్రినిటి హైస్కూలులో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమంచి శ్రావణ్‌పంతులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా కరస్పాండెంట్ కొప్పోలు సురేష్, సతీమణి గాయత్రి మౌనిక చేతుల మీదుగా విద్యార్థులకు అక్షరాభ్యాసాన్ని జరిపించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే !

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి • నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్ పిలుపు • బి.నిడమానూరులో పార్టీ కార్యాలయం ప్రారంభం



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన బీఎన్‌ను సత్కరిస్తున్న నాయకులు



విజయ్‌కుమార్ సమక్షంలో టీడీపీలోకి చేరిన ముస్లింలు

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 14: త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధిస్తుందని, అందువల్ల పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పనిచేయాలి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్ పిలుపునిచ్చారు. నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని బుధవారం రాత్రి బీఎన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, ప్రజల సమస్యలు పరిష్కరించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. అర్హులైన పేదలకు సంక్షేమ కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అందిస్తామని చెప్పారు. వైసీపీ నాయకులు చెప్పే మోసపూరిత మాటలు నమ్మవద్దని హితవు పలికారు. కార్యకర్తలకు తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. బడుగు, బలహీనవర్గాలను పూర్తిస్థాయిలో అభివృద్ధిపరుస్తామన్నారు. ప్రతి కార్యకర్తను కలుపుకొని పోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంకిరెడ్డి, మారెళ్ల శ్రీను, గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, షేక్ ఖాజావలి, కోటయ్య, అడకా స్వాములు, నెప్పల శివకృష్ణ, తాళ్లూరి ఆంజనేయులు, గూడూరి ఝాన్సీ, తెలగతోటి జాన్సన్, మోషా, పైడి నాగేశ్వరరావు, జయసింహారావు, ఆరే రామాంజనేయులు, బొడపాటి వెంకటేశ్వర్లు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

11 ముస్లిం కుటుంబాలు టీడీపీలోకి చేరిక

సంతనూతలపాడు: ఒంగోలులోని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్ కార్యాలయంలో బుధవారం పీర్లమాన్యం 39వ డివిజన్ ఆజాద్‌నగర్‌కు చెందిన 11 ముస్లింకుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వారందరికీ బీఎన్ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకుల వివరం గోవిందు, అమానుల్లా, బాబు, ఫకీర్, గోపి, చిన్న పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు చర్యలు

• కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: జిల్లాను మాదకద్రవ్యరహితంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం మత్తు పదార్థాల నివారణ, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని, రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. వీటి బారిన పడితే యువత జీవితాలు నాశనం అవుతాయని, అందువల్ల వీటి వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో డి అడిక్షన్ సెంటర్ ఉండేలా చూడాలని, మద్యానికి బానిసైన వారికి ఆ అలవాటును మాన్పించేందుకు పరివర్తన శిబిరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీలు పటిష్టంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం నియంత్రించే డి అడిక్షన్ కేంద్రాలు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా వ్యవస్థపై నిఘా ఉందని, జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్నిశాఖల సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో పని చేసేందుకు వచ్చే వలస కార్మికులు గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించడం, సేవించడం వం టివి జరగకుండా యజమానులు/ ప్రతినిధులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఎవరైనా మాదకద్రవ్యాలు రవాణా చేసినా, కలిగి ఉన్నా, సేవించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, డీటీసీ సుశీల, అధికారులు లక్ష్మానాయక్, డాక్టర్ భగవాన్‌నాయక్, డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు..నాకోసం పని చేయండి!

మీకు ప్రత్యేక బహుమతులు అందజేస్తాం

ఆత్మీయ సమావేశంలో మంత్రి సురేష్



మాట్లాడుతున్న మంత్రి సురేష్

సింగరాయకొండ, ఫిబ్రవరి 14 : రాబోయే ఎన్నికల్లో వలంటీర్లు తనకోసం పనిచేసి తనను ఆశీర్వదించాలని, అలాగే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి మీవంతు సాయం అందించాలని మంత్రి ఆదిమూలపు సురేష్ వలంటీర్లను కోరారు. సింగరాయకొండ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సింగరాయకొండ, టంగుటూరు, జరుగుమల్లి మండలాల వలంటీర్లతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తూ వ్యవస్థలో వలంటీర్లు భాగస్వామ్యమయ్యారని అన్నారు. రాబోయే రోజుల్లో జగనన్న వలంటీర్లను నాయకులుగా తయారుచేస్తారని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో త్వరలో పర్యటిస్తానని, తన కార్యక్రమాల్లో వలంటీర్లు తప్పనిసారిగా పాల్గొనాలని మంత్రి సురేష్ కోరారు. ప్రభుత్వం వలంటీర్లకు వందనం పేరిట అందజేస్తున్న అవార్డులు రాని వలంటీర్లు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. త్వరల్లో నియోజకవర్గంలో ఉన్న వలంటీర్లకు ప్రత్యేకంగా బహుమతులు అందజేస్తానని తెలిపారు. అలాగే ప్రభుత్వం అందజేసే నగదు బహుమతులను కూడా 50 శాతం పెంచబోతుందన్నారు. మంత్రి ప్రసంగాన్ని ఆలకిస్తే రాబోయే ఎన్నికల్లో వలంటీర్లను వైసీపీ ఏవిధంగా ఉపయోగించుకోనుందో తేటతెల్లమైందని ప్రతిపక్షాలు ఆక్షేపిస్తున్నాయి. అందులో భాగంగానే ఎన్నికల ముందు వారికి ఇచ్చే నగదు బహుమతులను 50 శాతం పెంచుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆత్మీయ సమావేశానికి మూడు మండలాల్లో సగభాగం వలంటీర్లు హాజరుకాలేదంటూ మంత్రి పెదవివిరవడం కొసమెరుపు. ఈ సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీపీ, జడ్పీ వైస్‌చైర్మన్, మెజార్టీ భాగం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ ముఖ్యనాయకులు గైర్హాజరయ్యారు. అనంతరం స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సురేష్ రహస్య సమావేశాన్ని నిర్వహించడం చర్చనీయాంశమైంది.

గ్రామాల్లో వేధిస్తున్న విద్యుత్ సమస్యలు

పరిష్కరించాలంటూ ప్రజాప్రతినిధుల డిమాండ్



మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

నాగుల్పుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 14: గ్రామాల్లో పలు సమస్యలు తాండవిస్తున్నా పరిష్కారానికి ఎవరూ కృషి చేయడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఆరోపించారు. బుధవారం నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నలమలపు అంజమ్మ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పుగుండూరు ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు మాట్లాడుతూ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ సమీపంలో కరెంటు స్తంభాలు, తీగలను నూతనంగా ఏర్పాటు చేయాలని, జగనన్నకాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. కళ్లగుంట సర్పంచ్ పల్లెర్ల అంజిరెడ్డి మాట్లాడుతూ తమ గ్రామంలో కరెంటు స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ తీగలు కిందగా వేలాడుతున్నాయని, ఇటీవల వరిగడ్డి లారీ కాలిపోయిందని చెప్పారు. మద్దిరాలపాడు సర్పంచ్ స్వర్ణ అనూరాధ మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని, 30సంవత్సరాల నాటి కరెంటు తీగలు కావడంతో తరచూ తెగి కిందపడి పోతున్నాయని చెప్పారు. విద్యుత్ తీగలు తెగిపడి ఇప్పటికే పలు పశువులు మృతి చెందాయని ఆవేదన వ్యక్తం చేశారు. వినోదరాయునివారిపాలెం సర్పంచ్ ఘట్టంనేని అశోక్ మాట్లాడుతూ గ్రామంలో బీసీ, ఎస్సీకాలనీల్లోని కరెంటు సమస్యలను పరిష్కరించాలని కోరారు. చీర్వానుప్పలపాడు ఎంపీటీసీ పొద పవన్ మాట్లాడుతూ తమ గ్రామంలో లోఓల్టేజి సమస్య ఉందని చెప్పారు. అదే విధంగా చీర్వానుప్పలపాడు నుంచి అగ్రహారం గ్రామంలోకి తారురోడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. చీర్వానుప్పలపాడు నుంచి 18 గ్రామాలకు తాగునీరు సరఫరా జరిగే పైపులైన్ సక్రమంగా లేదని, నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని మంత్రిదృష్టికి తెచ్చారు. అనంతరం మంత్రి నాగార్జున మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు అనూరాధ, చంద్రశేఖర్, రత్తయ్య, జాన్సన్, అన్నపూర్ణమ్మ, సర్పంచ్‌లు దాసరి వరప్రసాదరావు, దేవరకొండ జయమ్మ, పోలినేని వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసరావు, పశువైద్యశాఖ ఏడీఏ నాగభూషణం, పశువైద్యులు జి.వెంకటసురేఖ, కాకుమాని అనూరాధ, కట్టా జాస్మిన్ పాల్గొన్నారు.

పొగాకులో అన్యపదార్థాలు లేకుండా చూడాలి

వేలం కేంద్రం నిర్వహణాధికారి సునీల్‌కుమార్



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

కొండపి, ఫిబ్రవరి14: పొగాకులో అన్యపదార్థాలు కలవకుండా రైతులు గ్రేడింగ్‌లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొండపి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి గర్నిపూడి సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం పెట్లూరు గ్రామంలో వేలం కేంద్రం అధికారుల ఆధ్వర్యంలో పొగాకు పంటపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ పొగాకులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ఆకు రెల్చుట, క్యూరింగ్, గ్రేడింగ్, బేళ్ల తయారీ తదితర విషయాలపై రైతులకు అవగాహన కలిగించారు. ఐటీసీ కంపెనీ మేనేజర్ జి.వెంకటరావు, జీపీఐ కంపెనీ మేనేజర్ ఉన్నం శ్రీనివాసరావు, పీఎస్ఎస్ కంపెనీ మేనేజర్ ఎ.రామాంజనేయులు పాల్గొని పొగాకులో గడ్డి, కలుపు మొక్కలు, సిగిరెట్, బీడీ, చాక్లెట్లు వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర అన్యపదార్థాలు కలవకుండా తగిన జాగ్రత్తలతో గ్రేడింగ్ చేసుకుని బేళ్ల తయారు చేసి వేలానికి తీసుకువచ్చి, గిట్టుబాటు ధరలు సాధించుకోవాలని రైతులకు సూచించారు. పొగమల్లె నివారణకు సూచనలు చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగుతో ఆదాయ మార్గాలను వివరించారు. సమావేశంలో ఎస్‌జీవో సాయికుమార్, క్షేత్ర సహాయకుడు మోతీలాల్ పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలోని పొగాకు తోటలను పరిశీలించారు.

టైగర్ రొయ్యల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీ జీఎం అనీషా

టంగుటూరు, ఫిబ్రవరి 14 : టైగర్ వెరైటీ రొయ్యల సాగులోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ కంపెనీ జనరల్ మేనేజర్ అనీషా రొయ్యల సాగు రైతులకు సూచించారు. టైగర్ రకం ఆక్వా కల్చర్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై టంగుటూరులో బుధవారం రాత్రి సీపీ కంపెనీ ఆధ్వర్యాన అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో అనీషా మాట్లాడుతూ రొయ్యల చెరువుల యాజమానులంతా విధిగా రిజర్వాయర్ కొనసాగించాలన్నారు. రిజర్వాయర్ వలన ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఏరియేటర్లను ఎకరాకు 8 హెచ్‌పీ ఉండేలా 4 ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. చెరువులోని నీటి నిర్వహణ అత్యంత ప్రధానమని, తగినంత బ్లీచింగ్ చల్లి రిజర్వాయర్ మెయింటింగ్ కొనసాగించాలని, రిజర్వాయర్‌తోపాటుగా నీరు చెరువులోకి వచ్చాక కూడా జాగ్రత్త వహించాలన్నారు. బయోసెక్యూరిటీ ప్రధానమని, నెట్ ద్వారా చెరువు చుట్టూ పెన్సింగ్ ఉండాలని చెప్పారు. నీటిలో ఇతర అన్యపదార్థాలు లేకుండా, రాకుండా చూడాలని వివరించారు. టైగర్ సాగులో అశ్రద్ధ వహించవద్దని, వనామి సాగులో తీసుకున్న జాగ్రత్తలన్నీ టైగర్ సాగులోనూ తీసుకోవాలని సూచించారు. సదస్సుకు టంగుటూరుతోపాటుగా చుట్టుపక్కల గ్రామాలైన అనంతవరం, ఆలకూరపాడు, తాళ్లపాలెం, పసుకుదురు, కేసుపాలెం రొయ్యల సాగు రైతులు హాజరయ్యారు.

అవీ..ఇవీ..

డీఎస్సీకి గరిష్ఠ వయోపరిమితిని పెంచాలి

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 14 : డీఎస్సీ-24 నోటిఫికేషన్‌లో ప్రభుత్వం ప్రకటించిన అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి తేదీని సవరించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్రకటించిన తేదీ వల్ల తాము డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు అర్హత లేకుండా పోయిందని వాపోతున్నారు. గత నాలుగేళ్ళగా టీచర్ పోస్టులకు ప్రిపేర్ అవుతున్న తమతకు వయోపరిమితి ఆశనిపాతంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నోటిఫికేషన్ ప్రకారం 2024 జూలై 1వతేదీ నాటికి 44 సంవత్సరాలు నిండిన జనరల్ అభ్యర్థులు, 49 సంవత్సరాలు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు టీచరు పోస్టులకు అర్హులని ప్రకటించారు. దీనివల్ల ఈ నాలుగున్నర నెలల వ్యవధిలో తమకు 44 సంవత్సరాలు నిండి దరఖాస్తు చేసుకునేందుకు అర్హత లేకుండా పోతుందని నిరుద్యోగులు వాపోతున్నారు. అందువల్ల ప్రభుత్వం వయోపరిమితిని పెంచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

నిబంధనలకు లోబడే లేఅవుట్లకు అనుమతులు

• ఒడా వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14 : జిల్లాలో నిబంధనలకు లోబడే 2019వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 30 లేఅవుట్లకు అనుమతులు ఇచ్చినట్లు ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనధికార లే అవుట్ల అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఒంగోలు నగర పాలక సంస్థలోని అధికారులు ఎవరూ పంచాయతీ కార్యదర్శులకు ఫోన్ చేసి విధులకు ఆటంకం కలిగించలేదన్నారు. ఒక వేళ సంస్థ అధికారుల పేరు చెప్పి ఫోన్ చేస్తే వెంటనే వైస్ చైర్మన్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. జిల్లాలోని ప్రజానీకం అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని కోరారు. అనధికార లే అవుట్లలోని సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో చేరుస్తామని, అందువల్ల రిజిస్ట్రేషన్‌శాఖ ఆ ఇంటి ప్లాట్లకు క్రయ విక్రయాలకు అనుమతి ఇవ్వబోదని ఆయన స్పష్టం చేశారు.

నాగులుప్పలపాడులో రెండు బ్యారన్లు దగ్ధం



కాలిపోతున్న బ్యారెన్లు

నాగుల్పుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి14: నాగులుప్పలపాడులోని పెట్రోలు బంకు సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తు రెండు బ్యారన్లు అగ్నికి ఆహుతయ్యాయి. తోకల శేషారావు, తోకల రఘునాథ్ బాబులకు చెందిన బ్యారెన్లు పక్కపక్కనే ఉన్నాయి. అయితే మంటలు ఒక్కసారిగా రేగి కాల్చుకు ఉంచిన పొగాకుతో పాటు బ్యారన్లు కాలిపోయియి. దీంతో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు కృషి చేశారు. సంఘటనా ప్రదేశాన్ని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 నిర్వహణాధికారి కె.రామకృష్ణ పరిశీలించారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రథసప్తమి పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 14: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి, శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆధ్వర్యంలో జరగనున్న రథసప్తమి పోస్టర్లను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఈదుపల్లి గురునాథం, ఆలయ అధికారులతో కలిసి ఈ పోస్టర్లను విడుదల చేశారు. రథోత్సవం కార్యక్రమానికి ఎంపీ మాగుంటతో పాటు ఆయన కుమారుడు రాఘవరెడ్డిని ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14 : యర్రగొండ పాలెంలో జరిగిన తూమాటి చెన్నమ్మ హత్య కేసులో ని నిందితులను అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అట్రాసిటీ కేసుగా మార్చి డీఎస్పీ ద్వారా విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ వైపాలెం అంబేద్కర్‌నగర్‌కు చెందిన వృద్ధురాలు చెన్నమ్మ ఈనెల 7న బహిర్భూమికి వెళ్లి హత్యకు గురైందని చెప్పారు. ఈ కేసులోని చత్తీస్‌ఘడ్ నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జనుమాల నాగయ్య, మాలపోలు శాంతకుమార్, కాకుమాను రవి, దేవరపల్లి రమణయ్య పాలేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ లీగల్‌సెల్ కో కన్వీనర్‌గా సుబ్బారావు



నియామక ఉత్తర్వులు ఇస్తున్న శివారెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14 : భారతీయ జనతా పార్టీ లీగల్‌సెల్ జిల్లా కో కన్వీనర్‌గా అయినా బత్తిన సుబ్బారావు నియమితులయ్యారు. ఒంగోలులోని బీజేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి చేతుల మీదుగా సుబ్బారావు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్, కృష్ణారావు, మంచాల పరమేశ్వరప్రసాద్, బాలకోటయ్య, యనమల నాగేశ్వరరావు, యు.శ్రీనివాసరావు, తోగంటి శ్రీనివాసరావు, సింగ ప్రసాద్, డాక్టర్ కొమ్మి నరసింహారావు, శివాజీ పాల్గొన్నారు.

గొర్రెపాటితో మాగుంట మంతనాలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం నగరంలోని వైసీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసరావు ఇంటికి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల గొర్రెపాటి జన్మదిన వేడుకలు జరగగా, ఆ పేరుతో మాగుంట తన అనుచరులతో కలిసి ఆయనను కలిశారు. అయితే ఇటీవల వైసీపీలో నెలకొన్న పరిణామాణాలతో మాగుంట అడుగులు ఎటువైపు అనే చర్చ జరుగుతున్న తరుణంలో ప్రస్తుతం వైసీపీ నాయకుడి నివాసానికి వెళ్లి కలిసి కొద్దిసేపు అక్కడ మాగుంట ఉన్నారు. ఈ సందర్భంగా మాగుంటను శాలువతో ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు డైట్ విద్యార్థినులు



క్రీడాకారులతో అధ్యాపకులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 14: రాష్ట్రస్థాయి జూనియర్ బాలికల హాకీ పోటీలకు పైనంపాడు డైట్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ .కిరణ్‌కుమార్ తెలిపారు. వారు ఈ నెల 9వ తేదీ నుంచి శ్రీకాకుళంలో జరిగిన 14వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక డైట్ కళాశాలలో క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ టి.రవికుమార్, పాల్గొన్నారు.

ఆదరణ కరువైన మహిళను కాపాడిన రైల్వే పోలీసులు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 14: భర్త వేధింపులు తట్టుకోలేక పుట్టింటికి వెళితే అక్కడ ఆదరణ కరువు కావడంతో తిరుపతి వెళ్లేందుకు సిద్ధమైన మహిళను ఒంగోలు రైల్వే పోలీసులు కాపాడి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలలోకి వెళితే.. బుధవారం తెల్లవారుజామున వరంగల్ జిల్లా నల్లబెల్లి గ్రామానికి చెందిన కోనకంటి మౌనిక, తన ఇరువురు పిల్లలతో పుట్టింటి నుంచి బయలుదేరింది. వరంగల్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో తిరుపతికి బయలుదేరారు. దీంతో ఆమె తల్లిదండ్రులు వరంగల్ జీఆర్పీలో ఫిర్యాదు చేయడంతో సీసీఫుటేజీ పరిశీలించి పద్మావతి ఎక్స్‌ప్రెస్ ఎక్కారని గుర్తించారు. వెంటనే ఒంగోలు రైల్వే పోలీసులను అప్రమత్తం చేశారు. దీంతో ఒంగోలు రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు తన సిబ్బందితో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో ఉన్న మౌనికతోపాటు ఇరువురు పిల్లలను గుర్తించి ఆమె తండ్రికి అప్పగించారు.

చంద్రబాబు సభను

విజయవంతం చేయాలి

• నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీఎన్ పిలుపు



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మద్దిపాడు, ఫిబ్రవరి 14: ఇంకొల్లులో ఈనెల17వ తేదీన జరిగే నారా చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మద్దిపాడులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదదేశం పార్టీ, జనసేన పార్టీ కార్యకర్తలు సంఘటితంగా కలిసి పనిచేయాలని చెప్పారు. చం ద్రబాబు సభ విజయవంతం చేసేందుకు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం ని ర్వహిం చాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మండవ జయంతిబాబు, ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, దేవబత్తిన ప్రసాదు, మండవ గోపీనాథ్, ముల్లూరి మురళి, చింతల శ్రీనివాసరావు, శుద్దపల్లి అనిల్, ఆర్.ప్రభాకరరావు, అద్దేపల్లి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

శ్రేణులు భారీగా తరలిరావాలి

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్): ఇంకొల్లులో ఈనెల 17న చంద్రబాబునాయుడు చేపట్టిన రా కదిలిరా బహిరంగసభకు భారీ ఎత్తున తరలిరావాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయకుమార్ కోరారు. ఉప్పుగుండూరులోని కల్యాణ మండపంలో బుధవారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ప్రతి గ్రామం నుంచి ఇంకొల్లు బహిరంగసభకు శ్రేణులు తరలిరావాలని కోరారు. అనంతరం బీనిడమానూరులో భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్, రామసుబ్బారెడ్డి విగ్రహాలకు బీఎన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నాయకులు ముప్పవరపు వీరయ్యచౌదరి, గుమ్మడి సాయిబాబు, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, నెప్పల శివకృష్ణ, కనగాల శ్రీనివాసరావు, తెలగతోటి జాన్సన్, శరత్, గుమ్మడి విజయ్, అడకా స్వాములు, మధుబాబు, వీరాంజనేయులు, పెంట్యాల సురేష్, పిట్టు సురేష్, తిరుమలశెట్టి శ్రీను, కె.సెల్వం, పొట్లూరి నాగమల్లేశ్వరరావు, ఇంటూరు శ్రీను, శ్రీకాంత్, కొణిజేటి రామకృష్ణ పాల్గొన్నారు.

సీఎంవోలో ఫలించని ఆమంచి ప్రతిపాదన

• రెండు రోజుల్లో సీఎంతో అపాయింట్‌మెంట్

చీరాల, ఫిబ్రవరి 14: వైసీపీ పర్చూరు నియోజ కవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం సీ ఎంవో నుంచి పిలుపు రావటంతో వెళ్లారు. సీఎంవో కా ర్యదర్శి ధనుంజయరెడ్డి ముందు ఆమంచి తెలిపిన అ భ్యర్థన ఫలించలేదని తెలిసింది. ఈ క్రమంలో రెండు రోజుల్లో సీఎం జగన్‌తో అపాయింట్‌మెంట్ ఖరారయిందని, అప్పుడు అమీతుమీ తేల్చుకుంటారని చీరాల నియోజకవర్గంలోని ఆమంచి అనుచరులు చెప్పుకుంటున్నారు. బుధవారం పర్చూరు నియోజకవర్గం మార్టూరులో ఆసరా కార్యక్రమంలో ఆమంచి పాల్గొన్నారు. ఆసమయంలో సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు ఆమంచి హడావుడిగా బయలుదేరి వెళ్లారు. అయితే, కొద్ది రోజులుగా ఆమంచి తాను చీరాల నుంచే పోటీ చేస్తానని చీరాల నియోజకవర్గంలోని తన అనుచరులకు చెప్పిన నేపథ్యంలో వైసీపీ అధి ష్ఠానం వెనువెంటనే ఒకటికి నాలుగు పేర్లను పరి శీలనలోకి తీసుకుంది. ఆ తరువాత తాజాగా చీరాలకు చెందిన ఎన్ఆర్ఐ యడం బాలాజీ పేరు తెరపైకి వచ్చింది. బాలాజీ పేరు అంతిమంగా ఖరారవుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆమంచికి సీఎంవో నుంచి వర్తమానం అందటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంవోలో ధనుంజయరెడ్డికి ఆమం చి తన వాదన, అభ్యర్థన వినిపించినట్లు తెలిసింది. గతంలో తనకు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత కార్యా చరణ ఉండాలనేది ఆ వాదన, అభ్యర్థన సారాంశమని సమాచారం. అయితే అందుకు సానుకూలత లభించ లేదని తెలిసింది. ఈనేపథ్యంలో రెండు రోజుల్లో సీఎం జగన్‌ను కలి సేందుకు అపాయింట్‌మెంట్ ఖరారయిందని, ఆరోజు అమీతుమీ తేల్చుకునే దిశగా ప్రణాళిక సిద్ధం చేసు కుంటున్నట్లు ఆమంచి అనుచరులు చెప్తున్నారు. అం తిమంగా గతంలో అధిష్ఠానం తనకు ఇచ్చిన హామీ, తన ప్రతిపాదన, అభ్యర్థనలను పరిగణలోకి తీసుకోవాలని, లేదంటే పార్టీ ఏదన్నా కానీ చీరాల నుంచే ఆమంచి పోటీ చేస్తారని అతని అనుచరులు ఘం టాపథంగా చెప్తుండటం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అందులో భాగంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడికలు, తీసివేతలు వేస్తూ లాభనష్టాలను బేరీజు వేసుకుంటున్నారు.

నయా నయీమ్ పాలనకు చెక్ పెట్టాలి

• ఆమంచి స్వాములు

కంభం, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో కొనసాగుతున్న నయానయీమ్ పాలనకు చెక్‌పెట్టి పుష్ప తరహా స్మగ్లింగ్‌లను అరికట్టేందుకు టీడీపీ-జనసేన పార్టీలు ఉమ్మడి ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని జనసేన పార్టీ కార్యదర్శి ఆమంచి స్వాములు తెలిపారు. బుధవారం ఆయన రావిపాడు గ్రామంలో పోలే రమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని మాట్లాడారు. భీమవరంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొనకుండా ప్రభుత్వం అ డ్డంకులు కలిగించడం హేయమైన చర్య అన్నారు. గిద్దలూరు నియోజక వర్గంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అ భ్యర్థిగా ఎవరిని ప్రకటించినా పొత్తు ధర్మానికి కట్టుబడి ఉంటామన్నారు.

రేపు రథసప్తమి వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం సప్తవాహన సేవ నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం సూర్యప్రభ వాహనం, శేష వాహనం, గరుడవాహనం, మధ్యాహ్నం హనుమంతవాహనం, కల్పవృక్ష వాహనం, వెండిరథోత్సవం, రాత్రికి చంద్రప్రభ వాహనంపై నగరోత్సవం నిర్వహించనున్నన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్ • జగనన్న లే అవుట్లు పరిశీలన • 20 లేదా 21న సీఎం వచ్చే అవకాశం



జగనన్న లేఅవుట్‌లో సూచనలు చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ఒంగోలు నగరంలోని పేదలకు అన్ని సౌకర్యాలతో కూడిన లేఅవుట్లలో ఇళ్ళ పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఒంగోలు నగర పరిధిలోని మల్లేశ్వరపురం లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కలపాలెంలలో పేదలకు అన్ని సౌకర్యాలతో ఇళ్ళ స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. ముందుగా జంగిల్ క్లియరెన్స్ మార్కింగ్ పనులతో పాటు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభకు చేపట్టాల్సిన చర్యలపై అక్కడ అధికారులతో చర్చించారు. ఇళ్ళ పట్టాలతో పాటు కన్వేయన్స్ డీడ్స్ కూడా ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 436 ఎకరాల భూమిని ఇప్పటికే సేకరించామని, అందుకు అవసరమైన రూ.210 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. లేఅవుట్ అభివృద్ధికి రూ.21కోట్లకు పైగా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు. 22వేల మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. భూములకు సంబంధించిన లీగల్, రెవెన్యూ సమస్యలు పరిష్కారమైన వెంటనే 24 గంటల్లోగా సంబంధిత రైతు బ్యాంకు ఖాతాలలో నేరుగా డబ్బులు జమ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మల్లేశ్వరపురం, అగ్రహారం లేఅవుట్‌లో 80 అడుగులతో అప్రోచ్ రోడ్డు ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ప్రతి 2వేల మందికి ఒక సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ సెంటర్, ప్రాథమిక పాఠశాల ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెల్లడించారు.

20లేదా 21న సీఎం రాక

ఈనెల 20 లేదా 21వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇంటి పట్టాలు పంపిణీ చేసేందుకు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అందుకు సంబంధించి తాత్కాలిక షెడ్యూల్ ఉన్నట్లు పేర్కొన్నారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్డీవో లోకేశ్వరరావు, మునిసిపల్ ఇంజనీర్ రహమత్‌జానీ, హౌసింగ్ పీడీ పేరయ్య ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తహసీల్దార్ సుజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో బాలినేని భేటీ

కాగా అంతకు ముందు లేఅవుట్లపై కలెక్టర్ దినేష్‌కుమార్‌తో మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భేటీ అయ్యారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో లేఅవుట్ల మ్యాపులను పరిశీలించి చర్చించారు. ఈ సందర్భంగా స్థలాల పంపిణీకి సంబంధించి హైకోర్టులో పిల్ దాఖలైన నేపథ్యంలో దానిపై కూడా చర్చించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు మాజీ సీఎం సంజీవయ్య

• కలెక్టర్ దినేష్‌కుమార్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట, మేయర్ సుజాత

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 14: పేదల సంక్షేమానికి అనేక సంస్కరణలు తీసుకువచ్చిన మాజీ సీఎం దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శనీయమని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. అలాంటి మహనీయుని ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని వారి సంస్కరణలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డాక్టర్ దామోదరం సంజీవయ్య జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూల్ జిల్లాలో నిరుపేద కుటుంబంలో జన్మించిన సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా అతి చిన్న వయస్సులోనే విశేషమైన సేవలు అందించారన్నారు. ఆనాడు చేపట్టిన సామాజిక భద్రత సంస్కరణ ఫలితంగా నేడు బడుగు బలహీనవర్గాలు ప్రజలు పింఛన్ పొందుతున్నారన్నారు. ఎంపీ మాగుంట మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి అనేక నిర్మాణాలకు కారణమయ్యారన్నారు. నేటి యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, డీటీసీ సుశీల, దామోదరం సంజీవయ్య విగ్రహ కమిటీ ప్రతినిధులు అరుణకుమార్ పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో జరిగిన దామోదరం సంజీవయ్య జయంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని కేక్ కట్ చేశారు. ఎంపీ మాగుంట, మేయర్ గంగాడ సుజాత సంజీవయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో..

ఒంగోలు(కల్చరల్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను బుధవారం ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి వేశారు. అనంతరం సంజీవయ్య చేసిన సేవలను రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది కె.సంపూర్ణమ్మ, డి.సందీప్, ఎస్.అనిల్, ఎం.శివకుమారి, స్టైలి, నున్నా ఆంజనేయులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఘనంగా బొడ్డురాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి నాగార్జున, ఎమ్మెల్యేలు బాలినేని, చెవిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీఎన్, భక్తులు

సంతనూతలపాడు, ఫిబ్రవరి 14: సంతనూతలపాడులో బొడ్డురాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక అం జనేయస్వామి ఆలయం వద్ద ధ్వజస్తంభం, బ్ర హ్మంగారి గుడి, చెన్నకేశవస్వామి ఆలయం స మీపంలోని రోడ్డుపై బొడ్డురాయిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక మాల్లో మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మండలంలోని పలుగ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడి అరెస్టు

సీఐ రాములునాయక్ వివరాలు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములునాయక్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 14 : ఎర్రగొండపాలెంలో ఈ నెల 7న జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆ మేరకు సీఐ రాములు నాయక్ వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 7న అంబేడ్కర్‌నగర్ చెందిన వృద్ధురాలు (78) శ్మశాన వాటిక వద్దకు ఉదయం 10.30 ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లింది. అదే సమయంలో స్థానికంగా ఉన్న నేషనల్ వాటర్ సర్వీసింగ్ పాయంట్‌లో పనిచేసే చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా తీర్థా గ్రామానికి చెందిన సుపేన్ కశ్యప్ (20) వృద్ధురాలి తలపై రాయితో దాడి చేశాడు. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి ఈడ్చుకొని వెళ్లాడు. స్పృహకోల్పోయిన వృద్ధురాలిపై అత్యాచారంచేసి ఆమె వద్ద ఉన్న రూ.1500 నగదు అపహరించుకొని వెళ్లాడు. స్పృహకోల్పోయిన వృద్ధురాలు ఘటన స్థలంలో మృతిచెందింది. నిందితుడు సుపేన్ కశ్యప్ గుట్టు చప్పుడు కాకుండా స్థానికంగా ఉన్న వాటర్‌సర్వీసింగ్ పాయింట్‌లో యథావిధిగా విధులు నిర్వహిస్తున్నాడు. వృద్ధురాలు ఇంటికి రాకపోవడంతో కటుంబసభ్యులు 7వ తేదీ రాత్రి వరకు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆమె ఎక్కడా కన్పించలేదు. మరుసటిరోజు అంబేడ్కర్‌నగర్ శ్మశానవాటిక పక్కన చెట్లపొదల మధ్య మృతి చెంది ఉంది. దీంతో ఈ ఘటనపై మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేసి నిందితుడు సుపేన్ కశ్యప్‌ను బుధవారం ఎర్రగొండపాలెంలోని రాళ్లవాగు సమీపంలో నేషనల్ వాటర్ సర్వీసింగ్ పాయింట్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో స్థానిక ఎస్.ఐ సుదర్శన్, పోలీసు హెడ్ కానిస్టేబుల్స్, సహకారం అందించినట్లు తెలిపారు.

బావిలో పడి యువకుడు మృతి

ముండ్లమూరు, ఫిబ్రవరి 14 : మండలంలోని ఈదర గ్రామానికి చెం దిన తిరుమలశెట్టి నాగేశ్వరరావు (34) ప్రమాదవశాత్తు నేల బావిలో పడి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. వివరాల్లోకి వెళితే నాగేశ్వరరా వు తన పొలంలో మిరప తోటకు నీరు కట్టేందుకు బావి వద్దకు వెళ్లారు. బావిలో నుంచి వచ్చే పైపు సరి చేస్తుండగా కాలుజారి బావిలో పడిపోయారు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా బావి దగ్గర చెప్పులు కన్పించడంతో అనుమానం వచ్చి బావిలో చూడగా నాగేశ్వరరావు మృతి చెంది ఉన్నారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు పి ల్లలు ఉన్నారు. భార్య నాగమని ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు న మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాగా ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందిన గ్రామ జనసేన పార్టీ నాయకుడునాగేశ్వరరావు మృతదేహాన్ని దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన వంతుగా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ముండ్లమూరు ఎస్సీ కాలనీకి చెందిన యాకసిరి శివయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకు లు తోట రామారావు, టీడీపీ మాజీ తెలుగు యువత అధ్యక్షుడు నాగండ్ల రమణ, వీరపనేని శ్రీనివాసరావు, మాలెంపాటి కోటయ్య, మేదరమెట్ల అచ్చయ్య పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చినగంజాం, ఫిబ్రవరి 14: పల్లెపాలెం గ్రామ పంచాయతీ పెద్దపల్లెపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి, శిఖర గరుడ ఆళ్వార్ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, పూజలను వేద పండితులు నిర్వహించారు. తదనంతరం బ్రహ్మశ్రీ సహస్ర ప్రతిష్ఠ ఆచార్య పరుచూరి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన జరిగింది. శేరు వంశస్థులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

చేసిన పనులు ప్రజలకు వివరించాలి

• వైసీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే బాలినేని

కొత్తపట్నం(ఒంగోలునగరం) ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించాలని, ఇంకా గ్రామాల్లో చేయాల్సిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఆయన మండలంలోని అల్లూరు, గుండమాల గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తాను గుండమాల గ్రామంలో మత్స్యకారుల కోసం బీచ్ వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. లో ఓల్టేజ్ సమస్య లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం కొత్తపట్నంలో కూడా బాలినేని కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. కొత్తపట్నంలో విద్యుత్ లైను ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అల్లూరులో కార్యకర్తలతో మాట్లాడారు. రాబోమే ఎన్నికల్లో సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆళ్ల రవీంద్రారెడ్డి, బలగాని శ్రీనివాసరావు, వీరేపల్లి రామచంద్రారెడ్డి, గుండమాల గ్రామ సర్పంచ్ జయరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూలు ప్లస్ టీచర్లకు ఒక ఇంక్రిమెంట్

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 14: హైస్కూలు ప్లస్ (ప్రభు త్వ జూనియర్ కళాశాలలో)లో పనిచేస్తున్న పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్లకు అదనంగా ఒక ఇంక్రిమెంట్ మంజూరుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలికలు పదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పకుండా వారు ఉన్నత విద్యను కొనసాగించేందుకు బాలికలకు ప్రత్యేకంగా మండల కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లోని హైస్కూళ్ళలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులతో ఇంటర్మీడియట్ కోర్సులు ప్రవేశపెట్టింది. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రారంభమైన ఈ కళాశాలల్లో విద్యార్థులకు బోధించే పోస్టు గ్రాడ్యుయేషణ్ టీచర్లకు అదనంగా ఒక ఇంక్రిమెంట్ ఇస్తామని ప్రకటించింది. అయితే అప్పటి నుంచి ఈ ప్రకటన కార్యరూపం దాల్చలేదు. దీంతో హైస్కూలు ప్లస్‌లో పని చేస్తున్న టీచర్లు ప్రభుత్వానికి అనేక మార్లు వినతిపత్రాలు ఇచ్చారు. దీంతో ఎట్టికేలకు పోస్టు గ్రాడుయేషన్ టీచర్లకు ఒక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారులను కమిషనర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

పొగాకు బారన్ దగ్ధం

మద్దిపాడు, ఫిబ్రవరి 14: మల్లవరం గ్రామంలో పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన నోసిని ప్రసాదు అనే రైతు పొగాకు కాల్చు సమయంలో బ్యారన్‌లో కర్ర గొట్టంపై పడి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బ్యారన్‌తో పాటు అందులోని పొగాకు పూర్తిగా కాలిపోయింది. అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

కొండపి, ఫిబ్రవరి14: వసంత పంచమి సందర్భంగా మండలంలోని కె. ఉప్పలపాడు గ్రామంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలోని సరస్వతీదేవి ఆలయంలో చిన్నారులకు బుధవారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు చిన్నారులు సరస్వతీదేవి ముందు 'ఓం నమఃశ్శివాయ' అంటూ పలకపై రాసిన అక్షరాలను బలపంతో దిద్దారు. కార్యక్రమాన్ని చిన్నారుల తల్లిదండ్రులు నిర్వహించగా, ఆలయ అర్చకుడు సోమరాజుపల్లి రాఘవేంద్రశర్మ పర్యవేక్షించి చిన్నారులకు ఆశీస్సులు అందజేశారు.

ఆర్మీ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

శోకసముద్రంలో యర్రపల్లి గ్రామం

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



యర్రపల్లిలో అంత్యక్రియలకు హాజరైన ప్రజలు, బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

కొమరోలు, ఫిబ్రవరి 14: మండలంలోని యర్రపల్లి గ్రామానికి చెందిన మారం బ్రహ్మానందరెడ్డి అంత్యక్రియలు యర్రపల్లి గ్రామంలో బుధవారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. కొన్నేళ్లుగా మద్రాసు రెజిమెంట్స్‌లో జవానుగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆయన మండలంలోని యర్రపల్లి గ్రామానికి సెలవుపై వచ్చారు. సెలవులు ముగించుకుని ఈ నెల 8న ఒంగోలుకు వెళ్లి అక్కడి నుంచి విజయవాడ మీదుగా బంగ్లాదేశ్ సరిహద్దులోని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని న్యూ జలసాయి గుడి(ఎన్‌జీపీ) రైల్వే స్టేషన్‌కు ఈ నెల 10న చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్మీయూనిట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో అదృశ్యమైన విషయం పాఠకులకు విదితమే. అదే సమయంలో రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం ఉంది. దానికి 30మీటర్ల దూరంలో బ్రహ్మానందరెడ్డికి చెందిన లగేజీ బ్యాగు, పత్రాలను రైల్వే పోలీసులు గుర్తించి మద్రాసు యూనిట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తుపటేందుకు వీలు లేకపోవడంతో జవాను కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటీన ఎన్‌జీపీ రైల్వేస్టేషన్‌కు కుటుంబసభ్యులు చేరుకొన్నారు. మృతదేహాన్ని గుర్తించలేదని విధంగా ఉంది. దీంతో మద్రాసు యునిట్ అధికారులు, పశ్చిమ బెంగాల్ పోలీసులు, రైల్వే పోలీసులు, జవాను కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆర్మీ అధికారులు మృతదేహం, వారి కుటుంబసభ్యుల డీఎన్ఏ పరీక్షలు చేయించారు. ఆ రిపోర్టు ఆధారంగా మృతదేహం బ్రహ్మానందరెడ్డిదేనని నిర్ధారించారు. దీంతో భౌతికకాయాన్ని బుధవారం తెల్లవారుజామున స్వగ్రామం యర్రపల్లి గ్రామానికి చేర్చారు. సమాచారం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, మనోజ్ చారిటబుల్ అధ్యక్షులు కామూరి రమణారెడ్డిలు విడివిడిగా యర్రపల్లి గ్రామానికి చేరుకుని జవాన్ భౌతికకాయానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం అధికారిక లాంచనాలతో అంత్య క్రియలు నిర్వంహించారు. అయితే బ్రహ్మానందరెడ్డి మృతిపై సమగ్రంగా విచారిస్తున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.

బాబు సభకు అడ్డంకులా? : ఏలూరి

అమరావతి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 17న ఇంకొల్లులో నిర్వహించే రా.. కదలిరా సభకు అధికార పార్టీ అడ్డంకులు సృష్టిం చడంపై బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా మండిపడ్డారు. ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాక పోలీసులను అడ్డంపెట్టుకుని, అధికార పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు సభకు జిల్లా కలెక్టర్, ఎస్పీ అన్ని అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేయడంతో పాటు హెలీపాడ్‌కు ఆ ర్అండ్‌బీకి దరఖాస్తు చేసినట్లు ఆయన బుధవారం మీడియాకు చెప్పారు. ఇంకొల్లులోని పావులూరు రోడ్డులో ఓ రైతు లీజుకు తీసుకున్న దేవదాయశాఖ భూమిలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్న సమయంలో ఆశాఖ అధికారులు ఫిర్యాదు చేశారంటూ పనులు నిలిపివేయాలంటూ పోలీసులు హుకుం జారీ చేశారన్నారు. రైతు లిఖితపూర్వక అంగీకారంతోనే పనులు పూర్తి చేయగా, సభను భగ్నం చేయడానికి ప్రభుత్వ పెద్దలు కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు.

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

• టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల నారాయణరెడ్డి
• త్రిపురాతకంలో ఎరిక్షన్‌బాబు సమక్షంలో భారీగా చేరికలు


మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. జవహర్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ యూనిట్, బూత్ ఇన్‌చార్జుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతిక్లస్టర్, బూత్ ఇన్‌చార్జులు వెంటనే బూత్‌లలో పనులు ప్రారంభించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన పనిని వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాళ్లపల్లి సత్యనారాయణ, వక్కలగడ్డ మల్లికార్జునరావు, కందుల రామిరెడ్డి, కొప్పుల శ్రీనివాసులు, రమణ, నాలి కొండయ్య పాల్గొన్నారు.


గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న కందుల వసంతలక్ష్మి

మార్కాపురం వన్‌టౌన్ : టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ఆదరించి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంత లక్ష్మీ అన్నారు. పట్టణంలోని రెండవ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ హయంలో అమలుచేయనున్న సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

పొదిలి : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడి, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కుమారుడు విష్ణుశ్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పట్టణంలోని మూడో వార్డులో జరిగిన 'బాబుష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఆయన ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలతోపాటు, అభివృద్ది పరుగులుపెడుతుందన్నారు. మహిళలకు, యువతకు, వృద్ధులకు ఎంతో భరోసా ఉంటుందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఎన్నో బృహత్తరమైన సంక్షేమ పథకాలు అమల్లోకి తేనున్నట్లు చెప్పారు. టీడీపీ కార్యకర్తలు ఓటర్ల జాబితాలో అవక తవకలు లేకుండా చూడాలన్నారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతిపైన, వైఫల్యాలను, దౌర్జన్యాలను, ప్రజలకు వివరంగా తెలియజేయాలన్నారు. టీడీపీ హయాంలో ప్రతిఒక్కరికి భరోసా ఉండేదని వైసీపీ జగన్‌రెడ్డి పాలనలో అదిలేకుండా పోయిందన్నారు. కనుక యువత, మహిళలు రానున్న ఎన్నికల్లో ఆలోచించి అభివృద్ధి పథంలో నడిపించే నాయకున్ని ఎన్నుకోవాలని కోరుతూ ప్రతి ఇంటికి వెళుతూ ఆప్యాయంగా పలకరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు


ఎరిక్షన్‌బాబు సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

త్రిపురాంతకం : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధ వారం రాత్రి వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కందుల రమణారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని వీడిన కందుల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు మానికొండ ఆదినారాయణమ్మ, చల్లా వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ తేలుకుట్ల బొర్రయ్య, నాయకులు మానికొండ పెద్ద శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటేశ్వరరెడ్డి, కొల్లి భాస్కరరెడ్డి, చల్లా శ్రీను, ఉప్పు సత్తెయ్య, కామిశెట్టి అంజి, ఏడుకొండలు, వెలుగొండ అంజి, కొక్కెర ఆంజనేయులు, జాలాది వెంకటచెన్నయ్య, జి.శ్రీను, బొందలపాటి బాబుతోపాటు సుమారు 250 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. కొత్తగా పార్టీలో చేరిన వారికి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరినవారు మాట్లాడుతూ జగన్ రాష్ట్రానికి దశ, దిశ లేకుండా చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి ఒక్క చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమనే భావనతో టీడీపీలో చేరామని అన్నారు. ఈసందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల కాలంలో చేసిందేమీ లేదని అన్నారు. అక్రమ కేసులతో అరాచకాలు, భూదోపిడీలు మాత్రం చేశారన్నారు. అన్ని వర్గాల ప్రజలను వంచించిన జగన్ రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కు తీసుకెళ్లారని విమర్శించారు. దీంతో విసిగెత్తిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధమయ్యారన్నారు. కార్యక్రమంలో మార్కాపురం నియోజవర్గ నాయకుడు కందుల రామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.వలరాజు, మోటకట్ల శ్రీనివాసరెడ్డి, దేవినేని చలమయ్య, వంకాయలపాటి ఆంజనేయులు, కె.ఏడుకొండలు, ఎం.అల్లూరిరెడ్డి, ఏ.నాసరరెడ్డి, జి.సునీల్‌చౌదరి, డి.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలి


కరపత్రాలు అవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 14: రైతుసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించే గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని నాయకులు బుధవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐటీయూ డివిజన్ నాయకులు సోమయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను మరిచిందన్నారు. కార్పొరేట్‌లకు మేలు చేసే విధంగా పలు పథకాలను అమలుచేస్తూ అన్నివర్గాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. జిల్లాలో కరువు తాండవిస్తోంటే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకునే ఎటువంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. మరోవైపు వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టులను పట్టించుకోలేదన్నారు. ఈ క్రమంలో రైతు సంఘాలు, ప్రజాసంఘాలు, సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామాల్లో గ్రామీణ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, విద్యార్థులు, యువకులు మేధావులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అనంతరం కరపత్రాలు అవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి ,పిచ్చయ్య, దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 14: గ్రూపు-1 పరీక్షలు రాసే చెంచు, ఎరుకల, యానాది, సుగాలి గిరిజన అభ్యర్థులకు ఐటీడీఏ పరిధిలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు పీవో రవీంద్రా రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసే అభ్యర్థులు బయోడేటా, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, గ్రూపు-1కు దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ పత్రం జతచేసి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటలకు ప్రాజెక్టు అధికారి, ఐటీడీఏ, (పీటీజీ-చెంచు)శ్రీశైలం కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ అవకాశం సద్వినియోగ పర్చుకోవాలని కోరారు.

ఘనంగా పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కంభం, ఫిబ్రవరి 14 : కంభం మండలం రావిపాడు గ్రామంలో బుధవారం పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 12 సోమవారం నుంచి 14వ తేదీ బుధవారం వరకు జరిగిన విగ్రహ ప్రతిష్ఠతోపాటు పోతురాజు, సీతాలమ్మ, బొడ్డురాయి, శిఖర కళశం నూతన విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శనతో పాటు, చిన్నపిల్లల కోలాటం అలరించింది. అన్నదానం నిర్వహించారు.

భక్తి శ్రద్ధలతో వసంత పంచమి


సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14: వసంత పంచమీ పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక సాయి బాలాజీ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ప్రకాశరావు, ప్రిన్సిపాల్ మస్తాన్‌వలీల ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతి దేవి విగ్రహానికి పూజలు చేశారు. వాసవీ విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ కండెపు రంగయ్య ఆధ్వర్యంలో వసంత పంచమి నిర్వహించారు. కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కార్యదర్శి, కరస్పాండెంట్ అన్నా కృష్ణ చైతన్య సరస్వతిదేవి విగ్రహానికి పూజలు చేశారు. ప్రిన్సిపాల్ డా. వీ.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణవేణి పాఠశాలలో..


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూలులో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీ.హెచ్. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

కంభం, ఫిబ్రవరి 14 : తమ న్యాయమైన పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కంభం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాయకత్వం వహించిన ఎన్జీవో అధ్యక్షులు రాధాకృష్ణ పింఛనర్ల సంఘం అధ్యక్షులు ఇబ్రహీం మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు విడుదల, సీపీఎస్ రద్దు, 12పీఆర్‌సీ, ఐఆర్ విడుదల, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 15, 16 తేదీలలో భోజన విరామ సమయంలో నిరసన, 17న తాలూకా కేంద్రాలలో ధర్నా, 20న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా, 27న ఛలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సచివాలయ, ఆర్టీసీ ఉద్యోగులు, పింఛనర్లు ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

గిద్దలూరు, ఫిబ్రవరి 14 : సమ్మె ఒప్పంద జీవోలను విడుదల చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ధర్నా చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగయ్య, మురళి మాట్లాడుతూ డిసెంబరు 26 నుంచి జనవరి 9వ తేది వరకు 16 రోజులు తాము సమ్మె చేశామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఒప్పుకున్న విధంగా జీవోలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆవులయ్య మాట్లాడుతూ సమ్మె పోరాటం వాయిదా వేసి నెల రోజులు అవుతున్నా,, కార్మిక సంఘాలతో కుదుర్చుకున్న ఒప్పందాలు అమలుచేయకుండా, కాలయాపన చేయడం శోచనీయమన్నారు. పెంచిన వేతనానికి, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్లకు, ఇతర అంశాలపై ఇచ్చిన హామీల మేర జీవో విడుదల చేయాలని కోరారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

రేపు రథసప్తమి వేడుకలు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14: మార్కాపురంలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామికి రథసప్తమి పురస్కరించుకొని శుక్రవారం సప్తవాహన సేవ నిర్వహించనున్నట్లు ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి, రథసప్తమి సేవా సంఘం చైర్మన్ యక్కలి కాశీవిశ్వనాథంలు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 5 :30ని. సూర్యప్రభ వాహనం, 9గం.లకు శేషవాహనం, 11గం.లకు గరుడ వాహనం, 1గం.టకు హనుమంతవాహనం, 3గం.లకు కల్పవృక్ష వాహనం, 5గం.లకు వెండి రథోత్సవం, 8గం.లకు చంద్రప్రభ వాహనంపై చెన్నకేశవస్వామికి నగరోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాములునాయక్

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 14 : ఎర్రగొండపాలెంలో ఈ నెల 7న జరిగిన వృద్ధురాలి హత్యకేసులో నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆ మేరకు సీఐ రాములు నాయక్ వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 7న అంబేద్కర్ నగర్ చెందిన వృద్ధురాలు (78) శ్మశానవాటిక వద్దకు ఉదమం 10.30 ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లింది. అదే సమయంలో స్థానికంగా ఉన్న నేషనల్ వాటర్ సర్వీసింగ్ పాయంట్‌లో పనిచేసే చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా తీర్థా గ్రామానికి చెందిన సుపేన్ కశ్యప్ (20) వృద్ధురాలి తలపై రాయితో దాడి చేశాడు. అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి ఈడ్చుకొని వెళ్లాడు. స్పృహకోల్పోయిన వృద్ధురాలిపై అత్యాచారంచేసి ఆమె వద్ద గుడ్డసంచిలో ఉన్న రూ.1500 నగదు అపహరించుకొని వెళ్లాడు. స్పృహకోల్పోయిన వృద్ధురాలు ఘటన స్థలంలో మృతిచెందింది. నిందితుడు సుపేన్ కశ్యప్ గుట్టు చప్పుడు కాకుండా స్థానికంగా ఉన్న వాటర్ సర్వీసింగ్ పాయింట్‌లో యథావిధిగా విధులు నిర్వహిస్తున్నాడు. వృద్ధురాలు ఇంటికి రాకపోవడంతో కటుంబసభ్యులు 7వ తేదీ రాత్రి వరకు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆమె ఎక్కడా కన్పించలేదు. మరుసటిరోజు అంబేద్కర్ నగర్ శ్మశానవాటిక పక్కన చెట్లపొదలమధ్య మృతి చెంది ఉంది. దీంతో ఈ ఘటనపై మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజి ఆధారంగా దర్యాప్తు చేసి నిందితుడు సుపేన్ కశ్యప్‌ను బుధవారం ఎర్రగొండపాలెంలోని రాళ్లవాగు సమీపంలో నేషనల్ వాటర్ సర్వీసింగ్ పాయింట్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో స్థానిక ఎస్.ఐ సుదర్శన్, పోలీసు హెడ్ కానిస్టేబుల్స్, సహకారం అందించినట్లు తెలిపారు.

లోక్‌అదాలత్‌తో సమన్యాయం

• న్యాయాధికారి మేరీసారాదానమ్మ


మాట్లాడుతున్న న్యాయాధికారి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 14 : లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సమన్యాయం జరుగునని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి మేరీసారా దానమ్మ అన్నారు. బుధవారం కోర్టు భవనాల సముదాయం నందు మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ గురించి స్థానిక న్యాయవాదులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువగా సివిల్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు ఇరువర్గాలతో మాట్లాడి రాజీ చేయాల్సిందిగా కోరారు. లోక్‌అదాలత్ వలన కేసుల పరిష్కారం వలన సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. రెవెన్యూ, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్, మున్సిపల్‌కు సంబంధించిన కేసులు కూడా ప్రీలిటికేషన్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ యాసిన్‌భాషా, జనియర్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

రాచర్ల, ఫిబ్రవరి 14 : రౌడీషీటర్ల సత్ప్రవర్తనతో మెలగాలని స్థానిక ఎస్సై జి.క్రిష్ణపావని అన్నారు. బుధవారం మండలంలోని రౌడీషీటర్లకు ఆమె కౌన్సిలింగ్ నిర్వహించారు. స్వయంగా వారి ఇళ్ళ వద్దకు వెళ్లి ప్రస్తుతం ఏమి చేస్తున్నారు, ఎలాంటి పరిస్థితిలో ఉన్నారు అనే విషయాలపై ఆరా తీశారు. రానున్న ఎలక్షన్లలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అనచివేస్తామన్నారు.

రౌడీ షీటర్ల నివాసాల్లో తనిఖీ


రౌడీషీటర్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని దరిమడుగు గ్రామంలో రౌడీషీటర్ల నివాసం ఉన్న ప్రాంతాలను రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రౌడీషీటర్లు సహకరించాలని అన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

నియోజకవర్గ నేతలను కలిసిన అన్నా


కార్యకర్తలతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

పొదిలి, ఫిబ్రవరి 14 : గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే, మార్కాపురం ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు బుధవారం మండలంలో పలువురు వైసీపీ నాయకులను కలిశారు. మొదటిగా దర్శి మాజీ శాసన సభ్యులు సానికొమ్ము పిచ్చిరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి ఇంటికి వెళ్లి పార్టీ పరిస్థితిపై ఆరా తీశారు. అదేవిధంగా మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పట్టణ అధ్యక్షురాలు నూర్జహాన్, మండల నాయకుడు గొలమారి చెన్నారెడ్డి వద్దకు వెళ్లి పరిచయం చేసుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన కోరారు.

ఇళ్లు కోల్పోయిన బాధితుడికి ఆర్థిక సాయం

తర్లుపాడు : మండలంలోని పోతలపాడు గ్రామానికి చెందిన ఇళ్లు కోల్పోయిన బాధితుడు రాచేటి కిషోర్‌కు గిద్దలూరు ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇంఛార్జ్ అన్నా రాంబాబు రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. కిషోర్ ఇళ్లు బుధవారం తెల్లవారుజామున విద్యుత్ షాక్‌తో దగ్ధమైంది. దీంతో బాధితుడిని ఆదుకునేందుకు అన్నా రాంబాబు ముందుకు వచ్చారు. మార్కాపురంలోని ఆయన నివాసం వద్ద రూ.20 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, గ్రామసర్పంచ్ గాయం శ్రీనివాసులరెడ్డి, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విదేశీ విద్యను రద్దు చేసిన జగన్‌రెడ్డి

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి


భవిష్యత్‌గ్యారెంటీ బాండ్లు అందజేస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 14 : ఎస్సీల సంక్షేమం కోసం నాటి టీడీపీ హయాంలో ప్రవేశ పెట్టిన అంబేడ్కర్ విదేశీవిద్య పథకాన్ని నేడు జగన్‌రెడ్డి రద్దు చేయడం శోచనీయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల ఆశోక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముండ్లపాడు మేజర్ పంచాయితీలోని ఎస్సీపాలెంలో 'బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అమలుజేయనున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు ఆయన వివరించారు. టీడీపీ, జనసేనల ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన గ్రామసభలో మాట్లాడుతూ అబద్ధపు హామీతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఎస్సీలకు వెన్నుపోటు పొడిచాడన్నారు. దళితులకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఒక్క రూపాయి కూడా రాయితీపై రుణం ఇప్పించారా..? అని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రాయితీ రుణాలు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి నగదు సాయం అందించానన్నారు. పక్కాగృహాలు, సిమెంట్ రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. తాను స్థానికుడినని, ఎల్లవేళలా అందు బాటులో ఉంటానన్నారు. నీ ఇంటి బిడ్డగా తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్ని కలలో టీడీపీ, జనసేనల అభ్యర్థిగా ఉంటానని, సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు కడియం శేషగిరి, దుత్తా బాలీశ్వరయ్య, నంది శ్రీను, దూదేకుల నరసింహులు, వాడకట్టు శివప్రసాద్, గుర్రం డానియేలు, బొమ్మినేని వెంకటేశ్వర్లు, బిల్లా రమేష్, షహన్షావలి, బైనగారి ప్రభాకర్, గుర్రం శేఖర్, కొమ్మునూరు ఓబయ్య, శీలం కిష్టమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నయా నయీమ్ పాలనకు చెక్ పెట్టాలి

జనసేన నేత ఆమంచి స్వాములు


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఆమంచి స్వాములు

కంభం, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో కొనసాగుతున్న నయానయీమ్ పాలనకు చెక్‌పెట్టి పుష్ప తరహా స్మగ్లింగ్‌లను అరికట్టేందుకు టీడీపీ-జనసేన పార్టీలు ఉమ్మడి ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాయని జనసేన పార్టీ కార్యదర్శి ఆమంచి స్వాములు తెలిపారు. బుధవారం ఆయన రావిపాడు గ్రామంలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని మాట్లాడారు. భీమవరంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రచార కార్యక్రమంలో పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డంకులు కలిగించడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి కక్షసాధిం పు చర్యలు వైసీపీ వినాశనానికే అస్త్రాలు అవుతాయన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ఎవరిని ప్రకటించినా పొత్తుధర్మానికి బద్ధులమై ఉంటామన్నారు. ఆయన వెంట కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి


రైతులకు సమాదానాలిస్తున్న శాస్త్రవేత్త

గిద్దలూరు, ఫిబ్రవరి 14 : పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారపేట మండలాల్లోని రైతులతో వ్యవసాయ పరిశోధనక్షేత్రం శాస్త్రవేత్తలు సమావేశమయ్యారు. కంది పంటలో వచ్చే గూడపురుగు, ఎండుతెగులు, మిరప పంటలో వచ్చే ఎండు తెగులు, శనగపచ్చ పురుగు, పత్తిపంటలో వచ్చే గులాబీరంగు పురుగు, మిరపలో వచ్చే నల్లతామర, వైరస్ తెగుళ్ల నివారణ కోసం చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు వివరించారు. రైతుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. కలుపు నివారణ గురించి వివరించారు. వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు పాటించే సుస్థిర వ్యవసాయం చేసుకొనేందుకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భూసార పరీక్షలు చేయించుకుని సమగ్ర పోషక యాజమాన్య సస్యరక్షణ చర్యలు తీసుకుంటే సాగు ఖర్చు తగ్గించుకుని నాణ్యమైన ఉత్పత్తులు పెంచుకోవచ్చని తెలి పారు. ఆయా మండలాల వ్యవసాయాధి కారులు, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

• రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14: అన్ని శాఖల ఉద్యోగులు, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తాలుకా యూనిట్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల సబ్‌ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, ఫారెస్ట్, ఇరిగేషన్ శాఖలతో సహా అన్ని శాఖల కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు.

రాచర్ల : ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రాచర్లలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెప్టాపై గుంతలతో ప్రమాదం


చప్టాపై ఏర్పడ్డ గోతులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 14: మార్కాపురంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పక్కనే కొండేపల్లి రోడ్డులో చెప్టాపై రెండు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. 1200 మంది బాలికలు చదివే పాఠశాలకు నిత్యం ఈ రోడ్డునే రాకపోకలు నిర్వహించాలి. ఈ రోడ్డులోనే అనేక ఆటోలు కొండేపల్లికి తిరుగుతుంటాయి. వందలాది ద్విచక్ర వాహనాలు కూడా రాకపోకలు సాగిస్తుంటాయి. కానీ కొన్ని రోజులుగా చెప్టా కూలి రెండు గండ్లు పడ్డాయి. అయినా అధికారులు పట్టించుకోలేదు. నూతన చప్టా నిర్మించి ప్రజల ఇక్కట్లు తీర్చాల్సిన అవసరం ఉంది.

ఆర్మీజవాన్‌కు అశ్రునివాళ్లు

• శోకసముద్రంలో యర్రపల్లి గ్రామం
• అధికార లాంఛనాలతో అంత్యక్రియలు




యర్రపల్లిలో అంత్యక్రియలకు హాజరైన ప్రజలు, బ్రహ్మానందరెడ్డి (ఫైల్)

కొమరోలు, ఫిబ్రవరి 14: మండలంలోని యర్రపల్లి గ్రామానికి చెందిన మారం బ్రాహ్మానందరెడ్డి అంత్యక్రియలు యర్రపల్లి గ్రామంలో బుధవారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. కొన్నేళ్లుగా మద్రాసు రెజిమెట్స్‌లో జవానుగా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆయన మండలంలోని యర్రపల్లి గ్రామానికి సెలవుపై వచ్చారు. సెలవులు ముగించుకుని ఈ నెల 8న ఒంగోలుకు వెళ్లి అక్కడి నుంచి విజయవాడ మీదుగా బంగ్లాదేశ్ సరిహద్దులోని పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని న్యూ జలసాయి గుడి(ఎన్‌జీపీ) రైల్వే స్టేషన్‌కు ఈ నెల 10న చేరుకున్నారు. అక్కడి నుంచి ఆర్మీయూనిట్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో అదృశ్యమైన విషయం పాఠకులకు విధితమే. అదే సమయంలో రైల్వే స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మృతదేహం ఉంది. దానికి 30 మీటర్ల దూరంలో బ్రాహ్మనందరెడ్డికి చెందిన లగేజి బ్యాగు, పత్రాలను రైల్వే పోలీసులు గుర్తించి మద్రాసు యూనిట్ అధికారులకు స మాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తుపటేందుకు వీలు లేకపోవడంతో జవాను కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటీన ఎన్‌జీపీ రైల్వేస్టేషన్‌కు కుటుంబసభ్యులు చేరుకొన్నారు. మృతదేహాన్ని గుర్తించలేదని విధంగా ఉంది. దీంతో మద్రాసు యునిట్ అధికారులు, పశ్చిమ బెంగాల్ పోలీసులు, రైల్వే పోలీసులు, జవాను కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఆర్మీ అధికారులు మృతదేహం, వారి కుటుంబసభ్యుల డీఎన్ఏ పరీక్షలు చేయించారు. ఆ రిపోర్టు ఆదారంగా మృతదేహం బ్రహ్మానందరెడ్డిదేనని నిర్ధారించారు. దీంతో మృత దేహాన్ని బుధవారం తెల్లవారుఘమున స్వగ్రామం యర్రపల్లి గ్రామానికి చేర్చారు. సమాచారం తెలుసుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి, మనోజ్ చారిటబుల్ అధ్యక్షులు కామూరి రమణారెడ్డిలు విడివిడిగా యర్రపల్లి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం అధికారిక లాంచనాలతో అంత్య క్రియలు నిర్వంహించారు. అయితే బ్రహ్మానంద రెడ్డి మృతిపై సమగ్రంగా విచారిస్తున్నట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.


ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న భక్తులు

వైభవంగా జంట నాగుల ప్రతిష్ఠ

పామూరు, ఫిబ్రవరి 14 : పామూరు మేజర్ పంచాయతీ పరిధిలోని డీవీ పాలెం గ్రామంలో కొలువైన శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో వసంత పంచమి సందర్భంగా జంట నాగుల శిలలను ప్రతిష్ఠించారు. అర్చకులు చిమటా కార్తికేయస్వామి, శివస్వామి ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ బుధవారం వైభవంగా ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎంపాడు మండలం సీతారామపురం గ్రామానికి చెం దిన దాతలు పాపర్తిని నాగరాజు, జ్యోతి దంపతుల ఆర్థిక సాయంతో నాగశిలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన నిర్వాహకులు ఈర్ల కోటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు. ఇకపై ప్రతి మంగళవారం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మౌలాలి

పామూరు, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా శ్యామల మౌలాలిని నియమించినట్లు పీసీసీ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. మండల కమిటీ ఎంపిక సమావేశం బుధవారం జరిగింది. మౌలాలి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పీసీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డి, సమన్వయ కర్త హాజీమస్తాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం

- కుప్పకూలిన వంతెన
- రెండేళ్లుగా సాగర్ కెనాల్‌పై నిర్మాణానికి నోచుకోని వారధి
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- కర్రలు కట్టుకొని రాకపోకలు

దొనకొండ, ఫిబ్రవరి 14 : సాగర్ కెనాల్‌పై ప్రజలు అటు ఇటు రాకపోకలు జరుపుకునేందుకు నిర్మించిన వంతెన రెండేళ్ల క్రితం అకస్మాత్తుగా రాత్రి సమయంలో కుప్ప కూలింది. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన ఈ వంతెన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు చెందిన దాదాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్‌కాలువకు అవతలివైపున ఉన్నందున్న రాకపోకల నిమిత్తం అప్పట్లో కెనాల్‌పై వారధి నిర్మాణం చేపట్టారు. 2022 ఫిబ్రవరిలో రాత్రి సమయంలో వంతెన ఒక్కసారిగా కాలువలోకి కుప్పకూలింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు అటు-ఇటు రాకపోకలు జరుపుకునేందుకు రెండేళ్లుగా పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. వంతెన నిర్మాణం గూర్చి అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా రెండేళ్లుగా పట్టించుకున్న వారే లేరని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రతిరోజూ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక కూలిన వంతెనపై నడిచి వెళ్లేందుకు నిచ్చెనలా కర్రలను ఏర్పాటు చేసుకొని ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆ సమయంలో ఒకరిద్దరు అదుపుతప్పి కాలువలో పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పశుపోషకులు తప్పనిసరై పశువులను మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన మీదుగా ప్రతిరోజూ రాకపోకలు చేస్తున్నారు. సాగర్ కాలువలో నీరు సంవృద్ధిగా ప్రవహిస్తున్న సమయంలో కూలిన వంతెన పైనుంచే రాకపోకలు సాగించేందుకు కుదరకపోవడంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గేవరకు తప్పనిసరిగా చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లడం తప్పనిసరి. ప్రజలకు ఎంతో అవసరమైన సాగర్ కాలువపై వంతెన నిర్మాణంపై వైసీపీ పాలకులు, అధికారులు రెండేళ్లుగా నిర్లక్ష్యం చూపారని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం ఎప్పుడు జరుగుతుందో ఇబ్బందులు ఎప్పుడు తొలగుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.


రెండేళ్ల కిందట సాగర్ కాలువపై కూలిన వంతెన


కర్రలపై రాకపోకలు చేస్తున్న ప్రజలు

రెండేళ్లుగా ఇబ్బందులు



సాగర్ కాలువపై వంతెన కూలి ప్రజలు రెండేళ్లుగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వందల సంఖ్యలో రైతులు, పశుపోషకులు ప్రతినిత్యం వ్యవసాయ పనులకు, పశువుల మేత నిమిత్తం ఈ వంతెనపై నుంచే పొలాలకు వెళ్లివస్తున్నారు. అటువంటి ప్రాముఖ్యమైన వంతెన నిర్మాణాన్ని రెండేళ్లుగా అధికార పార్టీ పాలకులు పట్టించుకోకపోవటం దారుణం.

- యగ్గోని యల్లారెడ్డి, చందవరం గ్రామం


మర్రికుంటపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పీసీపల్లి, ఫిబ్రవరి 14 : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను కనిగిరి సీఐ దాసరి వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఎస్సై రమేష్‌బాబుతో కలిసి కమ్మవారిపల్లి, పడమటిపల్లి, మర్రికుంటపల్లి, ముద్దపాడు, పాలేటిపల్లి, తలకొండపాడు, చిరుకూరివారిపల్లి పోలింగ్ కేంద్రాలను సీఐ పరిశీలించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలపై అవగాహన కోసం పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ తప్పుడు ప్రచారాలు

జనసేన పార్టీ నేత వెంకట్

దర్శి, ఫిబ్రవరి 14 : వైసీపీ ఓటమి భయంతోనే జనసేన, టీడీపీ పార్టీలపై తప్పుడు ప్రచారాలు చేస్తోందని దర్శి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో తమకు లభిస్తున్న ఆదరణ చూసి వైసీపీ నాయకులు బెంబేలెత్తుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటు ఖాయమన్నారు. నియోజకవర్గంలో ఇరు పార్టీలు కలిసి పనిచేస్తున్నామని, అభ్యర్థి విజయం తథ్యమన్నారు. తాను ఎల్లప్పుడూ దర్శిలో ఉంటానని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం పనిచేస్తానని వెంకట్ స్పష్టం చేశారు.

బావిలో పడి యువకుడు మృతి


నాగేశ్వరరావు మృతదేహం

ముండ్లమూరు, ఫిబ్రవరి 14 : మండలంలోని ఈదర గ్రామానికి చెందిన తిరుమలశెట్టి నాగేశ్వరరావు (34) ప్రమాదవశాత్తు నేల బావిలో పడి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. వివరాల్లోకి వెళితే నాగేశ్వరరావు తన పొలంలో మిరప తోటకు నీరు కట్టేందుకు బావి వద్దకు వెళ్లారు. బావిలో నుంచి వచ్చే పైపు సరి చేస్తుండగా కాలుజారి బావిలో పడిపోయారు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా బావి దగ్గర చెప్పులు కన్పించడంతో అనుమానం వచ్చి బావిలో చూడగా నాగేశ్వరరావు మృతి చెంది ఉన్నారు. నాగేశ్వరరావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య నాగమని ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాగేశ్వరరావు మృతి జనసేన పార్టీకి తీరని నష్టం

ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందిన గ్రామ జనసేన పార్టీ నాయకుడునాగేశ్వరరావు మృతదేహాన్ని దర్శి నియోజక వర్గ జనసేన పార్టీ నాయకుడు గరికపాటి వెంకట్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన వంతుగా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ముండ్లమూరు ఎస్టీ కాలనీకి చెందిన యాకసిరి శివయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట రామారావు, టీడీపీ మాజీ తెలుగు యువత అధ్యక్షుడు నాగండ్ల రమణ, వీరపనేని శ్రీనివాసరావు, మాలెంపాటి కోటయ్య, మేదరమెట్ల అచ్చయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ఉషామురళి

కుట్టు శిక్షణతో మహిళలకు ఆర్థికాభివృద్ధి

దొనకొండ, ఫిబ్రవరి 14 : మహిళల ఆర్థికాభివృద్ధికి కుట్టు శిక్షణ కేంద్రాలు దోహద పడతాయని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి పేర్కొన్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దొనకొండ అడ్డరోడ్డులో నరసింహ నాయునిపాలెం గ్రామానికి చెందిన గుడిమెట్ల కోటయ్య పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీపీ ఉషామురళి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చదువుపట్ల ఆశక్తిలేని బాలికలు ఉచిత కుట్టు శిక్షణతో ఉపాధి పొందవచ్చన్నారు. అచ్చిరెడ్డి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు చేయూతనిచ్చేలా తమ ట్రస్టు ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ, మగ్గం వర్క్ తదితర శిక్షణ కేంద్రాలను త్వరలో ఏర్పాటుకు చేస్తామన్నారు. మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్‌లతో పాటు కుట్టు మిషన్ ఉచితంగా అందిస్తామని కోటయ్య తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, పలువురు మాగుంట అభిమానులు పాల్గొన్నారు.

గ్రూపు తగాదాలు వీడండి


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని

దర్శి, ఫిబ్రవరి 14 : గ్రూపు తగాదాలు వీడి, ఐక్యంగా పనిచేయాలని నాయకులు, కార్యకర్తలకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సూచించారు. దర్శిలో నూతనంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న సమస్యలు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా వచ్చే ఎన్నికల్లో గెలుపుకు కృషి చేయాలని కోరారు. బూచేపల్లి కుటుంబానికి దర్శి నియోజకవర్గ ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్‌బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వీరగంధం కోటయ్య, ఇత్తడి దేవదానం, ఏఎంసీ మాజీ చైర్మెన్లు కెవి రెడ్డి, వి వెంకటరెడ్డి, దర్శి వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి



సవేశంలో మాట్లాడుతున్న యాసిన్

కనిగిరి, ఫిబ్రవరి 14: భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు యాసిన్ కోరారు. దర్శి చెంచయ్య భవనంలో బుధవారం సమావేశం జరిగింది. రైతుల తమ సమస్యలపై చేసిన పోరాటంతో కేంద్రం దిగివచ్చి నల్లచట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా, ఆ జీవోలను అమలు చేయడం లేదని యాసిన్ అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తెచ్చి కర్షక, శ్రామిక, కార్మిక వర్గాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. పంటల సాగుకు ఉపయోగించే యూరియా మీద రూ.62వేల కోట్ల సబ్సిడీలను ఎత్తివేసి రైతులకు అన్యాయం చేసిందన్నారు. ఉపాధి హామీకి రూ.4052కోట్ల కోత విధించి కూలీల పొట్ట కొట్టారన్నారు. 16న జరిగే భారత్ బంద్‌తో మోదీకి బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గుజ్జుల బాలిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి జీవీ రామారావు, ఖాసింపీరా, ఆలూరి కోటయ్య, అశోక్, పవన్‌కల్యాణ్, రాము పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చి దిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మత్తు పదార్థాల నివారణ, మాదకద్రవ్యాల రవాణా నిరోధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వాడకాన్ని, రవాణాను అరికట్టేందుకు పటిష్ఠమైన ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. వీటి బారిన పడితే యువత జీవితాలు నాశనం అవుతాయని, అందువల్ల వీటి వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల పరిధిలో డి అడిక్షన్ సెంటర్ ఉండేలా చూడాలని, మద్యానికి బానిసైన వారికి ఆ అలవాటును మాన్పించేందుకు పరివర్తన శిబిరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. చెక్‌పోస్టుల వద్ద పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ పరమేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీలు పటిష్ఠంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిఅడిక్షన్ కేంద్రాలు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా వ్యవస్థపై నిఘాఉందని, మాదక ద్రవ్యాల నియంత్రణకు అన్నిశాఖల సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాకు వచ్చే వలస కార్మికులు మత్తు పదార్థాలను ఫ్యాక్టరీల్లోకి అక్రమంగా తరలించడం, సేవించడం వంటివి జరగకుండా యజమానులు తనిఖీలు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

సమస్యలు పరిష్కరించని వైసీపీకి బుద్ధి చెబుదాం


కనిగిరి, పామూరు, పీసీపల్లిలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగ సంఘ జేఏసీ నాయకులు

కనిగిరి, ఫిబ్రవరి 14: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించని వైసీపీకి తగిన బుద్ధి చెప్దామని ఉద్యోగ సంఘ జేఏసీ, ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు రమణారెడ్డి అన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జేఏసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై చిన్నచూపు చూస్తుందన్నారు. 2019 జూలైలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరైనా నేటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను కూడా విడుదల చేయకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయటం దుర్మార్గమన్నారు. పీఆర్‌సీ బకాయిల చెల్లింపుల్లో మీనమేషాలు లెక్కిస్తూ ఉద్యోగుల పట్ల నిరక్ష్య ధోరణి అవలంబిస్తున్న ప్రభుత్వ తీరును ఆయన ఖండించారు. పెన్షనర్లకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన అదనపు క్వాంటమ్ పెన్షన్‌ను పెంచకుండా అన్యాయం చేసిందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచకుండా వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యేలా వైసీపీ పాలకులు వ్యవహరించిన తీరుపై ఆయన మండిపడ్డారు. ఎన్నికలకు ముందు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తానని చెప్పిన జగన్‌రెడ్డి మాట తప్పారన్నారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, 12.5 శాతం కోటాను అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నా రన్నారు. సీపీఎస్‌పై జగన్‌రెడ్డి మాటతప్పారన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే రోజుకో రూపంలో నిరసనను తెలియచేస్తామని హెచ్చరించారు. ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమంతో వైసీపీపై పోరుబావుటాకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో కార్యాలయ ఏఓకు అందచేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

పామూరు : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డీఈసీ సభ్యుడు, సీనియర్ సహాయకులు కేటీవీ నరసింహారావు కోరారు. తహసీల్దార్ ఆఫీస్ ఎదురుగా తహసీల్దార్, ఎంపీడీవో, సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ డీటీ పృథ్వీరాజ్, సీనియర్ సహాయకులు పురుషోత్తంరెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు, మనోహర్, వీఆర్వోలు, షేక్ రఫీఅహమ్మద్, సరస్వతి, ఖాశింవలి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది స్రవంతి, సుచరిత, కార్యదర్శి కృష్ణమూర్తి, మదార్‌వలి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీసీపల్లి : న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులు కార్యాలయాల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్స్, పీఆర్సీ అరియర్స్ వంటి సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. చర్చల పేరుతో ఉద్యోగులను మోసగిస్తుందేతప్ప సమస్యలను పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు, తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు, పెదఅలవలపాడు సచివాలయం ఎదుట వ్యవసాయ శాఖ, సచివాలయ ఉద్యోగులు భోజన సమయంలో నిరసన తెలిపారు.


నాయబ్‌రసూల్‌ను సన్మానిస్తున్న కోఆప్షన్ సభ్యులు

డాక్టరేట్ రావడంపై హర్షం

పామూరు, ఫిబ్రవరి 14 : సామాజిక కార్యకర్త, వార్డు మెంబర్ స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు నాయబ్‌రసూల్ సేవలకు గుర్తింపుగా చైన్నైకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యునివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాజానాయబ్ రసూల్ తెలిపారు. ఈ సందర్భంగా నాయబ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గోవిందయ్య, మాదిగ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు రాచూరి ఏలియా, శ్రీరాం శ్రీనివాసులు, సిద్దయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకటనారాయణ, కాశిం, సయ్యద్ జిలాని పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి14: శాంతిభద్రతలకు విఘాతం కలిగించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఈమేరకు పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. చెడు నడత కలిగిన వ్యక్తులు, నేరప్రవృత్తి విడనాడి సత్‌ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. దౌర్జన్యలు, నేరాలకు, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ మేరకు రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్స్ ఇళ్లకు పోలీసులు వెళ్లి వారిని విచారించి వారి స్థితిగతులపై ఆరా తీశారు. అదేవిధంగా వారిలో పరివర్తన కలిగే విధంగా కౌన్సెలింగ్ నిర్వహించారు.


బహుమతులు అందజేస్తున్న కమిషనర్ దానియేలు

విలువలతో కూడిన విద్యతో ఉన్నతస్థాయి

కనిగిరి, ఫిబ్రవరి 14: విలువలతో కూడిన విద్య ఉన్నత స్థాయి చేరుకునేందుకు దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ దానియేలు అన్నారు. పట్టణ సమీపంలోని కంభం రోడ్డులో ఉన్న వైష్ణవి ఏఎల్ఎన్ఎం మహిళా డిగ్రీ కళాశాలలో బహుమతుల ప్రదానోత్సవం బుధవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆంధ్రకేసరి యూనివర్సిటీ మొదటి సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో కళాశాల విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన ఎం.జయలక్ష్మి, జీ మౌనిక, ఎన్ గాయత్రి, కే శైలజ, డీ వెంకటపూజితను కమిషనర్ అభినందించి బహుమతులను అందజేశారు. ఫలితాలు రాబట్టేందుకు కృషి చేసిన అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రామన విజయావెంకటేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం

పామూరు, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం ఉంటుందని పీసీసీ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సమన్వయ కమిటీ సభ్యుడు షేక్ హాజీమస్తాన్ సమక్షంలో శ్యామల మౌలాలి ఆధ్వర్యంలో పలువురు ముస్లింలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వెంకటేశ్వరరెడ్డి సూచించారు.

టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

బాబు ష్యూరిటీలో మండల అధ్యక్షుడు వేమూరి

పీసీపల్లి, ఫిబ్రవరి 14 : తెలుగుదేశం ప్రభుత్వంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య అన్నారు. మారెళ్ల గ్రామంలో బుధవారం రాత్రి బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. టీడీపీ శ్రేణులందరూ ఇంటింటికీ తిరిగి టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామకమిటీ అధ్యక్షుడు పరిమి వెంకటేశ్వర్లు, నాయకులు కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వీరపనేని పెద్దన్న, ములకా నాగేశ్వరరావు, బోయపాటి సుబ్బారావు, కోమటిగుంట్ల వీరయ్య నాగేంద్రబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


సూపర్‌సిక్స్ కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఒక్కచాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

పామూరు : ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రాష్ట్ర ప్రగతిని నాశనం చేసి, ప్రజలపై భారాలు మోపారని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సయ్యద్ అమీర్‌బాబు అన్నారు. పట్టణంలోని సత్యనారాయణపురం (ఎర్రచేలు) ప్రాంతంలో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త ఓటర్ల చేర్పులు, మార్పులను పరిశీలించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పేదల జీవితాలు బాగుపడతాయన్నారు. వైసీపీ పాలనలో అవినీతి, అరాచక ఘటనలు పెరిగిపోయాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఇర్రి కోటిరెడ్డి, ఐటీడీపీ కోఆర్డినేటర్ ఫత్తుమస్తాన్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుకు ముగియనున్న గడువు

దొనకొండ, ఫిబ్రవరి 14 : రబీ 2023-24 సంవత్సరంలో రైతులు సాగు చేసిన పంటలను ఈక్రాప్ బుకింగ్ నమోదుకు ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తుందని వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని పోలేపల్లి, చందవరం గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంటలను సూపర్ చెక్ విధానంలో బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది రబీలో దాదాపు 1500 ఎకరాల్లో 510 మంది రైతులు జొన్న, బొబ్బర్లు, మిర్చి, నువ్వులను సాగు చేసినట్లు తెలిపారు. వీటిలో 98 శాతం పంట నమోదు పూర్తయిందన్నారు. పంటల నమోదు తర్వాత బయోమెట్రిక్ విధానంలో రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద వేలిముద్రలు వేయాలన్నారు. ఈ పంటలో నమోదు జరిగితేనే పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. 200 మంది రైతులు వేలిముద్రలు ఇంకా వేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమం లో గ్రామ వ్యవసాయ సహాయకులు సురేంద్ర, ఆంజనేయులు, విన్నీ బాబు, రైతులు పాల్గొన్నారు.



జిల్లాలోని ఇసుక క్వారీలన్నింటిని తనిఖీచేసి రిపోర్టు ఇవ్వాలని జాతీయ హరిత ట్రెబ్యునల్ జారీచేసిన ఆదేశాలు ఇక్కడి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేస్తున్నాయి. భారీ యంత్రాలతో జిల్లాలో కృష్ణానది తీరం వెంట నిత్యం ఇసుక తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతున్నారు. దీనిపై శాటిలైట్ ఇమేజీలన్నీ కేంద్ర నిఘాసంస్థల వద్ద నిక్షిప్తమై ఉన్నట్లు ఇప్పటికే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించినా ఉలుకుపలుకు లేదు. తాజాగా ఎన్‌జీటీ ఇసుక రీచ్‌లన్నింటిని తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్‌ని ఆదేశించడంతో అధికారులు హడలిపోతున్నారు. ఎన్‌జీటీ వద్ద సమగ్ర సమాచారం ఉన్న నేపథ్యంలో అక్రమాలను దాచిపెట్టి అంతా సవ్యంగా ఉన్నట్లు రిపోర్టు ఇస్తే అది సంబంధిత అధికారుల మెడకు చుట్టుకునే అవకాశం లేకపోలేదు.

ఇసుక మస్కా

- ఎన్జీటీ ఆదేశాలతో ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్‌లు
- కృష్ణా తీరంలో గుంటూరు, బాపట్ల కలెక్టర్‌ల తనిఖీలు
- అమరావతి ప్రాంతంలో పల్నాడు కలెక్టర్..
- మున్నంగి రీచ్‌కి వచ్చిన వారిని బయటకు పంపేసిన అధికారులు
- మీడియాను తిప్పిపంపిన అధికారులు
- కొన్నిచోట్ల కలెక్టర్‌లను తప్పుదారి పట్టించిన కిందిస్థాయి సిబ్బంది
- తవ్వకాలు జరిపేది ఒకచోటయితే చూపించింది మరోచోట
- అక్రమార్కులకు ముందే సమాచారం ఎవరిచ్చినట్లో!
- తవ్వకాలు ఆపేసి... యంత్రాలను తప్పించేసి...
- ఇన్నాళ్లు కళ్లకు గంతలు కట్టుకొన్న జిల్లా స్థాయి అధికారులు


అమరావతి: మల్లాదిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

గుంటూరు, తెనాలి, ఫిబ్రవరి14 (ఆంధ్ర జ్యోతి): ఎన్జీటీ ఆదేశాలతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండు జిల్లాల కలెక్టర్‌లు, ఇతర శాఖల అధికారుల బృందం కృష్ణా తీరంలోని ఇసుక రీచ్‌లలో తనిఖీలు నిర్వహించింది. బాపట్ల జిల్లా జువ్వలపాలెం, గుంటూరు జిల్లా మున్నంగి, మరికొన్ని రీచ్‌లలో కలెక్టర్ల బృందం ఇసుక తవ్వకాల తీరును పరిశీలించింది. అయితే తనిఖీల సమయంలో స్థానికును అనుమతించ లేదు. బాపట్ల జిల్లా కలెక్టర్ జువ్వలపాలెం రీచ్ పరిశీలించే సమయంలో స్థానికులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. స్థానికులను అక్కడికి రానివ్వకుండా కిందిస్థాయి అధికారులు ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే గుంటూరు జిల్లా అధికారుల బృందం మాత్రం మున్నంగిలో పరిశీలించే సమయంలో అధికారులు మినహా ఇతరులు ఎవరూ ఉండొద్దని ముందే చెప్పేయటంతో స్థానికులు దగ్గరకు వెళ్లలేదు. చివరకు మీడియాను కూడా తర్వాత పిలుస్తామని సున్నితంగా వెనక్కు పంపేశారు. అయితే కొన్నిచోట్ల స్థానికులు దూరం నుంచి తవ్వకాలు జరుగుతోంది ఇక్కడ కాదు... మరోచోటని అధికారుల బృందానికి చెప్పేందుకు ప్రయత్నించినా వారి కేకలు పట్టించుకోలేదు. తవ్వకాలు జరుగుతున్నది ఒకచోటైతే, తనిఖీలు చేసింది మాత్రం మరోచోట. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అన్ని రీచ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాల్సిఉంటే, కిందిస్థాయి సిబ్బంది, మైనింగ్ శాఖలో కొందరు ఏకంగా జిల్లా కలెక్టర్‌లనే తప్పుదారి పట్టించారు. రెండు రోజుల ముందు ఆపేసిన రీచ్‌ను ఒకచోట, జె.పి సంస్థ తవ్వకాలు ఆపేసిన తర్వాత ఆగిన మరోచోట చూపించటం, కింద నీరు ఉండటంతో ఒడ్డునుంచే పరిశీలించాల్సి వచ్చింది. పల్నాడు జిల్లాలో కలెక్టర్ తనిఖీలకు వచ్చినప్పుడు కొంతవరకు తవ్వకం దారులు, అధికారులు భయపడినట్లు కనిపిస్తే, గుం టూరు, బాపట్ల జిల్లాలో కిందిస్థాయి అధికారులే వాస్తవాలు చూపించకుండా తప్పుదారి పట్టించారని రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు అధికారులు ఇటువైపు ఎన్ని అక్రమాలు జరిగినా కన్నెత్తయినా చూడలేదని, ఇప్పుడు జిల్లా కలెక్టరే రావటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. అయితే తనిఖీలకు ముందే తవ్వకాలు ఆపేసి ఉండటం, అక్కడ ఏమీ జరగటంలేదన్నట్టు చూ పించటానికి మిగిలిన శాఖల అధికారులు ప్రయత్నం చేశారు. అయినా గుంటూరు కలెక్టర్ మాత్రం లోపలకు వెళ్లిమరీ పరిశీలించారు. అయితే నిన్నటివరకు తవ్విన ప్రాంతం కాకుండా, కొత్తగా తవ్వటానికి వేసిన గాలుమార్గంలో చూపించటంతో స్థానికులు నిరాశకు గురయ్యారు.


పాత్రికేయునిపై దాడి

కొల్లూరు, అమరావతి, కొల్లిపర, ఫిబ్రవరి14: కొల్లూరు మండలం జువ్వలపాలెం వద్ద కృష్ణానది ఇసుక రీచ్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా చింతల్లంకకు చెందిన తోడేటి సురేష్ పెదలంక గ్రామ పరిధిలోని అరవింద వారధి సమీపంలో జరుగుతున్న ఇసుక తవ్వకాల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అక్రమ తవ్వకాలపై స్పందనలో అర్జీ అందించామని, ఆ కాపీలను నదీ పరీవాహక శాఖతో పాటు మైనింగ్ శాఖ ఏడీకి కూడా పంపినట్లు కలెక్టర్‌కు తెలిపారు. స్పం దించిన కలెక్టర్ ఇసుక తవ్వకాలు పరిశీలించి విచారణ చేసి తనకు నివేదిక అందించాలని సూచించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని మల్లాది, కోనూరు రీచ్‌లను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పరిశీలించారు. కలెక్టర్ వెళ్లిపోయిన 15గంటల్లో మరలా ఇసుక అక్రమ క్వారీయింగ్ ప్రారంభించారు. వైసీపీ వర్గీయులు బుధవారం ఉదయం నుంచి వైకుంఠపురం, మల్లాది గ్రామాల్లో క్వారీయింగ్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను కవర్ చేసేందుకు వెళ్లిన ఓ పాత్రికేయునిపై వైసీపీ నాయకుని అనుచరులు దాడిచేసి అతని వద్దనున్న సెల్‌ఫోన్ తీసుకుని భయానక వాతావరణాన్ని సృష్టించారు. మల్లాది రీచ్‌లోకి వెళ్లిన తనను గ్రామానికి చెందిన వెంపా శ్రీను, తులసి తిరుపతిరావుతో పాటు మరికొందరు తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత్రికేయుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం మండలంలోని బొమ్మువానిపాలెం, వల్లభాపురం ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు.

అక్రమాలు బహిరంగం..


బాపట్ల : జువ్వలపాలెం వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ఇసుక తవ్వకాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. ఒక్కో రీచ్‌లో నిబంధనలతో పనిలేకుం డా ఏడు నుంచి 15 అడుగుల లోతు లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నా రు. నిబంధనలను ఎంత దారుణంగా అతిక్రమిస్తున్నారనే దానికి దుగ్గిరాల మండలంలోని పెదకొండూరు దగ్గర అక్రమ తవ్వకాలపై అధికార పార్టీ నేతలే ఫిర్యాదు చేయటం నిదర్శనం. ఇదేతరహాలో కొల్లిపర మండలంలోని రీచ్‌లపైనా పలు ఫిర్యాదులు అందా యి. అయితే అక్రమ తవ్వకాలు జరుపుతున్న రీచ్‌లను వదిలేసి, రెండురోజుల క్రితం తవ్వకాలు ఆపేసిన మున్నంగి రీచ్‌ను సిబ్బంది చూపించటం కూడా స్థానికుల విమర్శకు తావిస్తోంది. అయితే అక్రమ తవ్వకాలను పట్టుకునే ఆలోచనతో గుంటూరు జిల్లా కలెక్టర్ నది లోపలకి వెళ్లిమరీ పరిశీలించారు. కానీ కిందిస్థాయి సిబ్బంది మాత్రం నిన్నటి వరకు తవ్వకాలు జరిపిన చోటకు వేసిన పాత గాలు మార్గం నుంచి కాకుండా, ఇటీవల మరోచోట తవ్వేందుకు కొత్తగా వేసిన గాలులోకి తీసుకెళ్లారనేది విమర్శ. ఈ గాలులో లారీ వెళ్లటమే కానీ, తిరగి రావటానికి వీలుగా వేయలేదు. పనులు పూర్తికాకపోవటంతో అసంపూర్తిగానే ఉంది. ఈ రీచ్‌లో రెండు రోజులకోసారి దొంగ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అయితే లారీ వెనక్కు నడిపించుకు వెళ్లి మరీ ఇసుక పోసుకొస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు స్థానికులు ప్రయత్నించినా వారిని ఆయన దగ్గరి వరకు వెళ్లనివ్వకుండానే సిబ్బంది అడ్డుకున్నారు. అప్పటికీ స్థానికుడు ఒకరు తన ఫోన్‌లో ఈ తనిఖీల వ్యవహారాన్ని, కిందిస్థాయి సిబ్బంది అత్యుత్సాహాన్ని వీడియో తీస్తుంటే, అతనిని పట్టుకుని మైనింగ్ శాఖలో ఓ అధికారి ఫోన్ తీసుకుని, ఆ వీడియోలను మొత్తం డిలీట్ చేయించి మరీ బయటకు పంపటం విశేషం. కొత్తబొమ్ము వానిపాలెంలో బుసక పేరుచెప్పి ఇసుకతరలించేస్తున్నా, వల్లభాపురం దగ్గర అనుమతి తీసుకుని, మున్నంగి దగ్గర ఇసుక తవ్వుతున్నా, మున్నంగి, అత్తలూరివారాపాలెం, కొల్లిపర దగ్గర భారీగా ఇసుక కొండలను పోలిన గుట్టలు పోసి ఉంచినా వాటిపై ఆరా కూడా తియ్యకుండా, భారీ ఇసుక లోడుతో నీరు కారిపోతూ లారీలు కనిపించినా వాటినీ ఆపకుండా తనిఖీలు మాత్రం చేశామనిపించటానికి కిందిస్థాయి సిబ్బంది తాపత్రయపడ్డారు. వాస్తవానికి మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చిన చోట అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా లోకేషన్ ప్రాకారం చూస్తే గుట్టు బయటపడేది. జిల్లా కలెక్టర్ రాకముందే అధికారుల బృందం అన్నీ ముందస్తుగా పరిశీలించి చూడాల్సిన ప్రదేశాలను నిర్ణయించటం విశేషం. మరి గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఏమి నివేదిక అందుతుందో! అక్రమార్కులపై చర్యలు ఎంతవరకు ఉంటాయో!



వైకుంఠపురం ఇసుక రవాణాకు ఇస్తున్న వే బిల్లులు


కొల్లిపర: బొమ్మువానిపాలెం ఇసుక రీచ్‌లో కలెక్టర్ తనిఖీల అనంతరం యథాతథంగా కొనసాగుతున్న ఇసుక లోడింగ్

అంతా రహస్యమే.. ఎవరికోసం!

ఇసుక రీచ్‌లలో అక్రమాలు జరుగుతున్నాయని, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందంటూ పదేపదే ఎన్జీటీని స్థానికులు ఆశ్రయిస్తుండటం, ఎన్జీటీ ఆదేశాలు జారీచేసి అధికారులను అమలు జరపమని చెప్పటం ప్రతిసారీ జరగుతూనే ఉన్నాయి. అయితే ఈసారి ఎన్జీటీ మరో అడుగు ముందుకువేసి ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయా జిల్లాల పాలనాధికారులను ఆదేశించింది. దీంతో కలెక్టర్‌లు రీచ్‌ల తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే పల్నాడు కలెక్టర్ రీచ్‌లను పరిశీస్తే, బుధవారం గుంటూరు, బా పట్ల కలెక్టర్లు ప్రకాశం బ్యారేజికి దిగువునున్న కృష్ణా తీరంలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. బాపట్ల కలెక్టర్ కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అయితే అక్కడ తవ్వకాలు చాలాకాలం క్రితం ఆపేశారు. ప్రస్తుతంగాజుల్లంక, పెదలంక దగ్గర ఇసుక, చిలుమూరులో బుసక తవ్వకాల పేరుతో నిత్యం తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇవి కూడా రెండ్రోజులుగా ఆపారు. జువ్వలపాలెం రీచ్‌ను ఒడ్డునుంచే చూడాల్సి వచ్చింది. ఎందుకంటే నది ఒడ్డువెంట నీటిపాయ ప్రవహిస్తోంది. అటువంటిచోట తవ్వకాలుఎట్లా జరుపుతారనే ఆలోచన కూడా చేయకుండా సిబ్బంది కలెక్టర్‌ల బృందాన్ని తప్పుదారి పట్టించారని ఆరోపిస్తున్నారు. కొల్లూరు మండలం పెదలంక దగ్గర ఇసుక అనుమతి లేకుండా తవ్వుతున్నారని, మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, దయచేసి మీరైనా పెదలంక వచ్చి పరిశీలించాలని రైతు సంఘం నాయకుడు సురేష్ కలెక్టర్‌ను అభ్యర్థించారు.

రాజధానిలో ఇష్టారాజ్యం..

తుళ్లూరు మండ లంలోని పలు ఇసుక రీచ్‌లు ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్ పరిధిలో ఉన్నాయి. దీని దృష్ట్యా అక్కడ ఇసుక తవ్వకాలను గతంలోనే ఎన్‌జీటీ నిషేధించింది. అయినప్పటికీ అధికార వైసీపీ నేతలు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారుల అండదండలతో చెలరేగిపోతున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ అందినకాడికి వెనకేసుకొంటున్నారు. ఇసుక రీచ్‌లను కొంతమంది నేతలకు అప్పగించి వారి ద్వారా తాడేపల్లి ఆఫీసుకు పెద్దమొత్తంలో నగదు చేరేలా ఒక వ్యవస్థని రూపొందించుకొన్నారని గత కొన్ని నెలలుగా ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. తాడేపల్లిలో ఇసుక రీచ్‌లు అయితే కృష్ణా జిల్లా వైసీపీకి చెందిన ఒక యువ నాయకుడికి కేటాయించారు. అలానే దుగ్గిరాల, కొల్లిపరలోనూ అధికార వైసీపీ నేతలదే పెత్తనమంతా. గతంలో మైనింగ్, పోలీసు, రవాణ శాఖ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహించి ఇసుక లారీలు, యంత్రాలను సీజ్ చేసేవారు. గత కొన్ని నెలల నుంచి ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడి మైనింగ్ శాఖకు సంబంధం లేకుండా అంతా విజయవాడ రాష్ట్ర కార్యాలయం కనుసన్నల్లోనే ఇసుక రీచ్‌ల కాంట్రాక్టుల వ్యవహారం నడుస్తోంది. గత వారం జనసేన నేత వల్లభనేని బాలశౌరి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టారు. త్వరలోనే ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలు వచ్చే అవకాశం ఉందని, అధికారులు పీకల్లోతు కూరుకుపోయారు, ఇకపై తప్పు చేయొద్దని హితవు పలికారు. అయితే అధికారులు పెడచెవిన పెట్టారు. ఇప్పుడు ఎన్‌జీటీ నుంచి ఆదేశాలు రావడంతో ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.


రాష్ట్రంలో అరాచక పాలన

- ప్రజల్లో నమ్మకం కోల్పోయిన జగన్
- ఎమ్మెల్యే సాంబశివరావు
- 17న చంద్రబాబు సభను విజయవంతం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లో నమ్మకం కోల్పోయారని అన్నారు. ఇంకొల్లులో ఈనెల 17న జరిగే రా కదిలిరా సభకు బాపట్ల పార్లమెంట్‌లోని ప్రతి నియోజకవర్గం నుంచి కార్యకర్తలు తరలివచ్చి ఇంకొల్లు సభ చరిత్ర సృష్టించాలని పిలుపునిచ్చారు. బుధవారం ఇంకొల్లులో తారకరామా విజయభేరి ప్రాంగణంలో పార్టీ ప్రముఖ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో టీడీపీ భారీ విజయం సాధించాలనే ధ్యేయంతో ఈ ప్రాంగణానికి తారకరామ విజయభేరిగా నామకరణం చేశామన్నారు. నేమ్ బోర్డుల్లో మాత్రమే నమ్మకం ఉంది తప్పా జగన్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందని చెప్పారు. గత ఎన్నికల్లో జగన్‌పై నమ్మకంతో 151 సీట్లు గెలిపిస్తే, ఈ నాలుగు సంవత్సరాలు అధికార అహంతో అరాచక పాలన సాగించారని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు తప్పు తెలుసుకొని ఆ పార్టీని వీడతున్నారన్నారు. లక్ష మంది సభకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. 17వ తేదిన మధ్యాహ్నం 1.30కు సభా ప్రాంగణానికి చంద్రబాబు చేరుకుంటారని ఏలూరి తెలిపారు. 4 గంటల వరకు సభ జరుగుతుందన్నారు. గ్రామస్థాయిలో సమావేశాలు వేసుకొని అధిక సంఖ్యలో సభకు తరలివచ్చేలా నాయకులు సమన్వయం చేసుకోవాలని చెప్పారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు రా కదిలిరా సభను పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. భూమి పూజలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేంద్రవర్మ, ఎం.అమరరావు, పిల్లి మాణిక్యరావు, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పర్చూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సభ నిర్వహణ ఏర్పాట్లు

ఇంకొల్లు, ఫిబ్రవరి 14: ఇంకొల్లులో ఈనెల 17న జరగనున్న రా కదిలిరా సభ నిర్వాహణ పనులు శరవేగవంతంగా జరుగుతున్నాయి. ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్లు తొలగిస్తున్నారు. సుమారు 20 ఎకరాల్లో సభ జరిగే ప్రాంతాన్ని చదును చేశారు. హెలిప్యాడ్ ప్రాంతాన్ని చీరాల డీఎస్పీ ప్రసాదరావు, ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు పరిశీలించారు.


ప్రాంగణంలో మాట్లాడుతున్న ఏలూరి

సీట్ల.. డైలమా!

- సీఎంవో బాట పట్టిన ఎంపీ మోపిదేవి, ఆమంచి
- రేపల్లె సీటు విషయంలో తర్జనభర్జన

బాపట్ల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): పాలకపార్టీలో సీట్ల తకరారు నడుస్తూనే ఉంది. సీఎంవో నుంచి జిల్లా నేతలకు పిలుపుల పర్వం కొనసాగుతూనే ఉంది. బుధవారం ఎంపీ మోపిదేవితో పాటు పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌లు తాడేపల్లి పెద్దలతో సమావేశమైనట్లు సమాచారం. రేపల్లె సీటు తనకే కేటాయించాలని ఎంపీ పట్టుబట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ చేపట్టిన ఇన్‌చార్జి మార్పుల్లో భాగంగా రేపల్లెకు డాక్టర్ ఈవూరు గణేష్‌ను సమన్వయకర్తగా అధిష్ఠానం నియమించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం తీసుకుని ఇప్పటికే మూడునెలల గడిచింది. అయినప్పటికీ ఇంకా ఆ సీటుకు సంబంధించి పంచాయితీ నడుస్తూనే ఉంది. గణేష్ విషయంలో వైసీపీ పెద్దలు పునరాలోచనలో పడ్డారనే ప్రచారం గత కొన్ని రోజులుగా జరుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అధిష్ఠానంతో సమావేశ మవడం చర్చనీయాంశమయింది.

ఆమంచి కృష్ణమోహన్ సైతం..

పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా యడం బాలాజీకి వైసీపీ అవకాశం ఇవ్వనుందనే ప్రచారం నేపథ్యంలో ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న కృష్ణమోహన్ సైతం తాడేపల్లి పెద్దలతో బుధవారం సమావేశమయ్యారని తెలుస్తోంది. ఇన్‌చార్జిల విషయంలో మరింత స్పష్టత ఇచ్చే క్రమంలోనే వీరిద్దరితో పార్టీ పెద్దలు చర్చలు జరిపారని సమాచారం.

ఖాకీలకు.. మరకలు!

- కోర్టు అక్షింతలేస్తున్నా ఏకపక్ష సేవలేనా!
- విమర్శలకు తావిస్తున్న జిల్లా పోలీసుల వైఖరి
- 41ఏ నిబంధనలను కోర్టు గుర్తు చేయాలా..!
- నిష్పక్షపాత వైఖరి ఎందుకు తీసుకోలేకపోతున్నారు..



బాపట్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సెక్షన్లు.... అరెస్టులు.. విచారణలు ఇలాంటి ప్రక్రియ అంతా పోలీసులకు కొట్టిన పిండి. ఎక్కడ ఏ నిబంధనలు పాటించాలో కూడా వారికి క్షుణ్ణంగా తెలుసు.. కాకపోతే వాటిని అమలు చేయడంలోనే అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మార్టూరులో జరిగిన గ్రానైట్ ఫ్యాక్టరీల సోదాల వ్యవహారంలో నమోదు చేసిన కేసుల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారన్న అపవాదును మూటగట్టుకున్నారు. దీనిని బలపరిచే విధంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలో హైకోర్టు 41ఏ నిబంధనలు పాటించడంపై కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ప్రక్రియ పాటించని పోలీసులను జైలుకు పంపించేలా ఆదేశాలిస్తామనే తీవ్ర వ్యాఖ్యలు సైతం పిటిషన్ విచారణ సమయంలో కోర్టు చేసిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

*** మొత్తం 8 మందిపై కేసు..**

గడచిన నెల 30న మార్టూరులోని గ్రానైట్ ఫ్యాక్టరీల సోదాలకు సంబంధించి తలెత్తిన వివాదంలో పోలీసులు ఏకపక్షంగా 8 మందిపై కేసు నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఫ్యాక్టరీ యజమానులు ఇచ్చిన ఫిర్యాదును బుట్టదాఖలు చేయడమే కాకుండా వారిని రాత్రికి రాత్రే అరెస్టు చేసిన తీరు ఖాకీల ఏకపక్ష వైఖరికి నిదర్శనంగా కనబడిందని ప్రజలు అంటున్నారు.

*** ఎమ్మెల్యే ఏలూరి హైకోర్టు గడపతొక్కగా..**

పోలీసులు కేసు నమోదు చేసిన 8 మందిలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కూడా ఉండడంతో ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టులో వేసిన సంగతి తెలిసిందే. ఆ పిటిషన్ విచారణలో భాగంగా హైకోర్టు పోలీసుల వైఖరిని తప్పు బట్టింది. ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న కేసుల్లో సెక్షన్ 41ఏ నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాల్సి ఉండగా నేరుగా అరెస్టుల పర్వానికి ఎందుకు వెళుతున్నారని కొం చెం ఘాటుగానే వ్యాఖ్యానించింది. దీంతో ఎమ్మెల్యే ఏలూరికి మార్టూరు పోలీసులు మంగళవారం 41ఏ నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలని కోరారు.

*** కోర్టు చెప్పాల్సిందేనా...**

సహజంగా చట్టప్రకారం జరగాల్సిన ప్రక్రియ లో కూడా కోర్టు ఆదేశాలిచ్చాకే జిల్లా పోలీసులకు నిబంధనలు గుర్తుకు రావడం విచారకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదే కేసుల్లో గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులను ఆగమేఘాల మీద అరెస్టు చేసి కోర్టు ముందు హాజరుపర్చిన తీరు ఎవరి మెప్పుకోసమనే చర్చ నడుస్తోంది. హైకోర్టు వ్యాఖ్యల ప్రకారం చూస్తే వారికి కూడా 41ఏ నోటీసులు ఇచ్చి విచారణకు పిలవాలని తర్వాతే అరెస్టుపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుందని తేటతెల్లమైంది. కానీ రూల్ ఆఫ్ లాను పక్కనబెట్టి ఖాకీలు వ్యవహరించిన తీరు సదరు విభాగానికి శోభనివ్వదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ప్రజలు హితవు చెబుతున్నారు.

చాలా అంశాల్లో ఇదే తీరున..

మార్టూరు ఘటనే కాదు చాలా అంశాల్లో పోలీసుల ఏకపక్ష తీరు విస్మయానికి గురిచేస్తోంది. నిరసనలు, ధర్నాలు లాంటి ప్రజాస్వామ్య హక్కులను కూడా ఇటీవల కాలంలో పోలీసులు కాలరాస్తున్నారు. గడచిన ఆరునెలల వ్యవధిలో దాదాపు వెయ్యి మందికిపైనే నిరసన, ధర్నాలు లాంటి కారణాలతో కేసులు నమోదు చేయడం గమనార్హం. దాదాపు అన్ని కేసుల్లో కూడా బాధితులు ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తప్పుబట్టి రోడ్డుమీదకు వచ్చిన వారే కావడం ఖాకీల దమననీతికి అద్దం పడుతోంది.

*** ఎన్నికల టైంలో కూడా ఇలానే ఉంటే..**

ఈ నాలుగున్నరేళ్ల వ్యవధిలో ఏవో ఒకటి రెండు సందర్భాల్లో మినహాయిస్తే పాలకపార్టీ సేవలో పోలీసులు తరించారన్నది కాదనలేని వాస్తవం. సమీప దూరంలో ఎన్నికలు జరగనుండడంతో ఖాకీల తీరు ఇలానే ఉంటే అధికారపార్టీకి కొమ్ముకాసే అరాచకశక్తులు రెచ్చిపోయే ప్రమాదముందనే భయాన్ని విపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోగలరా అనే అనుమానాలు సైతం ముసురుకుంటున్నాయి. ప్రతిసారీ కోర్టులు జోక్యం చేసుకుని బాధితులకు అండగా ఉండడం కుదరకపోవచ్చని పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం ఒక్కటే మార్గం అనే అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.


ఎమ్మెల్యే ఏలూరికి మంగళవారం 41ఏ నోటీసులు అందిస్తున్న పోలీసులు


రిమ్స్ వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగులు ఆందోళన బాట

జిల్లావ్యాప్తంగా నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 14: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు మరొసారి రోడ్డెక్కారు. ప్రభుత్వం దృష్టికి అనేక పర్యాయాలు తీసుకెళ్లిన పట్టించుకోకపోవడంతో రాష్ట్ర జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా జేఏసీ చైర్మన్ కూచిపూడి శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు ఎక్కడికక్కడ నల్లబ్యాడ్జిలు ధరించి నిరసనలు తెలిపారు. బుధవారం నుంచి ఈనెల 27వతేదీ వరకు దశల వారీగా ఆందోళనలకు జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జిలు ధరించి విధులకు హాజరయ్యారు. తమ తమ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపట్టారు. ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ అరియర్స్, ఎస్ఈఎల్, పీఆర్సీ అరియర్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని, 12వ పీఆర్సీని ప్రకటించాలని, ఐఆర్‌ను విడుదల చేయాలని, ఉద్యోగులపై వత్తిడిని తగ్గించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. గురు, శుక్రవారాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు, ధర్నాలు, 17న తాలూకా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు, 20న కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటి కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టాల్సి వస్తోందని జేఏసీ జిల్లా చైర్మన్ శరత్‌బాబు హెచ్చరించారు.

మంత్రి నాగార్జున ఇంటి ముట్టడి

- దగా కాదు.. మెగా డీఎస్సీ కావాలి
- యువజన కాంగ్రెస్ నాయకుల డిమాండ్


ఆందోళనకు దిగిన యువజన కాంగ్రెస్ నాయకులు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 14: దగా కాదు మెగా డీఎస్సీ కావాలంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ఇంటిని నిరుద్యోగులు బుధవారం ముట్టడించారు. స్థానిక పాత బైపాస్ రోడ్డులోని బులెట్ షోరూం సమీపంలో గల మంత్రి ఇంటిని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి బీఆర్‌గౌస్ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతోపాటు, నిరుద్యోగులు కొంతమంది కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా అక్కడే బైఠాయించి నినాదాలు చేయడంతో మంత్రి నాగార్జున ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. యువత సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాట్లాడారు. అంతేకాకుండా ఈ విషయం సీఎం స్థాయిలో ఉందని, ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని తెలిపారు. అయితే మెగా డీఎస్సీపై మంత్రి సమాధానం చెప్పాలని అందరూ డిమాండ్ చేయడంతో సమాధానం చెప్పకుండా వెనుదిరిగారు. ఇదే సమయంలో ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని అందరినీ పంపించి వేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రవి, నాయకులు బండి కిషోర్, కోవ్వుల సాయి, రాయిపాటి గిడియాన్, దంద్రుప్రోలు ప్రసాద్, గుత్తి రాజు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం

- కుప్పకూలిన వంతెన
- రెండేళ్లుగా సాగర్ కెనాల్‌పై నిర్మాణానికి నోచుకోని వారధి
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- కర్రలు కట్టుకొని రాకపోకలు


రెండేళ్ల కిందట సాగర్ కాలువపై కూలిన వంతెన

దొనకొండ, ఫిబ్రవరి 14 : సాగర్ కెనాల్‌పై ప్రజలు అటు ఇటు రాకపోకలు జరుపుకునేందుకు నిర్మించిన వంతెన రెండేళ్ల క్రితం ఆకస్మాత్తుగా రాత్రి సమయం లో కుప్ప కూలింది. ప్రజలకు ఎంతో ప్రాముఖ్యమైన ఈ వంతెన నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ప్రజలు రాకపోకలు జరుపుకునేందు కు రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చందవరం, దేశిరెడ్డిపల్లి గ్రామ ప్రజలకు చెందిన దా దాపు 300 ఎకరాల వ్యవసాయ భూమి సాగర్‌కాలువకు అ వతలివైపున ఉన్నందున్న రాకపోకల నిమిత్తం అప్పట్లో కెనాల్‌పై వారధి నిర్మాణం చేపట్టారు. 2022 ఫి బ్రవరిలో రాత్రి సమయంలో వంతెన ఒక్కసారిగా కా లువలోకి కుప్పకూలింది. దీంతో ఆయా గ్రామాలకు చెందిన రైతులు, పశుపోషకులు అటు-ఇటు రాకపోక లు జరుపుకునేందుకు రెండేళ్లుగా పడుతున్న ఇ బ్బందులు అన్నీఇన్నీకావు. వంతెన నిర్మాణం గూర్చి అధికారులకు, పాలకులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా రెండేళ్లుగా పట్టించుకున్న వారే లేరని ప్రజ లు విమర్శిస్తున్నారు. ప్రతిరోజూ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, రైతు కూలీలు చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లలేక కూలిన వంతెనపై నడిచి వెళ్లేందుకు నిచ్చెనలా కర్రలను ఏర్పాటు చేసుకొని ప్రమాదకర పరిస్థితు ల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఆ సమయంలో ఒకరిద్దరు అదుపుతప్పి కా లువలో పడిన సంఘటనలు చో టు చేసుకున్నాయి. ప శుపోషకులు తప్పనిసరై పశువుల ను మూడు కిలోమీటర్లు నడిపిస్తూ మరో వంతెన మీ దుగా ప్రతిరోజూ రాకపోకలు చేస్తున్నారు. సాగర్ కా లువలో నీరు సం వృద్ధిగా ప్రవహిస్తున్న సమయంలో కూలిన వంతెన పైనుంచే రాకపోకలు సాగించేందుకు కుదరకపోవడంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గేవర కు తప్పనిసరిగా చుట్టూ మూడు కిలోమీటర్లు నడిచి వెళ్లడం త ప్పనిసరి. ప్రజలకు ఎంతో అవసరమైన సా గర్ కాలువపై వంతెన నిర్మాణంపై వైసీపీ పాలకులు, అధికారు లు రెండేళ్లుగా నిర్లక్ష్యం చూపారని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన నిర్మాణం ఎప్పు డు జరుగుతుందో ఇబ్బందులు ఎ ప్పుడు తొలగుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

బల్లికురవ. ఫిబ్రవరి 14: త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి నారా యణరావు కోరారు. బుధవారం మండలంలోని గుంటుపల్లి గ్రామం వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసం దర్భంగా ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. విద్య ఎలా అందుతుంది, వసతి గృహంలో భోజనం ఎలా పెడుతున్నారని వారిని అడిగి తెలుసుకొన్నారు. రానున్న రెండు మాసాలు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థినులను గుర్తించి ప్రత్యేక క్లాసులు నిర్వ హించాలన్నారు. అనంతరం బల్లికురవ ఎంఈవో కార్యాలయాన్ని, ఉన్నత పాఠశా లను డీఈవో సందర్శించారు. ఈసందర్భంగా జిల్లా స్థాయిలో సైన్స్ ఫెయిర్‌కు ఎం పికైన విద్యార్థిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్ బాబు, కేజీబీవో ప్రిన్సిపాల్ సరళకుమారి పాల్గొన్నారు.

పొమ్మనకుండా పొగబెట్టారు..!

- త్వరలో టీడీపీలోకి మాగుంట?
- మర్యాదగా కూడా కలవని చెవిరెడ్డి
- పోటీకి సిద్ధమైన కుమారుడు రాఘవరెడ్డి



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి గత ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలుపొందిన మాగుంట రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించకపోయినా గట్టిగా నిలబడ్డారు. వ్యాపారపరంగా, రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వైసీపీలోనే ఉంటూ ముందుకు సాగారు. ఏ సందర్భంలోను అసంతృప్తిని కానీ జగన్‌పై అయిష్టతను కానీ వ్యక్తం చేయలేదు. అయితే గత ఆరునెలల నుంచి వైసీపీ అధిష్ఠానం ముఖ్యంగా జగన్మోహనరెడ్డి మాగుంటను దగ్గరకు రానివ్వటం లేదు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఆయన చిక్కుకున్నా మర్యాదపూర్వకంగా కూడా ఏం జరిగిందని తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదు. అయినా అభ్యర్థుల ఎంపిక సందర్భంగా తిరిగి వైసీపీ నుంచి పోటీ చేసేందుకు తన వంతు ప్రయత్నం చేశారు. టికెట్ కావాలంటే చెప్పినట్లు చేయాలని మాగుంట మనస్తత్వానికి విరుద్ధమైన షరతులను సీఎం విధించారు. వాటిని అమలు చేయలేదనే సాకుతో దూరంగా ఉంచారు. ఆయన తరపున మాట్లాడేందుకు ప్రయత్నించిన విజయసాయిరెడ్డి, బాలినేనిలను సీఎం ఏమాత్రం పట్టించుకోలేదు. పైగా తన షరతులు అమలుచేయని వ్యక్తి తన ఇంటి గడప కూడా తొక్కటానికి వీల్లేదంటూ సాయిరెడ్డి ద్వారా సంకేతం పంపారు. పైగా ఒంగోలు లోక్‌సభకు ప్రత్యామ్నాయ అభ్యర్థిని రంగంలోకి తెచ్చే ప్రయత్నాలకు శ్రీకారం పలికారు.

అవమానాలతో విసిగిపోయి..

సహనానికి, అందరినీ గౌరవించాలనే మనస్తత్వానికి మారుపేరైన మాగుంట చివరి ప్రయత్నంగా జగన్‌ను కలిసేందుకు విఫలయత్నం చేశారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన జగన్‌కు పార్లమెంట్‌లో నేరుగా ఎదురేగి రెండు చేతులు జోడించి నమస్కరించారు. మర్యాద కోసమైనా మాగుంటను ఆయన పలకరించకపోగా తలతిప్పుకుని వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో మాగుంట అభిమానులు కుటుంబీకుల నుంచి మాగుంటపై ఇంకా ఎదురుచూపులు అనవసరమన్న అభిప్రాయాన్ని తెలియజేసినట్లు తెలిసింది. మరోవైపు గతంలో ఉన్న సంబంధాలతో మాగుంటను చేరదీసుకునేందుకు టీడీపీ నుంచి సంకేతాలు ఆయనకు అందాయి. అంతేగాక మాగుంట వ్యాపారపరంగా రాష్ట్రప్రభుత్వం నుంచి ఇబ్బందులు ఎదురైనప్పుడు అలాగే కేసులతో ఇబ్బందిపడుతున్నప్పుడు తెలుగుదేశం పార్టీ చెందిన ముఖ్య నేతల నుంచి పలకరింపు లభించినట్లు తెలిసింది. పార్టీ ముఖ్యనేతతో పాటు కిందిస్థాయిలోని టీడీపీ శ్రేణులు కూడా గతంలో ఉన్న పరిచయంతో ఆయన సమాచారం తెలుసుకుని ఓదార్చేందుకు ప్రయత్నించారు. సొంత పార్టీ నుంచి కనీస పలకరింపులు కూడా లేకపోయినా విపక్ష టీడీపీ నేతలు, శ్రేణుల నుంచి లభించిన ఆదరణ ఆయన కుటుంబసభ్యులలో వారిపట్ల అభిమానానికి కారణమైంది.

> పరోక్షంగా టికెట్ లేదని వైసీపీ అధిష్ఠానం సంకేతాలిచ్చినా ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి చివరికంటా వేచి ఉన్నారు. చివరిగా ఢిల్లీ వెళ్లిన సీఎం జగన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఎదురేగినా పట్టించుకోలేదు. చివరికి జిల్లా, నియోజకవర్గ స్థాయి అధికారులు కూడా కలిసేందుకు జంకుతున్నారు. దీంతో ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి రంగంలో నిలిచేందుకు మాగుంట వ్యూహాత్మకంగా అడుగులేస్తున్నారు. ఆ మేరకు టీడీపీ నుంచి ఆయనకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు కూడా తెలుస్తోంది. మరోవైపు ఈసారి ఎన్నికల సమరంలోకి ఆయన కుమారుడు రాఘవరెడ్డిని దింపేందుకు మాగుంట కుటుంబం కూడా సిద్ధమైనట్లు సమాచారం. తదనుగుణంగా బుధవారం ఒంగోలు వచ్చిన మాగుంట తన సన్నిహితులకు సంకేతం కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఒంగోలు వచ్చినా కలవలేదు

మరోవైపు వైసీపీ అధినేత ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి పేరును ఖరారు చేశారు. అంతేగాక ఆయనను వ్యతిరేకిస్తున్న బాలినేనికి సర్దిచెప్పుకున్నారు. ఇదే సమయంలో ఒంగోలు వచ్చిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసేందుకు కూడా వైసీపీ నాయకులు ప్రయత్నించటం లేదు. పైగా ఆయన్ను కలిస్తే ఏమవుతుందో అన్న చందంగా నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు కొందరు వ్యవహరించారు. బుధవారం ఒంగోలు వచ్చిన చెవిరెడ్డి రెండురోజుల క్రితం జగన్‌తో అన్ని విషయాలు మాట్లాడుకుని ఒంగోలులో పోటీచేసేందుకు సిద్ధమైన ఎమ్మెల్యే బాలినేని కూడా ఆయన్ను కలవలేదు. పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా తొలిసారి ఒంగోలు వచ్చిన చెవిరెడ్డి ఒంగోలులోనే ఉండి తనకు సుపరిచితుడైన సొంత పార్టీ ఎంపీ మాగుంటను కలవకపోగా ఆయన ఒంగోలు వస్తున్న సమాచారాన్ని కూడా ఇవ్వలేదు. తద్వారా వైసీపీ అధిష్ఠానం ఎత్తుగడ తేటతెల్లమైంది.

ఒంగోలులోనే ఉండాలి, రాజకీయాల్లో కొనసాగాలి

ఈ మొత్తం క్రమంలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసిన మాగుంట కుటుంబీకులు ఇటీవల సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించుకున్నట్లు తెలిసింది. గత 35 ఏళ్లుగా రాజకీయంలో ఉన్న తమ కుటుంబం మున్ముందు కూడా రాజకీయంలోనే కొనసాగాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఒంగోలు లోక్‌సభను వీడకూడదని, అక్కడి నుంచే పోటీచేయాలని, యువకుడైన శ్రీనివాసరెడ్డి కుమారుడు రాఘవరెడ్డిని రంగంలోకి దింపాలని కుటుంబసభ్యులంతా అభిప్రాయపడినట్లు తెలిసింది. అంతేగాక కాదు పొమ్మంటున్న జగన్ దయాదాక్షిణ్యాల కోసం ప్రాధేయపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించుకోవాలని శ్రీనివాసరెడ్డికి కుటుంబసభ్యులు కూడా సూచించినట్లు సమాచారం. ఇదే సమయంలో గతంలో ఉన్న పరిచయాలు తనకిచ్చిన ఆహ్వానపు సంకేతాలను దృష్టిలో ఉంచుకుని మాగుంట టీడీపీ అధినేతకు టచ్‌లోకి వెళ్లినట్లు తెలిసింది. తన సన్నిహితుడైన నెల్లూరుకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి ఆయన టీడీపీ నేతలకు టచ్‌లోకి వెళ్లినట్లు చెబుతున్నారు. తొలుత ఒంగోలు లేదా నెల్లూరు అవసరమైతే రెండుచోట్లా తండ్రీ కొడుకులకు అవకాశం ఇస్తామని చెప్పిన టీడీపీ నేతలు వేమిరెడ్డి రానుండటంతో ఆయనకు నెల్లూరు లోక్‌సభ స్థానాన్ని కేటాయించి ఒంగోలు లోక్‌సభకు పోటీచేయమని మాగుంటకు సూచించినట్లు సమాచారం. అయితే ముందు నుంచి అనుకుంటున్నట్లు ఆయన కుమారుడు రాఘవరెడ్డిని ఒంగోలు లోక్‌సభ నుంచి బరిలో నిలపాలని మాగుంట భావిస్తున్నట్లు తెలిసింది.

అభిమానులు, సన్నిహితులతో చర్చలు

బుధవారం ఒంగోలు వచ్చిన మాగుంటను ఆయన అభిమానులు, సన్నిహితులు, అనుచరులు కలిశారు. రాజకీయాలకు దూరంగా ఉండే ఆయా వర్గాల ప్రముఖులతో పాటు అధికారులు కూడా కలిశారు. మాగుంట కూడా వివిధ కార్యక్రమాల పేరుతో వైసీపీలోను అలాగే రాజకీయంగా తటస్థంగా ఉండే కొందరు ఇళ్లకెళ్లి వాళ్లను పలకరించి వచ్చారు. ఆ సందర్భంగా వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నట్లు తెలిసింది. ఈ సందర్భంలో ఆయన తాము ఒంగోలు లోక్‌సభ నుంచి బయటకు పోవటం లేదని, తన కుమారుడు పోటీ చేస్తారని స్పష్టంగా చెప్పినట్లు కూడా సమాచారం. ఇప్పటికే ఆయన టీడీపీలో చేరతారన్న వార్తలను ఖండించలేదు. పైగా కేంద్రంలో బీజేపీ పెద్దలతో కూడా టచ్‌లో ఉన్నారు. దీంతో ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఎన్నికల అవగాహన కుదిరినట్లు వార్తలొస్తున్నాయి. దీంతో మాగుంట కుమారుడు రాఘవరెడ్డి ఒంగోలు లోక్‌సభకు ఆ కూటమి అభ్యర్థిగా రంగంలోకి రావటం ఖాయమన్న భావన ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. ఈ అభిప్రాయం వ్యక్తంచేసిన సన్నిహితులకు మాగుంట నుంచి నవ్వే ఎదురైంది తప్ప కాదు కూడదన్న సమాధానం రాకపోవటం విశేషం.

కీలకంగా మారిన బాబు సభ

- తాజా పరిణామాలలో అందరి దృష్టి ఆవైపే
- కదలిరా అన్న పిలుపుతో కదులుతున్న జనం
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న టీడీపీ నాయకులు
- ఏలూరి క్యాంప్ ఆఫీసులో నేతల సమావేశం



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో శనివారం పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరగనున్న తెలుగుదేశం పార్టీ బహిరంగ సభపై అందరూ దృష్టిసారించారు. టీడీపీ శ్రేణులకు తోడు రాజకీయ వర్గాలు ప్రత్యేకించి వైసీపీ నాయకత్వం ఆ వైపు ప్రత్యేక దృష్టిసారించటం విశేషం. అందుకు ప్రత్యేక కారణం కూడా లేకపోలేదు. పర్చూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి పోటీ చేసేందుకు ఆ పార్టీ ఆశించిన సామర్థ్యం కల అభ్యర్థులు ముందుకురావడం లేదు. జగన్ ఏరికోరి ఇన్‌చార్జిగా నియమించిన చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి అందినకాడికి దండుకుని చివర్లో పలాయనం చిత్తగించారు. చివరికి కాపు సామాజికవర్గం నుంచి అనేక మంది నాయకులను జగన్ పిలిపించుకుని మాట్లాడినా పర్చూరులో ఎవరూ పోటీకి సిద్ధం కావడం లేదు. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో పార్టీ నుంచి కాదు పొమ్మని బయటకు నెట్టిన చీరాలకు చెందిన యడం బాలాజీ వైపు జగన్ దృష్టిసారించారు. అమెరికాలో ఉన్న బాలాజీని పర్చూరు నుంచి రంగంలోకి దింపే ఉద్దేశంతో జగన్ పిలిపించుకుంటున్నారు. బుధవారం హడావుడిగా సీఎంఓకు వెళ్లిన ఆమంచితో కూడా అధిష్ఠానం ఈ విషయమై చర్చించినట్లు తెలిసింది. అమెరికా నుంచి వచ్చే బాలాజీ గతంలో కాదు పొమ్మని బయటకు పంపిన జగన్‌తో మళ్లీ జత కడతాడా లేదా? అనేది ఇంకా స్పష్టంకాలేదు. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు ఆయా లోక్‌సభ నియోజకవర్గాల వారీ నిర్వహిస్తున్న ఎన్నికల సన్నాహక బహిరంగ సభలను పర్చూరు నియోజకవర్గంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. తొలుత చీరాలలో జరపాలనుకున్న ఈ సభను మార్పుచేసి ఇంకొల్లులో జరపాలని నిర్ణయించారు. దీంతో ఈ సభ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టీడీపీకి ప్రత్యేకించి ఏలూరి సాంబశివరావుకు మంచి పట్టుందని భావిస్తున్న నియోజకవర్గంలో ప్రజాస్పందనను గమనించేందుకు శనివారం జరిగే చంద్రబాబు సభ దర్పణం పడుతుందని భావిస్తున్నారు. దీనికితోడు టీడీపీ నేతలు కూడా సభను జయప్రదం చేయటం కోసం ఛాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నారు. బుధవారం ఇంకొల్లులో సభావేదిక నిర్మాణానికి ఏలూరి భూమిపూజ చేశారు.

కదులుతున్న కేడర్

ఇప్పటికే బాపట్ల లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో శనివారం ఇంకొల్లులో జరిగే రా.. కదలిరా సభకు తరలిరావాలని టీడీపీ నేతలు ప్రచారాన్ని ప్రారంభించారు. పర్చూరు నియోజకవర్గంలో అయితే గ్రామగ్రామాన ప్రజలందరికీ సమాచారాన్ని చేరవేశారు. బుధవారం ఉదయం మార్టూరులోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయా నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు సమావేశమయ్యారు. ఏలూరితో పాటు అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ మంత్రి ఆనంద్‌బాబు, బాపట్ల, ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జిలు వర్మ, బీఎన్.విజయ్‌కుమార్, చీరాల ఇన్‌చార్జి కొండయ్య తనయుడు ఆ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణ తీరుతెన్ను, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆ తర్వాత ఎమ్మెల్యేలు ఏలూరి, గొట్టిపాటి, కనిగిరి ఇన్‌చార్జి ఉగ్రనరసింహారెడ్డి, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తదితరులు సమావేశమై ఆయా ప్రాంతాల వారీ పార్టీశ్రేణులు, సామాన్య ప్రజల సమీకరణపై చర్చించి కార్యాచరణ రూపొందించారు. అన్ని ప్రాంతాల్లోని ముఖ్య నాయకులతో మాట్లాడి సభకు ఎలా తరలిరావాలో వివరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సభా కార్యక్రమం ప్రారంభమవుతుంది. అక్కడే ఎమ్మెల్యే ఏలూరి సభకు వచ్చే వారందరికోసం భోజన ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు మధ్యాహ్నం 2 గంటలకల్లా అక్కడికి చేరతారు. వెంటనే ఆయన వేదికపైకి వచ్చి ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం మూడున్నరకల్లా సభ పూర్తవుతుంది. సభకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. తాజా రాజకీయ పరిణామాల్లో టీడీపీ పట్ల ప్రజలకు ఉన్న ఆదరణ, ఎమ్మెల్యే ఏలూరి పట్ల ఉన్న అభిమానాన్ని చాటాలన్న ఉద్దేశంతో అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు కదులుతున్న తీరు కనిపిస్తోంది. ప్రస్తుత పరిస్థితిని బట్టి అంచనా వేస్తే ఒక్క పర్చూరు నియోజకవర్గం నుంచే 50 వేల మంది సభకు తరలివస్తారని విశ్లేషకుల అంచనా.

జగనన్న ఇళ్ల స్థలాలపై హైడ్రామా



- హైకోర్టులో వైసీపీ నేత పిల్
- శుక్రవారం విచారణకు వచ్చే అవకాశం
- కలెక్టర్, ఎమ్మెల్యేతోపాటు మరికొందరు ప్రతివాదులుగా దాఖలు
- అర్హులకు ఇవ్వడం లేదంటూ ఆరోపణ

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 14 : వైసీపీ ప్రభుత్వం పథకాల్లో భాగమైన నవరత్నాలలో ఒకటైన పేదలకు జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ వ్యవహారంపై హైడ్రామా నడుస్తోంది. ఆ స్థలాలు అర్హులకు ఇవ్వడం లేదంటూ అధికారపార్టీకి చెందిన నాయకుడే హైకోర్టులో పిల్ వేశారు. దీని వెనుక అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ కీలక నేతలే కావాలని ఇదంతా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వివరాల్లోకి వెళితే.. ఒంగోలు నగర పరిధిలో 25వేల మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ కోసం ప్రభుత్వం ఒంగోలు సమీప మల్లేశ్వరపురం, ఎన్.అగ్రహారం, వెంగముక్కలపాలెం, యరజర్ల గ్రామాల్లో సుమారు 435 ఎకరాలను 270 మంది రైతుల నుంచి కొనుగోలు చేసింది. అంతేకాకుండా ఈ నెలలోనే పేదలకు పట్టాలను పంపిణీ చేయాలని వైసీపీ నేతలు నిర్ణయించారు. పనుల్లో జాప్యం జరిగితే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందన్న భావనలో రైతుల ఖాతాలోకి డబ్బులు జమచేయడంతోపాటు, ఆయా స్థలాల్లో లేఅవుట్ పనులు వేగవంతం చేశారు. జంగిల్ క్లియరెన్స్, క్వారీ రబ్బీష్ రోడ్లు, అలాగే హద్దురాళ్ల తదితరాలు కలిపి మొత్తంగా 12 రకాల పనులు చేపట్టారు. ఇటీవల కాలంలో ఎమ్మెల్యే బాలినేని ఆయా స్థలాలను పరిశీలించడమే కాకుండా ఈనెల 21వ తేదీ నుంచి 27వ తేదీలోపు సీఎం చేతులమీదుగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, పట్టాల పంపిణీకి గుర్తించిన వారిలో అర్హులకు అన్యాయం జరిగిందంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, అందరికీ కుల, దామాషా ప్రకారం పట్టాలు అందించాలని వైసీపీ నాయకుడు శింగరాజు మంగళవారం డబ్ల్యూపీ/6146/2024, డబ్ల్యూపీ (పిల్) 6085/2024 నెంబరుతో హైకోర్టులో పిల్ వేశారు. దీంతో వైసీపీ నేతల పిటీషన్ స్వీకరించిన కోర్టు ఈనెల 16న శుక్రవారం దీనిపై విచారణ చేయనున్నట్లు సమాచారం. అయితే ఇప్పటి వరకు పట్టాల పంపిణీలో అడ్డంకులు ఎదురైతే అది టీడీపీ వారిదే బాధ్యత అని వైసీపీ నేతలు మొదటి నుంచి ఆరోపిస్తుండగా, ఈ పట్టాల వ్యవహారంలో అధికారపార్టీ నేతే పిల్ వేయడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

కలెక్టర్, ఎమ్మెల్యే ప్రతివాదులుగా..

ఇళ్ల పట్టాల పంపిణీలో పేదలకు న్యాయం చేయాలని శింగరాజు రాంబాబు 50పేజీలతో హైకోర్టుకు సమర్పించిన పిల్‌లో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి కలెక్టర్, ఎమ్మెల్యే, ఒంగోలు ఆర్డీఓ, ఒంగోలు తహసీల్దారు, నగర కమిషనర్‌తోపాటు రాష్ట్రప్రభుత్వం స్పెషల్ చీఫ్ సెక్రటరీ, భూసేకరణ చీఫ్ కమిషనర్, ఏపీ (ఎఫ్ఎంయు-రెవెన్యూ) ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అయితే పిటిషనరు తరపున ఎన్.రవిప్రసాద్ (6069) కోర్టులో పిల్ దాఖలు చేశారు.

రేపు విచారణ

ఇప్పటివరకు ఇళ్ల పట్టాల పంపిణీకి ఎలాంటి అడ్డంకులు లేవని, అలాగే మరో వారం పదిరోజుల్లో పేదలకు పట్టాలు చేతికందుతాయని భావించిన క్రమంలో హైకోర్టులో కేసు వేయడంపై ఇపుడు అధికారపార్టీలో చర్చ మొదలైంది. అయితే రెండు రోజుల గడువుతో పిల్‌పై తగిన వివరాలు వెల్లడించాలని హైకోర్టు ఆదేశించగా, ఈనెల 16న శుక్రవారం దీనిపై విచారణ జరగనుంది.

అర్హులైన పేదలకు న్యాయం కోసమే

తాను అధికారపార్టీ నేత అయినప్పటికీ, ప్రజాప్రయోజనం కోసమే కోర్టును ఆశ్రయించా. నగరంలో 25వేలమందికి పట్టాల పంపిణీ మంచి అంశమైనప్పటికీ అర్హులకు మాత్రం అన్యాయం జరుగుతుంది. నగరపరిధిలో 1.60లక్షల మంది ఓటర్లు ఉండగా, 67వేల డోరు నంబర్లు ఉన్నాయి. 3 లక్షలకుపైగా జనాభా ఉన్నారు. అయితే వీరిలో అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు. పేదలకు సొంతిల్లు లేక నేటికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఇళ్ల పట్టాల పంపిణీలో వైసీపీకి చెందిన వారు, వారి కుటుంబసభ్యులే అధికంగా ఉన్నారు. అందుకే పేదలకు న్యాయం జరిగేలా ప్రజా ప్రయోజనం కింద కోర్టును ఆశ్రయించా.

- శింగరాజు రాంబాబు, వైసీపీ నేత

మెప్మాలో రెండోరోజూ విచారణ

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 14 : మెప్మాలో చోటుచేసుకున్న రుణ కుంభకోణంపై ముగ్గురు జిల్లా అధికారులతో చేపట్టిన విచారణ బుధవారం కొనసాగింది. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ, సివిల్ సప్లయిస్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజరు మెప్మా కార్యాలయంలో సిబ్బందిని విచారించారు. అలాగే మంగళవారం సీఓలు, సీఎంఎం, ఐబీ స్పెషలిస్ట్, ఇతర ఉద్యోగులను విచారించిన అధికారులు బుధవారం మరోసారి వారిని విచారించడంతోపాటు వివిధ బ్యాంకుల నుంచి మెప్మాకు అం దించిన ఎన్‌పీఏ (నాన్‌పేబుల్ అకౌంట్) గ్రూపుల వివరాలను తనిఖీ చేశారు. కాగా నేడు నే రుగా బ్యాంకులకు వెళ్లి ఏ ఏ బ్యాంకుల్లో బోగస్ గ్రూపులున మోదయ్యాయి. ఎంతెంత రుణం తీసుకున్నారు. అనే వివరాలు సేకరించనున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పంగులూరు, ఫిబ్రవరి 14: ఎన్నికల సమయం లో ఎలాంటి ప్రలోభాల కు లోనుకాకుండా ని జాయితీగా తన ఓటుహ క్కు వినియోగించుకో వా లని అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి అన్నా రు. బుధవారం మండ లంలోని బైటమంజులూ రు, భగవాన్‌రాజుపాలెం, రామకూరు, కొండమం జులూరు, కోటపాడు, జనకవరం, అలవలపాడు గ్రామాలలో ఎస్ఐ తిరుపతిరావుతో కలసి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ర్యాంపులు, విద్యుత్ సౌకర్యంతో పాటు మంచినీటి సౌకర్యం ఏర్పాటుతో పాటు కిటికీలు, తలుపులకు తగిన మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మాట్లాడుతూ ఓటుహక్కు ప్రజలకు ఆయుధం లాంటిదని చెప్పారు. ఎన్నికల సమయంలో ఓటు వినియోగం ద్వారా మంచి నాయకులను ఎ న్నుకుంటే సమాజానికి మేలు చేకూరుతుందని తెలిపారు. డబ్బు, మద్యంతో పాటు ఇతర ప్రలోభాలకు పాల్పడి ఓటును దుర్వినియోగం చేసుకోవద్దని సూచించారు. ప్రజాస్వామ్యబద్ధంగాఎన్నికల నిర్వహణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాడితప్పిన పర్యవేక్షణ



- బజారుకెక్కిన అద్దంకి పోలీస్ స్టేషన్ పరువు
- 15 నెలలకే ఐదుగురు సీఐలు
- కొందరు రాజకీయ ఒత్తిడిలు.. మరికొందరు వివాదాలతో బదిలీలు
- ఇద్దరు ఎస్సైలు, నలుగురు కానిస్టేబుళ్ళు ఓవర్ యాక్షన్
- మేదరమెట్లకు మారిన రూరల్ సర్కిల్ కార్యాలయం

అద్దంకి, ఫిబ్రవరి 14: అద్దంకి పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అయి 15 నెలలకే ఐదుగురు సీఐలు బదిలీ బాట పట్టారు. వీరిలో కొందరిది స్వయం కృపార్థం అయితే మరికొందరు రాజకీయ కోణాలతో బదిలీ అయ్యారు. తక్కువ కాలానికే ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారి బదిలీ కావటంతో కొత్త అధికారి వచ్చి తెలుసుకునేలోపే మరలా బదిలీబాట పడుతున్నారు. దీంతో అద్దంకి పట్టణ పోలీస్ స్టేషన్ పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పినట్లు అయ్యింది.

అద్దంకి పోలీస్ స్టేషన్‌ను 2022 అక్టోబర్ నెలలో అప్‌గ్రేడ్ చేసి సీఐ స్థాయి అధికారిని ఎస్‌హెచ్‌వోగా నియమించారు. గతంలో ఉన్న అద్దంకి సర్కిల్ కార్యాలయాన్ని అద్దంకి రూరల్ సర్కిల్‌గా మార్పుచేసి మేదరమెట్ల, కొరిశపాడు, పంగులూరు పోలీస్ స్టేషన్‌లను కేటాయించారు. అదే సమయంలో గతంలో అద్దంకి సర్కిల్‌లో ఉన్న సంతమాగులూరు, బల్లికురవ పోలీస్ స్టేషన్లను సంతమాగులూరు సర్కిల్‌ను ఏర్పాటుచేసి సంతమాగులూరులో సర్కిల్ కార్యాలయం ఏర్పాటుచేశారు.

అద్దంకి పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ అయినప్పటినుంచి ఏదొకవిధంగా వివాదస్పదంగా మారుతూనే ఉంది. అప్‌గ్రేడ్ అయిన వెంటనే రాజమోహన్‌రావు టౌన్ సీఐగా, అద్దంకి రూరల్ సీఐగా రోశయ్య వచ్చారు. వీరిద్దరు చీరాలలో పనిచేస్తూ అద్దంకి వచ్చారు. అక్కడ నెలకొన్న విభేదాలే అద్దంకిలోనూ కొనసాగాయి. దీంతో కొద్దిరోజులకే ఆధిపత్య పోరుతో రచ్చకెక్కి రూరల్ సర్కిల్‌ను అద్దంకి నుంచి మేదరమెట్లకు మార్చారు. ఇంతటితో ఆగకుండా రాజమోహన్ స్థానంలో రూరల్ సీఐగా ఉన్న రోశయ్య వచ్చారు. అప్పట్లో రాజకీయ ఒత్తిడితోనే రోశయ్య అద్దంకి టౌన్ సీఐగా వచ్చారన్న ప్రచారం జరిగింది. అప్పట్లో పనిచేసిన సీఐ రోశయ్య, ఎస్సై సమందర్ వలి మధ్య పెద్ద అగాధం వచ్చింది. ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. ఇద్దరిపై అవినీతి ఆరోపణలు లెక్కలేనన్ని వచ్చాయి. వీటి విషయం పక్కన పెడితే ఒకరి వ్యక్తిగత విషయాలలో మరొకరు తొంగి చూడటం జరిగింది. దీంతో ఇద్దరు అధికారులు ఒకరిపై మరొకరు నేరుగా ఫిర్యాదులు కూడా చేసుకున్నట్లు సమాచారం. తీవ్ర ఆరోపణలతో ఇద్దరు అధికారులపై వేటు పడింది. దీంతో కొద్దికాలం ఇన్‌చార్జ్‌గా అద్దంకి రూరల్ సీఐ గా ఉన్న ఉమేష్ వ్యవహరించారు. అనంతరం రమేష్‌బాబు సీఐగా వచ్చారు. తదనంతరం అధికారపార్టీలో మారిన పరిణామాల నేపథ్యంలో రమేష్‌బాబు కూడా కొద్దికాలానికే బదిలీ బాట పట్టారన్న ప్రచారం ఉంది. ఆ స్థానంలో ప్రస్తుతం కృష్ణయ్య వచ్చారు. ఇదిలా ఉంటే కొన్ని సందర్భాలలో ఎస్‌హెచ్‌వోగా ఉన్న సీఐలకు తెలియకుండానే ఎస్సైలు, కానిస్టేబుళ్ళు నేరుగా కేసులు, వివాదాలలో తలదూరుస్తూ అత్యుత్సాహం చూపించటం వారిపై వేటుకు కారణాలుగా మారాయి. ఈ కోవలేనే ఎస్సై సమందర్ వలి వీఆర్‌కు వెళ్లారు.

ఇటీవల పెద్ద మొత్తంలో మద్యం బాటిళ్ళు స్వాధీనం చేసుకొని కొద్దిమేర మాత్రమే పట్టుబడ్డట్లు కేసు నమోదు, అధికార పార్టీకి వత్తాసుగా ఉండటంతో పాటు ఓ యువకుడిని ఫోన్‌లో బెదరింపు ధోరణితో మాట్లాడటం, ఈవిషయాలు ఉన్నతాధికారుల దృష్టికి పోవటంతో ఎస్సై వెంకటేశ్వర్లు కూడా వీఆర్ బాటపట్టారు. ఇక పలు సందర్భాలలో నలుగురు కానిస్టేబుళ్ళను కూడా వివిధ కారణాలతో వేటు పడింది. తాజా గా శంఖవరప్పాడులో మద్యం అక్రమ నిల్వల పేరుతో ఓ ఇంటికి అర్ధరాత్రి సమయంలో వెళ్లిన ఓ కానిస్టేబుల్‌పై కూడా వేటు వేస్తూ బుధవారం ఉత్తర్వులు వచ్చినట్లు తెలుస్తుంది. ఇలా తరచూ అద్దంకి పోలీస్ స్టేషన్ పరువు బజారుకెక్కుతుండటం చర్చనీయాంశంగా మారింది. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు మరింత దృష్టిసారించి అద్దంకి టౌన్ పోలీస్ స్టేషన్‌ను గాడిలో పెట్టేవిధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మొదలెట్టారు..!

- 17న బాపట్ల జిల్లా ఇంకొల్లులో రా..కదలిరా బహిరంగ సభ
- పోలీసులను అడ్డం పెట్టుకుని కుట్రకు తెరలేపిన పాలకులు
- టీడీపీ నేతలను స్టేషన్‌కు రావాలంటూ ఆదేశాలు
- అనుమతుల్లేవంటూ హడావుడి



ఏర్పాట్లకు అనుమతుల్లేవంటూ సభాప్రాంగణానికి వచ్చిన పోలీసులు

బాపట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులో ఈనెల 17న జరిగే రా..కదలిరా.. కార్యక్రమానికి చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సారథ్యంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎప్పటిలాగానే తనకు అలవాటైన రీతిలో వ్యవస్థలను అడ్డం పెట్టుకుని సభకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు ప్రభుత్వం చేపట్టింది. రైతుల అంగీకారంతోనే ఇచ్చిన దాదాపు 25 ఎకరాల స్థలం లో సభ ఏర్పాట్లను చేస్తున్నారు. సభకు ఇచ్చిన స్థలంలో కొంత భాగం దేవదాయ శాఖకు చెందినదని ఆ విభాగం అనుమతులు తీసుకోలేదని వారు ఫిర్యాదు చేశార ని బుధవారం రాత్రి సభా ప్రాంగణానికి వచ్చిన పోలీసులు హడావిడి చేశారు. సదరు విభాగం ఇచ్చిన ఫిర్యాదు కాపీని చూపమని అడిగినప్పటికీ పోలీసుల నుంచి స్పందన కరువైందని టీడీపీ నేతలు చెబుతున్నారు.

విజయవంతం అవుతుందనే అక్కసుతోనే..

చంద్రబాబు పర్యటన రెండు రోజుల క్రితమే ఖరారయింది. సభ కోసం కావాల్సిన స్థలం ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా సహకరించడంతో ఏర్పాట్లు చకాచకా జరిగిపోతున్నాయి. బుధవారం ఆ ప్రాంగణంలో భూమిపూజ జరగడంతో పాటు బాపట్ల పార్లమెంట్ పరిధిలోని నాయకులతో అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సన్నాహక సమావేశం కూడా నిర్వహించారు. సభ విజయవంతం కానుందనే సమాచారం నేపథ్యంలో తాడేపల్లి పెద్దల ఆదేశాలతో అనుమతుల పేరిట కొత్త కుట్రకు తెరలేపారని టీడీపీ శ్రేణులు మండిపడుతున్నాయి.

పనులు ఆపాల్సిందే..

సభాప్రాంగణానికి వచ్చిన పోలీసులు ఏర్పాట్లను ఆపాల్సిందేననే హుకుం జారీ చేయడంతో పాటు అక్కడ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న టీడీపీ నేతలను ఇంకొల్లు స్టేషన్‌కు రావాలని కూడా తీవ్రస్వరంతో హెచ్చరించారు. ఎందుకు ఏర్పాట్లు ఆపాలో రాతపూర్వకంగా ఇవ్వాలని, దానికి దేవదాయ శాఖ నుంచి వచ్చిన ఫిర్యాదు కాపీని కూడా జతచేయమని టీడీపీ నేతలు అడిగారు. దానికి సమాధానంగా స్టేషన్‌కు వచ్చి డీఎస్పీ, సీఐతో మాట్లాడుకోమనే సమాధానం వచ్చింది తప్పితే ఆధారాలు చూపలేదని టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌కు టీడీపీ నేతలు వెళ్లేసరికి అక్కడ ఎవరూ అందుబాటులో లేకపోగా ఫోన్‌లో కూడా స్పందించకపోవడం గమనార్హం.

ప్రజాక్షేత్రంలో ఎండగడతారనే...

పర్చూరు నియోజకవర్గంలో జరిగిన ఓట్ల అక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించాయి. వీటిపై పోరాడిన ఎమ్మెల్యే ఏలూరి లక్ష్యంగా ఇటీవల ప్రభుత్వం అక్రమ కేసులకు తెరలేపింది. గ్రానైట్ ఫ్యాక్టరీలే లక్ష్యంగా పాలకులు కక్షసాధింపులకు దిగడం, ప్రైవేటు సైన్యంతో అధికారులు ఫ్యాక్టరీలలో సోదాలు నిర్వహించడం వంటివన్నీ జనాల్లో చర్చకు దారితీశాయి. వీటన్నింటితోపాటుగా పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వసూళ్ల పర్వం నడిపిన తీరు కూడా ప్రజల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైంది. చంద్రబాబు సభ నేపథ్యంలో ఈ అంశాలన్నింటినీ ప్రజాక్షేత్రంలో ఆయన ఎండగడతారనే భయంతోనే సభకు ఏదో విధంగా అవాంతరాలు సృష్టించే ప్రయత్నం చేస్తుందని టీడీపీ నేతలు మండిపడుతున్నారు

రాత్రి వేళ తమను ఇలా...

చట్టబద్ధంగా అన్ని అనుమతులు తీసుకుని సభ ఏర్పాట్లను ప్రశాంత వాతావరణంలో చేసుకుంటున్న తమను రాత్రి వేళ పోలీసులు వచ్చి కక్ష గట్టినట్లు వ్యవహరించడం పట్ల టీడీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా తాము అడిగిన ప్రశ్నలకు పోలీసుల నుంచి సమాధానమే కరువైందని, పైగా తమను రాత్రి వేళ స్టేషన్‌కు రమ్మని హెచ్చరించారని శ్రేణులు వాపోయాయి. అక్కడకు వెళితే కనీసం స్పందించే వారే కరువయ్యారని, ఈ చర్యలన్నీ కేవలం వేధించడానికే చేస్తున్నారని ప్రజలు ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం తథ్యమని నేతలు తెలిపారు.

బాబు సభకు అడ్డంకులా? ఏలూరి

అమరావతి, ఫిబ్రవరి15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు ఈనెల 17న ఇంకొల్లులో నిర్వహించే రా.. కదలిరా సభకు అధికార పార్టీ అడ్డంకులు సృష్టించడంపై బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తీవ్రంగా మండిపడ్డారు. ఏర్పాట్లు అన్నీ పూర్తయ్యాక పోలీసులను అడ్డంపెట్టుకుని, అధికార పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. చంద్రబాబు సభకు జిల్లా కలెక్టర్, ఎస్పీ అన్ని అనుమతులు కోరుతూ దరఖాస్తులు చేయడంతో పాటు హెలీపాడ్‌కు ఆర్‌అండ్‌బీకి దరఖాస్తు చేసినట్లు ఆయన బుధవారం మీడియాకు చెప్పారు.

ఇంకొల్లులోని పావులూరు రోడ్డులో ఓ రైతు లీజుకు తీసుకున్న దేవదాయశాఖ భూమిలో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తవుతున్న సమయంలో ఆశాఖ అధికారులు ఫిర్యాదు చేశారంటూ పనులు నిలిపివేయాలంటూ పోలీసులు హుంకుం జారీ చేశారన్నారు. రైతు లిఖితపూర్వక అంగీకారంతోనే పనులు పూర్తి చేయగా, సభను భగ్నం చేయడానికి ప్రభుత్వ పెద్దలు కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. పోలీసులతో వైసీపీ ప్రభుత్వం తన మార్కు రాజకీయానికి తెరదీసిందని విమర్శించారు.

ఆసరా చెక్కుల పంపిణీ

మార్టూరు, ఫిబ్రవరి 14: స్థానిక కొణిదెన రోడ్డులో వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం కింద చెక్కులను పంపిణీ చేశారు. మండలంలో 1325 డ్వాక్రా గ్రూపులకు రూ.9 కోట్ల 74 లక్షలు మంజూరయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ డ్వాక్రా గ్రూపు మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. అంతకు ముందు మండలంలోని బొల్లాపల్లిలో గ్రామ సచివాలయ భవనం, విలేజ్ క్లినిక్ నూతన భవన నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు.

కార్యక్రమంలో ఎంపీపీ భుక్యా శాంతిబాయి, సర్పంచ్ భుక్యా సుమితాబాయి, ఏపీఎం రాజారత్నం, పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తానవలి, బాబూ నాయక్, కాకోలు రామారావు, గన్నెపూడి రవిచందు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

- ప్రతిపక్ష పార్టీలపై కక్షసాధింపు చర్యలు
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, ఫిబ్రవరి 14: ప్రజాసంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం విస్మరించిందని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ధ్వజమెత్తారు. ఈనెల 17న ఇంకొల్లులో జరగనున్న చంద్రబాబు సభకు సంబంధించి బుధవారం ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో బాపట్ల పార్లమెంట్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సాంబశివరావు మాట్లాడుతూ ఇంకొల్లులో ఈనెల 17 న జరగనున్న రా కదలిరా సభ బాపట్ల జిల్లాలోనే చారిత్రాత్మకమైన రోజుగా, భవిష్యత్ తరాలకు నూతన అధ్యాయంగా మిగలనున్నదని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొనే ఈ సభతో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం పతనానికి నాంది ప్రారంభమవుతుందన్నారు. రా కదలిరా సభకు లక్షన్నర మందితో భారీగా సభ నిర్వహణ ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సభ ద్వారా చంద్రబాబు వైసీపీ అరాచకాలపై శంఖారావం పూరిస్తున్నారన్నారు. వైసీపీ అరాచకాలను దౌర్జన్యాలను ఎదిరిస్తూ బాపట్ల జిల్లాలో తెలుగుదేశం పార్టీ మహాశక్తిగా ఆవిర్భవించిందన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేసేందుకు రా కదలిరా పేరుతో చంద్రబాబు రాష్ట్రంలో సభలు నిర్వహిస్తున్నారన్నారు. ఇంకొల్లులో జరిగే సభతో వైసీపీ ప్రభుత్వం పతనం ప్రారంభమవుతుందన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వ విధానాన్ని ఎండ గట్టేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపు నిచ్చారు.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు, మాజీమంత్రి కొల్లు రవీంద్రబాబు మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో టీడీపీ ఘన విజయం సాధించడం ఖాయమని అన్నారు. జిల్లాలో టీడీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ దౌర్జన్యాలకు బెదరకుండా, అక్రమ కేసులకు భయపడకుండా దీటుగా ఎదుర్కొని జిల్లాను ఎమ్మెల్యే ఏలూరి అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. గత నాలుగేళ్లుగా అధికార పార్టీకి తలవంచక పార్టీని దీటుగా నడిపించిన ఏలూరి సేవలను ప్రజలు మరచిపోరన్నారు. వచ్చే తెలుగుదేశం ప్రభుత్వంలో ఏలూరికి పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధిని ఆకాంక్షించేవారందరూ చంద్రబాబు వెంట నడవాలని వారు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, మాజీ ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయ్‌కుమార్, బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేంద్ర వర్మ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్, చీరాలకు చెందిన నాయకుడు ఎం.అమర్నాథ్, టీడీపీ రాష్ట్ర నాయకులు చిట్టి, వేములకొండ శ్రీనివాస్, దయాబాబు, జి.కోటేశ్వరరావు, తాత జయప్రకాష్, పిల్లి మాణిక్యాలరావు, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు

- అధికారులకు కలెక్టర్ హెచ్చరిక
- సీనరేజ్ నిధులు ఒక పంచాయతీకే కేటాయించారని మూడు గ్రామాల సర్పంచ్‌ల ఫిర్యాదు



సీనరేజ్ నిధులు కేటాయించాలని అర్జీ ఇస్తున్న మల్లాయపాలెం సర్పంచ్ రాఘవరావు

బల్లికురవ, ఫిబ్రవరి 14: అధికారులు బాధ్యతగా పనిచేయకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ రంజిత్‌బాషా హెచ్చరించారు. బుధవారం బల్లికురవలో జరిగిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తమ సమస్యలు తెలిపేందుకు తరలివచ్చారు ఎక్కువగా భూసమస్యలపై ప్రజలు అర్జీలను సమర్పించారు. మల్లాయపాలె, నక్కబొక్కలపాడు, కె.రాజుపాలెం గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు దూళిపాళ్ల బుల్లిరామయ్య, జొపల్లి రాఘవరావు, అమరనేని లక్ష్మీ తమ గ్రామాలకు రావల్సిన మైనింగ్ సీనరేజ్ గ్రాంటు ఒక్క కొణిదెన గ్రామానికే కేటాయించారని పేర్కొన్నారు. ఎన్నోఏళ్ల నుంచి వాటాల మేరకు వస్తున్న సీనరేజ్‌ను అధికారులు పక్కదారి పట్టించారని ఫిర్యాదుచేశారు. మైనింగ్, పంచాయతీ అధికారులకు దీనిపై విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు.

అలాగే, కొనిదెన గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కుంచపు అంజనేయులు తాను ప్రభుత్వ భవనాలు, పైపులైన్లు పనులు చేశానని, ఇంతవరకు బిల్లులు రాలేదని ఫిర్యాదు చేశారు. బల్లికురవ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాము పాఠశాలకు రావాలంటే పొరుగు గ్రామాల నుంచి ఆర్టీసీ బస్సులు లేవని, వెంటనే కేటాయించాలని కోరారు. అంబడిపూడి ఎస్సీ కాలనీవాసులు తమకు మురికి కాలువలు లేవని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని అర్జీ ఇచ్చారు. కొప్పెరపాడుకు చెందిన పేరెంట్స్ కమిటీ తమ పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం కేటాంచాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సమర్పించిన అర్జీలపై అయా శాఖల అధికారుల ద్వారా విచారణ జరిపి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామన్నారు. ఎంతో కాలం నుంచి ఉన్న పెండింగ్ సమస్యలు కూడా సకాలంలో పరిష్కారం చూపేలా జిల్లా వ్యాప్తంగా స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం చిన హనిమిరెడ్డి, డీఆర్వో వెంకటరమణ, చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ సుభద్ర, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు చింతల అంజలి, జిల్లాలోని అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నామ్ రోడ్డు మార్జిన్‌లే పార్కింగ్ స్థలాలు

- తరచూ ప్రమాదాలు
- ఆగిఉన్న వాహనాలను ఢీకొడుతున్నవైనం
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు



అద్దంకి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం(ఫైల్)

అద్దంకి, ఫిబ్రవరి 14: నామ్ రోడ్డు మార్జిన్‌లోనే వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాహనచోదకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. నార్కెట్‌పల్లి- అద్దంకి- మేదరమెట్ల (నామ్)రోడ్డులో రెస్ట్ ఏరియాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయలేదు. దీనికితోడు అత్యధిక శాతం లారీలు, కంటైనర్‌లు ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడులను కలుపుతూ వస్తువుల రవాణాకు నామ్ రోడ్డు దగ్గర మార్గంగా ఉంది. దీంతో అత్యధిక శాతం లారీలు, కంటైనర్‌ల డ్రైవర్‌లు పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన డ్రైవర్‌లు కావటంతో నామ్ రోడ్డు వెంబడి పెద్ద సంఖ్యలో డాబాలు, రెస్టారెంట్‌లు వెలిశాయి. దీంతో వాహనాలను రోడ్డు మార్జిన్‌లలో నిలిపి విశ్రాంతి తీసుకుంటున్నారు. రోడ్డు మార్జిన్‌లోనే వాహనాలు నిలుపుతూ సిగ్నల్స్ కూడా వేయక పోతుండటంతో వెనుకనుంచి వచ్చే వాహనాల చోదకులు గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇటీవల శింగరకొండ-అద్దంకి మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు వదిలాడు. మరికొన్ని సందర్భాలలో వాహనచోదకులు క్షతగాత్రులవుతున్నారు. నామ్ రోడ్డుపై రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసి మార్జిన్‌లో వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సీఎంవోలో ఫలించని ఆమంచి ప్రతిపాదన

- రెండు రోజుల్లో సీఎంతో అపాయింట్‌మెంట్

చీరాల, ఫిబ్రవరి 14: వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ బుధవారం సీఎంవో నుంచి పిలుపు రావటంతో వెళ్లారు. సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి ముందు ఆమంచి తెలిపిన అభ్యర్థన ఫలించలేదని తెలిసింది. ఈ క్రమంలో రెండు రోజుల్లో సీఎం జగన్‌తో అపాయింట్‌మెంట్ ఖరారయిందని, అప్పుడు అమీతుమీ తేల్చుకుంటారని చీరాల నియోజకవర్గంలోని ఆమంచి అనుచరులు చెప్పుకుంటున్నారు. బుధవారం పర్చూరు నియోజకవర్గం మార్టూరులో ఆసరా కార్యక్రమంలో ఆమంచి పాల్గొన్నారు. ఆసమయంలో సీఎంవో నుంచి అందిన సమాచారం మేరకు ఆమంచి హడావుడిగా బయలుదేరి వెళ్లారు. అయితే, కొద్ది రోజులుగా ఆమంచి తాను చీరాల నుంచే పోటీ చేస్తానని చీరాల నియోజకవర్గంలోని తన అనుచరులకు చెప్పిన నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం వెనువెంటనే ఒకటికి నాలుగు పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. ఆ తరువాత తాజాగా చీరాలకు చెందిన ఎస్ఆర్ఐ యడం బాలాజీ పేరు తెరపైకి వచ్చింది. బాలాజీ పేరు అంతిమంగా ఖరారవుందని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆమంచికి సీఎంవో నుంచి వర్తమానం అందటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎంవోలో ధనుంజయరెడ్డికి ఆమంచి తన వాదన , అభ్యర్థన వినిపించినట్లు తెలిసింది. గతంలో తనకు ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత కార్యాచరణ ఉండాలనేది ఆ వాదన, అభ్యర్థన సారాంశమని సమాచారం. అయితే అందుకు సానుకూలత లభించలేదని తెలిసింది.

ఈనేపథ్యంలో రెండు రోజుల్లో సీఎం జగన్‌ను కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఖరారయిందని, ఆరోజు అమీతుమీ తేల్చుకునే దిశగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు ఆమంచి అనుచరులు చెప్తున్నారు. అంతిమంగా గతంలో అధిష్ఠానం తనకు ఇచ్చిన హామీ, తన ప్రతిపాదన, అభ్యర్థనలను పరిగణలోకి తీసుకోవాలని, లేదంటే పార్టీ ఏదన్నా కానీ చీరాల నుంచే ఆమంచి పోటీ చేస్తారని అతని అనుచరులు ఘంటాపథంగా చెప్తుండటం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అందులో భాగంగా అయా రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడికలు, తీసివేతలు వేస్తూ లాభనష్టాలను బేరీజు వేసుకుంటున్నారు.

ఉద్యోగుల బకాయిలను తక్షణమే విడుదల చేయాలి

పర్చూరు, ఫిబ్రవరి 14 ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావలసిన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని జేఏసీ పర్చూరు తాలూకా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ విధానాన్ని రద్దుచేస్తామని చెప్పి నేటికి అమలుకు నోచుకోకపోవటం ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపటమేనన్నారు. పీఆర్‌సీని అమలు చేయటంతోపాటు, ఐఆర్‌ను కూడా ప్రకటించాలన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 27న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఉద్యోగులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

అద్దంకి, ఫిబ్రవరి 14: ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ పిలుపు మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో బుధవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిప్యూటీ తహసీల్దార్ సుధారాణికి వినతిప త్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ అద్దంకి తాలూకా చైర్మన్ గద్దల కిరణ్‌కుమార్, వైస్‌చైర్మన్ తాళ్ళూరి రమేష్‌బాబు, ఎన్జీవో నాయకులు ఏడుకొండలు, రవికుమార్, కార్మిక సంఘాల నాయకులు గడ్డం శ్రీనివాసరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

చీరాల, ఫిబ్రవరి 14: తెలుగుదేశం పార్టీ చీరాల నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం 216 జాతీయ రహదారి పక్కనున్న టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం 4 గంటలకు ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అధ్యక్షతన జరుగుతుందని కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 17న ఇంకొల్లులో పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొనే రా. కదలి రా సభను జయప్రదం చేసేందుకు సంబంధించిన కార్యాచరణపై చర్చిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

ప్రశాంతమైన ఎన్నికలకు ప్రజలు సహకరించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 14: ప్రశాంతమైన ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఈపూరుపాలెం ఎస్సై మర్రి శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిధిలోని తోటవారిపాలెం, పిట్టువారిపాలెం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా కార్యాలయం సిబ్బందితో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, ఆయా ప్రాంతాల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లోనవకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా కార్యాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

చీకటి చట్టాన్ని రద్దుచేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 14: అనాలోచితంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కుల చట్టం 2022తో రైతులు రక్షణ కోల్పోతారని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా నూతన చట్టాన్ని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇది భూ హక్కు చట్టం కాదని, చీకటి చట్టమన్నారు. న్యాయ, అన్యాయాలు రెవెన్యూ అధికారుల చేతుల్లోకి వెళితే అమాయకులు ఆసరా కోల్పోతారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, న్యాయవాదులు రామకృష్ణ, సురేష్, ప్రసాద్, రాము పాల్గొన్నారు.

సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 14: శ్రీప్రకాశం ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం సరస్వతిదేవి జన్మనక్షతం వసంత పంచమి సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతి దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 14: పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఈనెల 18న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర కౌన్సిలర్ దామ నాగేశ్వరరావు కోరారు. బుధవారం అద్దంకిలోని శ్రీప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శుద్దపల్లి స్వామి, వెంకయ్య, ఉదయ్‌కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ముప్పవరంలో టీడీపీ సన్నాహక సమావేశం

పంగులూరు, ఫిబ్రవరి 14: మండలంలోని ముప్పవరం గ్రామంలో గురువారం తెలుగుదేశం పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశం జరుగుతుందని పార్టీ కార్యాలయ ప్రతినిధి తెలిపారు. ఈనెల 17న ఇంకొల్లులో జరిగే రా కదలిరా సమావేశానికి సంబంధించి పార్టీ శ్రేణుల సన్నాహక సమావేశం ఉదయం 10 గంటలకు ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని తెలిపారు.సమావేశానికి మండలంలోని క్లస్టర్, బూత్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధాల విభాగాల నేతలు హాజరు కావాలని కార్యాలయ ప్రతినిధి కోరారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

చినగంజాం, ఫిబ్రవరి 14: మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పెద్దపల్లెపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, శిఖర గరుడ ఆళ్వార్ ప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదమం 6 గంటల నుంచి పుణ్యాహవచనం, రత్న స్థాపన, యంత్ర స్థాపన, బింబ ప్రతిష్ఠ స్థాపన కళా వాహనం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, తదితర కార్యక్రమాల హోమాలు, పూజలను వేద పండితులు దంపతులచే నిర్వహించారు. తదనంతరం బ్రహ్మశ్రీ సహస్ర ప్రతిష్ఠ ఆచార్య పరుచూరి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో నరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శంచుకుని పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శేరు వంశస్థులు, గ్రామ పెద్దలు, గ్రామస్థుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 14: ఉద్యోగులకు రావలసిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా జేఏసీ, ఏపీఎన్‌జీవో ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. యద్దనపూడి జడ్పీ హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెంట్యాల చంద్రశేఖర్, గోపీ, యూటీఎఫ్ , ఏపీటీఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

మార్టూరు, ఫిబ్రవరి 14: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.నారాయణ అన్నారు. బుధవారం మార్టూరులోని జడ్పీ హైస్కూల్, హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో వసతులను పరిశీలించారు. విద్యార్థుకు పెట్టిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతగా ఉండాలని ఉపాధ్యాయులకు సూచించారు. రిజిస్టర్లను సక్రమంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వస్రాంనాయక్ పా ల్గొన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


మార్టూరు, ఫిబ్రవరి 14: వసంత పంచమి సందర్భంగా బుధవారం మార్టూరులోని శ్రీహర్షిని ఒలంపియాడ్ స్కూల్లో 42 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ సతీమణి కవిత ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె చేతులమీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసం ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ఇంకొల్లు, ఫిబ్రవరి 14: ప్రముఖ వైద్యులు, రోటరీక్లబ్ చార్టర్ అధ్యక్షుడు డాక్టర్ కొడాలి ధర్మానందరావు గంగవరంలోని మదర్ థెరిసా వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, సరుకులు, పండ్లు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఇంకొల్లు సెంట్రల్ ఆధ్వర్యంలో బుధవారం తన కుమారుడు కొడాలి ప్రభాకర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వృద్ధులకు దుప్పట్లు, కందిపప్పు, బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కోశాధికారి చుండి సాంబశివరావు, మద్దినేని హనుమంతరావు, రాఘవరాజు, సోమేపల్లి రామ్మోహనరావు, గోరంట్ల నాగేశ్వరరావు, ఆశ్రమ నిర్వాహకులు బొడ్డు వరప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా డా.బీరం సుందరరావు తమ తల్లిదండ్రుల పేరున రూ.5వేలు విరాళం ఆశ్రమ నిర్వహకులు వరప్రసాద్‌కు అందజేశారు.

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 15 ఫిబ్రవరి 2024

గత ఎన్నికల్లో పదికి పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను గెలుచుకున్న వైసీపీ ఈ ఎన్నికల్లో చతికిలపడే సూచనలు కనిపిస్తున్నాయి. వైసీపీ కోటలు పేకమేడల్లా కుప్పకూలే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి రెడ్డి (వీపీఆర్) ఫ్యాన్ ఉక్కపోతను తట్టుకోలేక సైకిల్ ఎక్కడానికి సిద్ధమవడంతో జిల్లాలో వైసీపీ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పలు నియోజకవర్గాల్లో కేవలం వీపీఆర్ కారణంగా సద్దుమణిగిన అసమ్మతి జ్వాలలు ఒక్కసారిగా వైసీపీని చుట్టుముట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఫ్యాన్‌కు ఎదురుగాలి



- కుప్ప కూలుతున్న వైసీపీ కోటలు
- టీడీపీలో చేరికకు వీపీఆర్ సుముఖం
- ఆయన వెంటే మరికొందరు నాయకులు?
- మాగుంట, మహీధర్ చూపు కూడా 'దేశం' వైపే!
- అధికార పార్టీకి కొత్త సమస్యలు
- జిల్లా అధ్యక్ష పీఠం ఎవరికో!?

నెల్లూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వైసీపీకి ఎంతో విధేయుడిగా ఉన్న తనను ఎన్నికల్లో ఓడించడానికి జరిగిన కుట్రకు అధిష్ఠానం సహకరించిందని వీపీఆర్ భావించారు. వాస్తవానికి ఈయనకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం ఇష్టం లేదు. అయితే, పార్టీ అధినేత, సీఎం జగన్ ఖచ్చితంగా పోటీ చేయాల్సిందేనని కోరడంతో బరిలో నిలిచేందుకు సిద్ధపడ్డారు. ఈ మేరకు ఎన్నికల ప్రచార ప్రక్రియ కొనసాగిస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో ఉన్న వైసీపీ అసమ్మతివర్గాలను చక్కదిద్దుకున్నారు. అన్నీ సిద్ధం చేసుకుని పూర్తిస్థాయిలో పోటీకి సిద్ధపడిన సమయంలో ఆయన విజయావకాశాలను దెబ్బతీసేలా సొంత పార్టీకి చెందిన పెద్దలే కుట్ర చేయటంతో తీవ్ర వేదనకు గురయ్యారు. తనకు మాటమాత్రం కూడా సమాచారం ఇవ్వకుండా పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయడం, కుట్ర పూరితంగా ఇదంతా చేయడాన్ని వీపీఆర్ జీర్ణించుకోలేకపోయారు. దీంతో కొంతకాలంగా ఆయన మౌనంగా ఉంటున్నారు. ఈ తరుణంలో ఆయన సన్నిహితుల సూచనలు, తెలుగుదేశం పార్టీ ఆహ్వానం మేరకు టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ ప్రభావం ఇప్పుడు వైసీపీ మీద పడుతోంది. ఆయన వెంట నడవటానికి పలువురు సిద్ధమవుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఒక బలమైన నాయకత్వం ఆయన వెంట వెళ్లడానికి సన్నాహాలు చేసుకొంటోంది. ఆత్మకూరు, కోవూరు, కావలి, నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు వీపీఆర్ వెంట టీడీపీలో చేరే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో పలువురు కార్పొరేటర్లు కూడా వీపీఆర్ వెంట నడవటానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఊహకందని రీతిలో..


నెల్లూరులో తెలుగుదేశం పార్టీ ఊహకందని రీతిలో అనూహ్యంగా బలపడుతోంది. రాజకీయంగా, ఆర్థికంగా ప్రజా సంబంధాల పరంగా బలమైన కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నాయి. వీపీఆర్‌తోపాటు మాగుంట కుటుంబం, కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డిలు కూడా టీడీపీలో చేరుతున్నారన్న ప్రచారం వైసీపీలో తుఫాన్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. రాజకీయంగా మాగుంట కుటుంబానికి నెల్లూరు జిల్లాలో మంచి పేరుంది. ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, నెల్లూరు సిటీ నియోజకవర్గాల్లో ఈ కుటుంబానికి అభిమానులు, అనుచరులు ఉన్నారు. కుందుకూరులో మహీధర్‌రెడ్డికి ఎంత పట్టుందో ఆయ రాజకీయ చరిత్రే చెబుతుంది. రాష్ట్రంలోనే తొలిసారిగా వైసీపీపై తిరుగుబాటు జెండాను ఎగరేసిన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు బలమైన రాజకీయ నేపథ్యం కలిగినవారు. వీరి చేరికతో టీడీపీ బలం పుంజుకుంది. ఇప్పుడు అంతేస్థాయిలో గుర్తింపు పొందిన వీపీఆర్, మాగుంట, మహీధర్‌రెడ్డిలు టీడీపీలో చేరనుండటంతో ఆ పార్టీ మరింత బలోపేతం కానుంది.

వైసీపీకి కొత్త చిక్కులు

వైసీపీని వీడాలన్న వీపీఆర్ నిర్ణయం ఆ పార్టీకి కొత్త చిక్కులు తెచ్చిపెట్టింది. వీపీఆర్ స్థానంలో పార్లమెంటుకు మరో అభ్యర్థిని వెదుక్కోవాల్సి ఉంది. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ లేదా నెల్లూరు రూరల్ జగన్ ఎక్కడ చేయమంటే అక్కడ పోటీ చేస్తానని ప్రకటించారు. ఆదాలకు ఎంపీ స్థానానికి పంపే క్రమంలో రూరల్‌కు కొత్త అభ్యర్థిని వెతుక్కోవాలి. ఒకవేళ ఆదాల రూరల్ నుంచే పోటీ చేయాల్సి వస్తే ఎంపీ స్థానానికి మరొకరిని ఎన్నుకోవాల్సి ఉంది. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కొత్త వారిని నియమించాల్సి ఉంది. ఈ నియామకం గోరుచుట్టుపై రోకలిపోటు చందం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎన్నికల సమయం కావడంతో జిల్లా పార్టీని సమర్థవంతంగా నడిపే నాయకుడు లేకపోతే అది ప్రమాదమే. ఇలా గత నాలుగేళ్ల ఎనిమిది నెలలపాటు అధికార హోదాలో ఒక వెలుగు వెలిగిన అధికార వైసీపీ ఇప్పుడు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

ఆత్మలకూ ఓట్లొచ్చాయ్!

- బతికి ఉన్న వారి ఓట్లు గల్లంతు
- తప్పులుతడకగా జాబితా



బతికే ఉన్న చిన్నమ్మ, వెంకటరమణయ్య ఓట్లను జాబితాలో తొలగించిన దృశ్యం

సంగం, ఫిబ్రవరి 14 : ఇటీవల విడుదలైన తుది ఓటర్ల జాబితా తప్పులు తడకగా మారింది. బతికున్నవారిని చంపేసి ఓట్లు తొలగించారు. చనిపోయిన వారి ఓట్లు మాత్రం యథావిధిగా ఉన్నాయి. సంగం మండలం వంగల్లు ఓటర్ల జాబితాయే ఇందుకు నిదర్శనం. ఈ గ్రామంలో 213, 214 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1705 మంది ఓటర్లు ఉన్నారు. జాబితాలో నెం.133లో ఎం చిన్నమ్మ, నెం.783లో గంగుల వెంకటరమణయ్యలు బతికే ఉన్నారు. కానీ ఈ ఇద్దరు చనిపోయినట్లు వారి ఓట్లు తొలగించారు. ఈ ఇద్దరు టీడీపీ సానుభూతిపరులని తెలిసింది. అలాగే, ఇక్కడే మృతులకూ ఓటు హక్కు కల్పించారు. ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. సుమారు 14 మంది మృతుల పేర్లు జాబితాలో ఉన్నారు. మర్రిబోయిన సుబ్బరామయ్య (316), చెట్‌పట్ రాధబాయ్మ (322), నిమ్మళ్ల సుబ్బరామయ్య (644), పడుగుపాటి బాలరాజు (648), చౌటూరు బుజ్జమ్మ (693), దాసరి బుజ్జమ్మ (739), బండారు సుబ్బమ్మ (785), పసుపులేటి రంతు (786), మొండెం వెంకటరమణయ్య (864) వీరంతా ఎప్పుడో చనిపోయారు. కానీ ఓటర్ల జాబితాలో మాత్రం వీరి పేర్లు ఉన్నాయి.

టీపీగూడూరులోనూ అంతే..



తప్పులుతడకగా సౌత్‌ఆములూరు జాబితా

తోటపల్లిగూడూరు : రాజకీయ నాయకులతో సమావేశాలు, ఇంటింటా సర్వేలు, ప్రత్యేకాధికారులతో సమీక్షలు నిర్వహించినా ఓటర్ల జాబితాలు మాత్రం మెరుగుపడలేదు. తుది జాబితాలు తప్పుల తడకలుగా మారిపోతున్నాయి. మృతుల పేర్లు, ఒకరికి రెండు ఓట్లు, ఇంటిపేర్లు, నెంబర్లు, ఫొటోలు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు బీఎల్‌వోల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. టీపీగూడూరు మండలం చిన్నచెరుకూరులో పోలింగ్ కేంద్రంలో పెళ్ళిళ్లు అయి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన 30కి మందికిపైగా పేర్లు జాబితాలో ఉన్నాయి. ఇసుకపాలెం పోలింగ్ కేంద్రంలో ఒక వ్యక్తికే రెండు ఓట్లు కల్పించారు. సౌత్‌ఆములూరులో ఓటర్ల పేర్లు చిత్రవిచిత్రంగా కనిపించాయి. ఓటరు పేరు దదద, భర్త పేరు దద జాబితాలో ప్రచురితమయ్యాయి. కొత్తపాలెం, వెంకన్నపాలెంలలో మృతులు, వలసదారుల పేర్లు నమోదయ్యాయి.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి నారాయణ

ఓటరు జాబితాలో తప్పులున్నాయ్..

వారంలో సరి చేస్తా!

టీడీపీ నేత నారాయణతో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 14 : ఓటరు జాబితాలో తప్పులు ఉన్నాయని వాటిని సరి చేయాలని మాజీ మంత్రి, టీడీపీ నగర ఇన్చార్జి పొంగూరు నారాయణ కలెక్టర్‌ను కోరగా, అన్నిటినీ పరిశీలించి వారంలో సరి చేస్తానని కలెక్టర్ హరినారాయణన్ ఆయనకు సమాధానం ఇచ్చారు. జాబితాలో ఓటర్ల తొలగింపు, చేర్పులు తదితర అంశాలపై టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇతర నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు జాబితాను అందచేశారు అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ తేదీ వరకు ఓటరు జాబితాలను పరిశీలిస్తూనే ఉంటామన్న విషయాన్ని కలెక్టర్‌కు చెప్పినట్లే తెలిపారు. తప్పొప్పులను సరి చేయకపోతే ఎంత దూరమైనా వెళతామని స్పష్టం చేశారు. కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తన భర్త చనిపోయిన రోజు సందర్భంగా నిరుపేదలకు ఇవ్వాలని తమ నాయకురాలు విజేత విజయవాడ నుంచి పది బ్యాటరీ ట్రైసైకిళ్లను తెప్పించారన్నారు. ఎన్నికల కోడ్ లేకపోయినా వాటిని సీజ్ చేయడం సిగ్గు చేటని అన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలిపామని, గురువారం మధ్యాహ్నం లోపు వాటిని విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనిల్‌కి నెల్లూరులో పోటీ చేసే దమ్ము లేక నరసారావుపేటకు పారిపోయాడని సెటైర్లు వేశారు.



నెల్లూరులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమరం

నెల్లూరు (హరనాథపు రం), ఫిబ్రవరి 14 : తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు బుధవారం ఉద్యమబాట పట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30 శాతం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏల డబ్బు చెల్లించాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, క్లెయిమ్‌లు చెల్లించాలని, సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏలను 90 శాతం నగదు రూపంలో చెల్లించాలని, 11వ పీఆర్సీలో చెల్లించాల్సిన సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు చెల్లించాలని తదితర డిమాండ్ల కోసం నినదిస్తున్నారు. నెల్లూరులో ఏపీజేఏసీ నగర శాఖ ఆధ్వర్యంలో డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ నెల్లూరు రూరల్ తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ మన్నేపల్లి పెంచలరావు, జేఏసీ కన్వీనర్ నాయుడు వెంకటస్వామి, నెల్లూరు నగర శాఖ జేఏసీ చైర్మన్ చిలకా రామకృష్ణారెడ్డి, కన్వీనర్ డేగల మార్కెండేయులు తదితరులు పాల్గొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

ఎన్నికల విధుల్లో అత్యుత్సాహం వద్దు

- విస్మరిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్పీ



ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 14 : పోలీసు అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా ఎలాంటి అలసత్వం వహించకుండా ఎన్నికల విధులు నిర్వర్తించాలని, అత్యుత్సాహం ప్రదర్శిస్తే శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కె తిరుమలేశ్వరరెడ్డి హెచ్చరించారు. బుధవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన నెలవారి నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్లను వెంటనే బైండోవర్ చేయాలని, వారి కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. లైసెన్సుడ్ ఆయుధాలను వెంటనే ఎస్‌హెచ్‌వోలు పోలీస్ స్టేషన్‌లో డిపాజిట్ చేయించుకుని, ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు భద్రపరచాలన్నారు. నాన్‌బెయిల్ వారెంట్లను సమర్థవంతంగా అమలు చేసి నేరస్తులను కట్టడి చేయాలని ఆదేశించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యపానంపై దృష్టి పెడితే నేరాలను దాదాపు నియంత్రించవచ్చన్నారు. అనంతరం జిల్లాలో పెండింగ్ కేసులపై సమీక్షించారు. కేసుల పురోగతిలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి ఆలయంలో అక్షరాభ్యాసం సందర్భంగా సరస్వతీ దేవి అలంకారం

వాగ్దేవి నమోస్తుతే!

జిల్లా వ్యాప్తంగా అన్ని అమ్మవారి ఆలయాల్లో బుధవారం వసంత పంచమి వేడుకలు జరిగాయి. సరస్వతీదేవికి అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. చిన్నారులు అక్షరాభ్యాసం జరిపారు. బాలబాలికలతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సరస్వతీ అమ్మవారి నామస్మరణ, శ్లోకాలతో ఆలయాలు మారుమోగాయి.

ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు రేవంత్‌రెడ్డి



నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 14 : క్రికెట్‌పై ఉన్న మక్కువతో చిన్నతనం నుంచే సాధన చేసి అంచలంచెలుగా ఎదుగుతూ నేడు ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు ఎంపికయ్యాడు రేవంత్‌రెడ్డి. ఆడిన ప్రతి మ్యాచ్‌లో తన బ్యాటింగ్ ప్రతిభతో సెలక్టర్లను ఆకర్షించిన రేవంత్ అన్ని ఫార్మెట్లలో రాణించి రంజీ జట్టుకు ఎంపికవడంతో జిల్లా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరులోని భక్తవత్సలనగర్‌కు చెందిన కె.రామచంద్రారెడ్డి, పుష్పలతల చిన్న కుమారుడు రేవంత్ రెడ్డి తొలిసారిగా 2011లో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో చేరారు. రేవంత్‌లో క్రీడా ప్రతిభను గుర్తించిన నాటి కోచ్‌లు ప్రత్యేక శిక్షణ అందించారు. 2012లో అండర్-12, 14, 16 అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు ఫార్మెట్‌లలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి పోటీల్లో బ్యాట్స్‌మెన్‌గా, కీపర్‌గా సత్తా చాటాడు. ఈ ఏడాది జరిగిన అండర్-23 స్టేట్ ట్రోఫీలో రాణించి అనంతరం నిర్వహించిన సీకే నాయుడు అండర్-23 మ్యాచ్‌లలో రెండు డబుల్ సెంచరీలు, రెండు అర్థ సెంచరీలు సాధించారు. అలాగే రాష్ట్ర ప్రాబబుల్స్‌కు నిర్వహించిన వన్‌డే మ్యాచ్‌లలో 2 సెంచరీలతో అందరినీ ఆకట్టుకుని ఆంధ్రా సీనియర్ రంజీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోచ్‌లు అందించిన శిక్షణ, ప్రోత్సాహంతోనే తాను రంజీ జట్టుకు ఎంపికయ్యానన్నారు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నానని తెలిపారు. కాగా, ఆంధ్ర సీనియర్ రంజీ జట్టుకు రేవంత్ ఎంపికవడం హర్షణీయమని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీవీఎస్.మూర్తి, డి.నిఖిలేశ్వర్‌రెడ్డిలు తెలిపారు.

వెంకటాచలం మండలంలో ఇద్దరు మహిళల అదృశ్యం విషాదాంతమైంది. అందరూ అనుమానించినట్లే కూరగాయల దుకాణ యజమాని గిరీష్ ఆభరణాల కోసం ఆ ఇద్దరిని పొట్టన పెట్టుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

అనుమానితుడే హంతకుడు!

- అదృశ్యమైన ఇద్దరు మహిళల దారుణ హత్య
- బంగారం కోసం దుకాణ యజమాని ఘాతుకం
- పోలీసుల అదుపులో నిందితుడు



మృతులు జయమ్మ, రాజేశ్వరి (ఫైల్)

వెంకటాచలం, ఫిబ్రవరి 14 : చెముడుగుంట పంచాయతీ పవన్‌కాలనీకి చెందిన మేకల జయమ్మ (65), జీ రాజేశ్వరి (61)లు సోమవారం సాయంత్రం కూరగాయల దుకాణానికి వెళ్లి అదృశ్యమయ్యారు. దుకాణం నిర్వాహకుడు కందలపాడుకు చెందిన గిరీష్ కూడా అదృశ్యమవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటం, దుకాణంలో రక్తపు మరకలు ఉండటం, చెప్పులు, కళ్లజోడును పోలీసులు గుర్తించారు. మహిళల అదృశ్యం కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు గిరీష్‌గా అనుమానించారు. పోలీసుల విచారణలో గిరీష్‌కు చెందిన ఆటో ముత్తుకూరు మండలం మల్లూరు వద్ద స్వాధీనం చేసుకున్నారు. ఆటోలోనూ రక్తపు మరకలు ఉండటాన్ని గుర్తించారు. గిరీష్ తన సెల్‌ఫోన్‌లో చివరిగా మాట్లాడిన వారి వివరాల ఆధారంగా గిరీష్‌ను విజయవాడలో అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

బంగారం కోసమే..

తమదైన శైలిలో పోలీసులు విచారించడంతో బంగారం కోసమే ఆ ఇద్దరు మహిళలను దుకాణంలోనే కర్రతో కొట్టి చంపినట్లు తెలిసింది. వారి ఒంటిపై ఉన్న ఆభరణాలను దోచుకొని మృతదేహాలను గోనె సంచిలో కుక్కి ఆటోలో తీసుకొని నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు - దొంతాలి సమీపంలోని జామాయిల్ అడవిలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి కాల్చినట్లు సమాచారం. ఆ తర్వాత ఆటోను మల్లూరు వద్ద వదిలి విజయవాడకు పరారైనట్లు విచారణలో వెల్లడైంది. గిరీష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు బుధవారం మృతదేహాలను కాల్చిన ప్రాంతానికి తీసుకెళ్లి కనుగొన్నారు. కుటుంబ సభ్యులను పిలిపించి మృతదేహాలు వారివేనని నిర్ధారించారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కూరగాయాల దుకాణం, మృతదేహాలను కాల్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఫోరెన్సిక్ నిపుణులను పిలిపించి దర్యాప్తు నిర్వహించారు. మృతదేహాలు పూర్తిగా కాలిపోయి ఒకరి కాళ్లు మాత్రమే గుర్తించారు. అధికారుల సమక్షంలో మృతదేహాలకు అక్కడే శవపంచనామా చేయించారు. అదుపులో ఉన్న గిరీష్‌ను పోలీసులు కోర్టులో హాజరుపర్చనున్నారు. కేసు మిస్టరీని రూరల్ డీఎస్పీ వీరాజంనేయరెడ్డి, వెంకటాచలం సీఐ అంకమరావు, పోలీసు సిబ్బందితో కలిసి త్వరగా ఛేదించారు.



మృతదేహాలను కాల్చిన అటవీ ప్రాంతం

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా

- పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి



కావలి (టౌన్), ఫిబ్రవరి 14 : కావలి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ స్పష్టం చేశారు. 'కదిలింది కావలి' పేరిట బుధవారం సాయంత్రం కావలిలోని మినీ స్టేడియం మైదానంలో జరిగిన సభలో పసుపులేటి మాట్లాడారు. తనను ప్రధాన పార్టీలు పిలుపించుకుని టికెట్ ఇవ్వలేమని, భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తా మని అగ్రవర్ణాలకు ఊడిగం చేయమంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. బీసీగా పుట్టడం తప్పా అని ప్రశ్నించారు. జీవితాంతం బీసీలు బానిసలుగా బతకాల్సిందేనా బానిస సంకెళ్ళు తెంపుకొని అగ్రవర్ణాలను, పార్టీలను గంగలో కలపాలని పిలుపునిచ్చారు. ఆర్థికం గా వెనుకబడిపోవడం, ఐక్యత లేకపోవడం వల్లే బీసీలు రాజ్యాధికారానికి దూరం అయిపోతున్నారని అన్నారు. ఈ సభతో రాష్ట్రవ్యాప్తంగా బీసీల్లో చైతన్యం వస్తుందని ఆశాభావం వక్తం చేశారు. తనకు పార్టీలతో సంబంధం లేదని, ప్రజల ఆకాంక్ష మేరకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు.

పునాదులు దాటని జగనన్న ఇళ్లు

● నత్తనడకన నిర్మాణాలు ● 40 శాతం కూడా పూర్తికాని వైనం


మంచాలపల్లిలో పునాది దశలో ఉన్న గృహాలు

అనంతసాగరం, ఫిబ్రవరి 14: పేదలకు గూడు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఎక్కడా పూర్తయిన గృహాలు కనిపించక పోగా.. అసంపూర్తి నిర్మాణాలు మాత్రం ప్రతిగ్రామంలో దర్శనమిస్తున్నాయి. అనంతసాగరం మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 22 లేఅవుట్లు వేసి లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేసి గృహాలు కట్టుకునేందుకు అవకాశం కల్పించారు. మండలంలో మొత్తం 1200 గృహాలు మంజూరు కాగా ఇంతవరకు 40 శాతం కూడా ఇళ్లు పూర్తికాలేదు. ఇంకా చాలా చోట్ల జగనన్న గృహాలు నిర్మాణ దశలో ఉండడం గమనార్హం.

పలు కారణాలతో ఆగిన నిర్మాణాలు

ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షలు మంజూరు చేస్తుంది. చాలాచోట్ల ఇళ్ల నిర్మాణాలు పలు కారణాలతో నిలిచిపోయాయి. సోమశిలలో 100, మంచాలపల్లిలో 20 ఇళ్ల నిర్మాణాల బాధ్యత ఓ గుత్తేదారుకు అప్పగించగా రెండు చోట్లా కొన్ని నిర్మాణాలు పునాది దశ కూడా దాటలేదు. త్వరగా పనులు చేసేలా అధికారుల చర్యలు లేవని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. అనంతసాగరంలో నాలుగు లేఅవుట్లు వేసి 300 గృహాలు మంజూరు చేయగా ఇంతవరకు పనులు ముగించుకొని ఇళ్లలోకి వెళ్లిన వారి సంఖ్య 15లోపే. ఇక అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన సిమెంటు, ఇటుక, ఐరన్, కంకర, ఇసుక, బేల్దారు మేస్త్రీల ఖర్చులు పెరగడంతో పాటు కొన్నిచోట్ల సదుపాయాలు లేక లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఇదిలా ఉంటే త్వరలో సార్వత్రిక ఎన్నికలు వస్తున్నాయి. వచ్చే బిల్లులకు ఇబ్బందికర పరిస్థితి ఉంటుందేమోనని ఇళ్ల నిర్మాణదారులు ఆందోళనకు గురవుతున్నారు. కాగా, ఇళ్ల పురోగతిపై అనంతసాగరం హౌసింగ్ ఏఈ శరత్‌ను వివరణ కోరగా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసేలా దృష్టిసారించామని, ఎప్పటికప్పుడు బిల్లులు పెడుతున్నాం.. బిల్లు మంజూరులో జాప్యం లేదని తెలిపారు.

వెంకయ్యనాయుడుకు ప్రవాసాంధ్రుల అభినందనలు


వెంకయ్యను సన్మానిస్తున్న ప్రవాసాంధ్రులు

వరికుంటపాడు, ఫిబ్రవరి 14: మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును బుధవారం నియోజకవర్గ బీజేపీ నాయకుడు, కర్నాటక ఫిలిం సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు గంగవరపు సుబ్బారావు ఆధ్వర్యంలో బెంగళూరులో స్థిరపడిన ఉదయగిరి ప్రాంత వాసులు రాజ్‌భవన్‌లో కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి పద్మవిభూషణ్ బిరుదుతో సత్కరించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కూనల వెంకటేశ్వరరావు, మద్దినేని మోహనరావు, ఇడుమకంటి లక్ష్మిరెడ్డి, రెడ్లదిన్నె కేశవరావు, కురుగొండ్ల దామోదర్, కరణం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం


నివాళులు అర్పిస్తున్న ఎంవీఐ రాములు, సిబ్బంది

ఆత్మకూరు, ఫిబ్రవరి 14: స్థానిక మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంవీఐ రాములు, సిబ్బంది, వాహనదారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అన్నప్రసాద భవనానికి విరాళం


కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

కందుకూరు, ఫిబ్రవరి 14: పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి దివి రవిశేఖర్, రమణమ్మ దంపతులు బుధవారం రూ. 1,00,116లు విరాళంగా అందజేశారు. తమ కుమారుడు దివి ప్రణీత్ చౌదరి జ్ఞాపకార్థం ఈ నగదు అయ్యప్పసేవా సంఘం కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సేవాసంఘం సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి పాల్గొన్నారు.

పసుపులేటి సభకు తరలిన అభిమానులు


సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

అల్లూరు, ఫిబ్రవరి 14 : పీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ పసుపులేటి సుధాకర్ బుధవారం కావలిలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు అల్లూరుకు చెందిన ఎల్లు సాల్మన్ రాజు ఆధ్వర్యంలో అభిమానులు భారీగా తరలివెళ్లారు. సుమారు 100 ఆటోల్లో ప్రజలు తరలి వెళ్లడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

బీజేపీ నేత మృతికి పలువురి సంతాపం


జనార్ధన్‌రావు పార్థివదేహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

చిట్రగుంట, ఫిబ్రవరి 14: బోగోలు పంచాయతీ అక్కరాజువారికండ్రిగకు చెందిన బీజేపీ నేత బొద్దులూరి జనార్ధన్‌రావు మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు. బుధవారం ఆయన పార్థివ దేహాన్ని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీ.భరత్‌కుమార్ యాదవ్, కావలి టౌన్ అధ్యక్షుడు కే.బ్రహ్మానందం, నియోజకవర్గ ఇంచార్జి సీవీసీ సత్యం, మాజీ అధ్యక్షుడు గుర్రం వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, మస్తానయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎల్.సురేష్‌బాబులు నివాళులర్పించారు.

గృహ నిర్మాణ సిమెంట్‌పై ఈఈ విచారణ


విచారణ చేస్తున్న ఈఈ దయాకర్

సంగం, ఫిబ్రవరి 14: స్థానిక గృహ నిర్మాణ శాఖకు మంజూరైన సిమెంట్‌ను లబ్ధిదారులకు ఇవ్వకుండా సీఆర్‌వో (సిమెంట్ రిలీజ్ ఆర్డర్)లు తీయడంపై గృహ నిర్మాణ శాఖ ఈఈ దయాకర్ బుధవారం విచారణ జరిపారు. తమ ఐడీ లాగిన్‌ల నుంచి లబ్ధిదారుల పేరుతో ఏఈ కరీముల్లా సీఆర్‌వోలు తీశారని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈఈ దయాకర్ డీఈ ముక్తహార్ సమక్షంలో ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లను విచారించారు. సీఆర్‌వోలు తీసి సిమెంట్ పంపిణీ చేయని జాబితాను లబ్ధిదారుల వారీగా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పూర్తి సమాచారంతో లిఖిత పూర్వకంగా అందచేయాలని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ సీఆర్‌వోలు తీసి సిమెంట్ పంపిణీ చేయని లబ్ధిదారులందరికీ సిమెంట్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ కరీముల్లా, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

కావలి, ఫిబ్రవరి 14: జన విజ్ఞాన వేదిక కావలి పట్టణ శాఖ ఆధ్వర్యంలో జరుగుతోన్న సైన్స్‌డే వారోత్సవాల్లో భాగంగా బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూనియర్లకు మా ఇంటి పెరటితోట, సీనియర్లకు మాబడి పర్యావరణహితం అనే అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు చక్కని చిత్రాలు వేశారు. 25 స్కూళ్ల నుంచి 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక బాధ్యులు జానకిరాం, హరినాథ్, సుబ్బరాయశర్మ, సీ.శారద, ఖాదర్‌బాషా, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం మధ్యాహ్నం రెడ్‌క్రాస్ భవనంలో జానపద, శాస్త్రీయ నృత్య పోటీలు జరుగుతాయని జేవీవీ బాధ్యులు తెలిపారు. పాఠశాల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ పిల్లలను ఈ పోటీలకు పంపాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్య పెంచాలని జిల్లా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవల నోడల్ అధికారి దయాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీల్లో 24 గంటలు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. దీర్ఘకాలిక రోగులు, హైరిస్కు గర్భిణులను గుర్తించి వారి ఇంటికెళ్లి వైద్యసేవలు అందించాలన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఏఎన్ఎంలు యాప్‌ల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సంబంధిత రికార్డులు పరిశీలించి సిబ్బందికి తగుసూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శివకల్పన, వినీత, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, సీహెచ్‌వో శివకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి భారత్ బంద్‌ను జయప్రదం చేయండి


కావలి: మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

కావలి, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు ఈనెల 16న జరిగే భారత్ బంద్, గ్రామీణ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. కావలి సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో సీపీఎం నేత పసుపులేటి పెంచలయ్య, సీపీఐ నేత కే.నరసింహారావు, సీపీఐ(ఎంఎల్) నాయకుడు ఎల్ లక్ష్మీరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కరువది భాస్కర్, స్త్రీ విముక్త సంఘటన నాయకురాలు శ్యామల తదితరులు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ఇబ్బందికరమైన నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

సీతారామపురం : స్వామినాథన్ కమిషన్ సిఫారసులను తుంగలో తొక్కి బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన సాగుచట్టానికి వ్యతిరేకంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన గ్రామీణ భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్ కార్యక్రమంలో రైతులు, ప్రజలు, కార్మికులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

స్వాధీనం చేసుకున్న భూమి నిరుపేదలకు ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వింజమూరు, ఫిబ్రవరి 14 : పట్టణంలోని సర్వే నెంబరు 131, 132లో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని నిరుపేదలకు ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులిచెర్ల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సదరు భూములను పూర్వం నుంచి ఉన్న దారులను సర్వే చేసి రైతులకు పక్కాగా ఇవ్వాలని తహసీల్దారును మండల బీజేపీ డిమాండ్ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఉదయగిరి బీజేపీ ఇన్‌చార్జ్ కదిరి వెంకటరంగారావు, మండల కన్వీనర్ డేగా మధుయాదవ్, వీహెచ్‌పీ కావలి జిల్లా అధ్యక్షుడు ఎంబీ శేషారెడ్డి, వె .వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, మెంటా రమేష్, వెంకయ్య, పోలిశెట్టి సత్యనారాయణ, జిల్లెల్ల శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో కోటాయపల్లి విద్యార్థి ప్రతిభ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: మండలంలోని కోటాయపల్లి గ్రామానికి చెందిన దుద్దుకూరి మోహన్ మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 93.20 పర్సంటైల్ సాధించి తన ప్రతిభ చాటాడు. అడ్వాన్స్‌డ్‌లోనూ ఉత్తమ ర్యాంకు సాధిస్తానని మోహన్ ధీమా వ్యక్తం చేశాడు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: జిల్లాస్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ పోటీల్లో ఉదయగిరి బీసీ కాలనీ ఎంపీయూపీఎస్ ఉర్దూ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల నుంచి సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ఎస్ ఆరాఫత్ ఆధ్వర్యంలో షేక్ సుఫియాన్ తయారుచేసిన స్మార్ట్ కార్ పార్కింగ్ కిడ్స్ సేఫ్టీ ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. ఈనెల 18న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. అలాగే ఉమెన్ సేఫ్టీ విత్ యాజింగ్ జీపీఎస్ అండ్ జీఎస్ఎం ప్రదర్శన జిల్లాస్థాయికి ఎంపికైందన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతోపాటు సైన్స్ ఉపాధ్యాయుడిని అభినందించారు.

సోమశిలలో 21.581 టీఎంసీల నీరు

అనంతసాగరం, ఫిబ్రవరి 14: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి జలాశయంలో 21.581 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తరకాలువకు 600, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

వైసీపీ రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయ్ : పొన్నెబోయిన


ఉదయగిరి రూరల్: విలేఖరులతో మాట్లాడుతున్న చెంచలబాబు


లింగసముద్రం : మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయని, త్వరలో ఆ పార్టీకి ప్రజలు చరమగీతం పాడనున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పేరుతో పేదలను వైసీపీ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. వైసీపీ పాలనలో అన్నిరకాల ధరలు పెరిగిపోవడంతో సామాన్యుని జీవనం భారమైందన్నారు. హైదరాబాదు రాజధానిగా ఉండాలని వైవీ సుబ్బారెడ్డి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దామా అని రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో 160 అసెంబ్లీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు మాబాషా, సురేష్, రాజా, బాలఅంకయ్య, మస్తాన్, రామ్మోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు సమాయత్తంకండి : ఇంటూరి

లింగసముద్రం : రాబోయే ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలని కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని అన్నెబోయినపల్లిలో 'మన గ్రామానికి - మన ఇంటూరి' ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పార్టీ సీనియర్ నాయకుల సూచనలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం పలు విషయాలపై తెలుగు తమ్ముళ్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కామినేని ప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు


ముస్తాబైన ఆలయం

వరికుంటపాడు, ఫిబ్రవరి 14: స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా నిర్మించిన పద్మావతి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ బింబప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తొలిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు, ప్రవేశబలి, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన నిర్వహించడం జరుగుతుందన్నారు. 16న సహస్రనామ పారాయణం, క్షీరాధివాసము, నివేదన, 17న ప్రత్యేక పూజలు, జలాధివాసము, 18న కలశస్థాపన, అష్టబంధ సమర్పణం, బింబస్థాపన, 19న ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విశ్వరూప దర్శనం, కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

డీబీఎస్ కళాశాలలో రక్తదానం


రక్తదాతలను అభినందిస్తున్న యాజమాన్యం

కావలిటౌన్, ఫిబ్రవరి 14: డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ టీవీ రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాన్ని కళాశాల కార్యదర్శి దామిశెట్టి బలసురేష్‌బాబు, కరస్పాండెంట్ సుధీర్ నాయుడు ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

బస్టాండ్ ప్రాంగణం ప్రారంభం

అనంతసాగరం, ఫిబ్రవరి 14: మండలంలోని అనంతసాగరంను నెంబర్1 స్థానంలో నెలబెడతానని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. బుధవారం జరిగిన విజయీభవ యాత్ర కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా దివంగత మాజీ జెడ్పీటీసీ బుట్టి వెంటకృష్ణారెడ్డి పేరిట వారి కుటుంబ సభ్యులు నిర్మించిన బస్టాండ్ ప్రాంగణంను ప్రారంభించారు. అలాగే నూతన పశువైద్యశాల, సచివాలయం 2, అతిథి గృహాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, అంకిరెడ్డి, ఎద్దుల శ్రీనివాసలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

చేజర్ల: మండలంలోని ఏటూరు గ్రామంలో ఇటీవల మృతిచెందిన ఉట్లపల్లి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను బుధవారం ఆత్మకూరు నియోజకవర్గ శాసనసభ్యుడు మేకపాటి విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకుడు రఘురామిరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, జడ్పీటీసీ పీర్ల పార్థసారధి, నాయకులు సుధాకరరెడ్డి, గంగాధర్‌రెడ్డి, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గురువారం మండలంలోని ఆదురుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మేకపాటి పలు అభివృద్ధి పథకాలు ప్రారంభించనున్నట్లు, ఎమ్మెల్యే కార్యాలయపు సిబ్బంది తెలిపారు.

5 నెలలుగా అందని రేషన్ సరుకులు

చిట్రగుంట, ఫిబ్రవరి 14: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామానికి 5 నెలలుగా రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామంలోని 8వ నెంబరు షాపులో 240కి పైగా రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి సరుకులు అందడం లేదన్న విషయమై ఎండీయూ ఆపరేటర్‌ను ప్రశ్నించగా రేషన్ షాపు డీలర్ స్టాక్ సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయ్‌ని వివరణ కోరగా గురువారం నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: స్థానిక పంచాయతీ బస్టాండ్ సమీపంలోని అన్నపూర్ణ కాంప్లెక్సులో బుధవారం జడ్పీటీసీ మోడి రామాంజనేయులయాదవ్, మండల వైసీపీ కన్వీనర్ గానుగపెంట ఓబులరెడ్డిలు వైసీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ గౌస్ మొహిద్దీన్, నాయకులు కె.నరసింహారెడ్డి, నారపరెడ్డి, దర్వేష్, దారపనేని చెన్నయ్య, ఉప్పుటూరి హరి పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులకు తీవ్రనష్టం

● ఉద్యోగ జేఏసీ చైర్మన్ శివకుమార్


కావలిటౌన్: నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

కావలిటౌన్, ఫిబ్రవరి 14: నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఉద్యోగ జేఏసీ చైర్మన్ శివకుమార్ పేర్కొన్నారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుతో బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద డివిజన్ జేఏసీ నేతల నిరసన కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ 11వ పీఆర్సీ ఉద్యోగులను నిరాశకు గురి చేసిందని 12వ పీఆర్సీపై ప్రభుత్వపై జేఏసీ ఒత్తిడి తేవడంతో 12 పీఆర్సీపై కమిటీ ఏర్పాటు చేసి 8నెలలు గడుస్తున్నప్పటికీ అతీగతీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి ఉద్యోగులు విసిగి వేసారిపోయారని ఉద్యమ బాట తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రావు, ఫ్యాప్టో మధు, దీక్షితులు, బ్రహ్మయ్య, పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, తక్షణం 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏపీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం కందుకూరులో నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ గత జూలై 1 నుంచి 12వ పీఆర్సీ అమలుకావాల్సి ఉండగా నేటికీ పీఆర్సీ కమిషన్ నివేదిక కూడా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పింఛన్‌దారులు, కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ లాంటి ఫండ్‌ల ద్వారా రుణాలకు ప్రయత్నించినా దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎన్జీవో సంఘం నాయకులు జీవీవీ ప్రసాదరావు, బాలరాజు, సుజాత, రజిత, ఉపాధ్యాయసంఘాల నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, మునీర్‌బాషా, అశోక్, పెన్షనర్లసంఘం నాయకులు నరసింహం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసేవారికే మద్దతు : యూటీఎఫ్


పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

అనంతసాగరం, ఫిబ్రవరి 14: ఓట్ ఫర్ ఓపీఎస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతసాగరంలో యూటీఎఫ్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల అధ్యక్షులకు పోస్టుకార్డు రాసి.. ఈసారి ఉద్యోగులు మోసపోవడానికి సిద్ధంగా లేరని, ఏపార్టీ అయితే మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలుచేస్తామని ప్రకటిస్తారో ఆపార్టీకి మద్దతిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి, సభ్యులు వెంకటసుబ్బయ్య, పాపిశెట్టి నరసింహులు, తిరుపాలు, గౌస్‌బాష, శైలజ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి ఎస్ఐకి అవార్డు


ఎస్పీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డికి జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి బుధవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రశంసాపత్రం అందజేశారు. అలాగే ఉదయగిరి కోర్టు కానిస్టేబుల్ సుబ్బయ్య విధి నిర్వహణలో ప్రతిభ చూపడంతో ఎస్పీ ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ వేల్పుల గిరిబాబుతోపాటు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు.

ఉదయగిరిలో రచ్చబండ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 14: ఉదయగిరి పట్టణంలో బుధవారం రచ్చబండ కార్యక్రమాన్ని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నిర్వహించారు. తొలుత దర్గాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇందిరానగర్‌కాలనీ, సినిమాహాలువీధి, ఎస్సీ కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువ నాయకుడు అభినయ్‌రెడ్డి, జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ జీ.ఓబులరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, అక్కి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు ప్రారంభం

సీతారామపురం : ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి బుధవారం మండలంలోని పబ్బులేటిపల్లి, అయ్యవారిపల్లి, బాలాయపల్లిలోని నూతన సచివాలయాలను ప్రారంభించారు. అనంతరం పబ్బులేటిపల్లి సచివాలయ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణరెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్య, సీతారామపురం ఎంపీటీసి పాలగిరి అల్లూరురాజు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

దోమలకు ఆవాసాలుగా ఖాళీ స్థలాలు

● వ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు


ఖాళీ స్థలంలో చేరిన మురికి నీరు

ఆత్మకూరు, ఫిబ్రవరి 14 : మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీపంలో తదితర ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఖాళీ స్థలాలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వీటి యజమానుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికి తోడు ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడంతో పరిసర ప్రాంత ప్రజల మురికినీరు అందులోకి వదులుతుండడంతో మురికికూపాలుగా మారుతున్నాయి. గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఖాళీ స్థలాల్లో తాగేసిన కొబ్బరిబొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామాగ్రి, పాత టైర్లు వంటివన్నీ పడేశారు. వర్షం పడగానే వాటిలో నీళ్లు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమలు పెరుగుతున్నాయి. ఈ ఖాళీస్థలాల చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలో డెంగీ, మలేరియా, టైఫస్ వంటి జ్వరాల బారినపడిన బాధితులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని వ్యాధుల బారి నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.